
శ్రీశ్రీ సినిమా పాటలు
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM సిటీ


పేపర్ లీక్ నియంత్రణ చట్టసవరణ విద్యార్థులను శాంతింపజేసేందుకే...
ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మండిపాటు 07

ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబోమన్న హామీని నిలబెట్టుకోవాలి
పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్


సంపుటి 29, సంచిక: 42 | శుక్రవారం | 31-07-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## మెరుగైన విద్యా బోధనకు
# ఏం కావాలో చెప్పండి



### మండలంలోని పాఠశాలల్లో ఏం వసతులు, ఎంతమంది ఉపాధ్యాయులు కావాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేందుకు అవసరమైన అంశాలతో ప్రణాళిక ఇవ్వండి
- అందుకు అనుగుణంగా కార్యాచరణ రూపొందిస్తాం
- విద్యపై ఎంతైనా ఖర్చుపెట్టేందుకు ప్రభుత్వం సిద్ధం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి
- ఫిన్లాండ్, జర్మనీల్లో పర్యటించిన ఉపాధ్యాయులతో సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతి మండలాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన ప్రణాళికను రూపొందించాలని ఉపాధ్యాయులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు.మండలంలోని పాఠశాలల్లో ఏం వసతులు, ఎంత మంది ఉపాధ్యాయులు కావాలి, మెరుగైన విద్యా బోధనకు తీసుకోవాల్సిన చర్యలు?, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేందుకు అవసరమైన అంశాలతో 'డిసెంబరు నెలాఖరు' వరకు ప్రణాళికను తమకు అందజేస్తే, అందుకు అనుగుణంగా తాము కార్యాచరణను రూపొందిస్తామని వెల్లడించారు. విద్యపై ఎంత మొత్తమైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విదేశీ పర్యటనలో తెలుసుకున్న అంశాలను ఇక్కడి విద్యార్థులకు బోధించి, వారిని ప్రపంచంతో పోటీ పడే విధంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సిఎం సూచించారు.'టీచర్ ఇంటర్‌నేషనల్ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషనల్ ఎక్స్ఛేంజ్ కార్యక్రమంలో భాగంగా ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో హైదరాబాద్‌లోని ఎంసిహెచ్‌ఆర్‌డిలో గురువారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు రూపొందించే ప్రణాళిక కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆయా మండలాల నుంచి వచ్చే సూచనలు, సలహాలను ఆ వెబ్‌సైట్‌లో పొందుపర్చాలన్నారు. రానున్న ఐదేళ్లు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందిస్తామనే దీక్షను ఉపాధ్యాయులు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఒక్కో విద్యార్థిపై సగటున రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నామని,దీనిని వారి అభివృద్ధికి పెట్టే పెట్టుబడిగా చూడాలన్నారు. ప్రభుత్వం ఇంత మొత్తం ఖర్చు చేస్తున్నప్పటికీ విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు తరువాయి 8లో

### విద్యాశాఖకు ఎందుకు రాజీనామా చేయాలి?

కొందరు తాను విద్యా శాఖ మంత్రిగా రాజీనామా చేయాలని చెబుతున్నారని, ఎందుకు రాజీనామా చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు బ్రేక్‌ఫాస్ట్ ఇస్తున్నందుకా?, టీచర్ల నియామకం, ప్రమోషన్లు సక్రమంగా చేపట్టినందుకా?, లేదా ఐటిఐలను ఎటిసిలుగా మార్చినందుకా?, స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినందుకా? అని సిఎం నిలదీశారు. ప్రపంచంలోనే సక్సెస్ అయిన కార్పొరేట్ సంస్థల యజమానులను స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ మెంబర్స్ గా నియమించినందుకా? ఎందుకు తాను రాజీనామా చేయాలో సమాధానం చెప్పాలని సిఎం డిమాండ్ చేశారు. ఓట్ల కోసం, రాజకీయం కోసం తాను పని చేయడం లేదన్నారు. సమాజ మార్పు కోసమే తాను విద్యా శాఖ బాధ్యతలను తీసుకున్నానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని పునరుద్ఘాటించారు.







# రాష్ట్రం అలర్ట్

- భారీ నుంచి అతి భారీ వర్షాలు
- ఉత్తర తెలంగాణకు రెడ్ అలర్ట్
- హైదరాబాద్‌కు ఆరెంజ్ హెచ్చరిక
- గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంపై వాయుగుండం, ఉపరితల ఆవర్తనం తీవ్ర ప్రభావం చూపుతుండటంతో తెలంగాణ వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రుతుపవనాలు చురుగ్గా కొనసాగుతుండగా, రానున్న వారం రోజుల పాటు తెలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. రెడ్ అలర్ట్ జారీ చేశామన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు కూడా ప్రకటించారు. గంటకు 4050 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు. శుక్రవారం ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు కూడా వీచే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మెదక్, తరువాయి 8లో

## ప్రాజెక్టులకు జలకళ

- ఉరకలేస్తున్న గోదావరి
- భద్రాచలం వద్ద 28అడుగులకు చేరిక
- జూరాలకు భారీగా వస్తోన్న నీరు : పది గేట్లు ఎత్తివేత

ఎగువ ప్రాంతాలతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో జలాశయాల్లోకి నీరు చేరుతోంది. ఈ సీజన్‌లో మొదటిసారి రిజర్వాయర్లలో నీటి నిల్వలు 33 శాతానికి చేరాయి. గోదావరిలో ప్రవాహం ఉద్ధృతంగా ఉంది. కృష్ణాలో ప్రవాహాలు బాగా ఉండి శ్రీశైలం దిశగా వరద చేరుతోంది. నిర్మల్ జిల్లాలో కడెం ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి 1,69,273 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాశయంలోకి పెద్ద నీరు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 17.14 టిఎంసిల నీటి నిల్వ, 146.90 మీటర్ల నీటి మట్టం ఉండగా, ఇన్‌ఫ్లో 2,75,413 క్యూసెక్కులు ఉంది. గురువారం రాత్రి ఎల్లంపల్లి డ్యామ్ గేట్లు ఎత్తి లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద భారీగా వచ్చి తరువాయి 8లో



## నీట్, ఎన్‌టిఎను రద్దు చేయాలి

- లీకేజీలో అరెస్టయిన వారి పేర్లు బైటపెట్టాలి
- విద్యార్థులపై దాష్టీకానికి హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాల్సిందే
- రాజ్యసభలో పేపర్ లీకేజ్ సవరణ బిల్లుపై చర్చలో సిపిఐ ఎంపి పి.సందోష్ కుమార్

న్యూఢిల్లీ : వైద్య విద్య జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష నీట్‌ను, అలాగే దానిని నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ)ను రద్దు చేయాలని సిపిఐ రాజ్యసభ సభ్యులు పి.సందోష్‌కుమార్ డిమాండ్ చేశారు. విద్యారంగం ప్రక్షాళనకు పైపై మెరుగులు సరిపోవని, సమగ్ర సంస్కరణలు అవసరమని సూచించారు. నీట్ లీకేజీకి బాధ్యత ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని, అలాగే ఢిల్లీలో విద్యార్థులపై లాఠీఛార్జి, టియర్ గ్యాస్ ప్రయోగించినందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని అన్నారు.గత నీట్ పరీక్ష కుంభకోణంలో అరెస్టయిన వారి పేర్లను బయటపెట్టాలని కోరారు పరీక్షల్లో తప్పుడు పద్ధతుల తరువాయి 12లో

## 'చందా చోర్, గద్దీ ఛోడ్'

- హోంమంత్రి అమిత్ షా సభకు రావాలి
- విరాళాల పెట్టెతో పార్లమెంట్ ఆవరణలో ప్రతిపక్ష ఎంపిల నిరసన
- భారత హాకీ జట్టు జెర్సీ కాషాయ రంగుకు మార్చడంపై మండిపాటు



న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నాటి నుంచి ప్రతిపక్ష ఎంపిలు పలు అంశాలపై రోజుకో రీతిన నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. తాజాగా గురువారం రామాలయ విరాళాల చోరీపై, విద్యార్థి నిరసనకారులపై పోలీసుల అకృత్యాలకు వ్యతిరేకంగా పార్లమెంట్ భవన్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రియాంకా గాంధీ వాద్రాతో సహా పలు ప్రతిపక్ష పార్టీల ఎంపిలు పాల్గొన్నారు. 'చందా చోర్, (విరాళాల చోరీ) గద్దీ ఛోడ్ (కుర్చీ దిగాలి), హోంమంత్రి సభకు రావాలి', విద్యార్థులపై పెల్లెట్ గన్‌ల వినియోగానికి ఎవరు అనుమతించారు' వంటి నినాదాలతో ప్రాంగణాన్ని హోరెత్తించారు. రామ మందిరంలో విరాళాల దొంగతనానికి ప్రతీకగా, ఎంపిలు తమతో పాటు ఒక విరాళాల పెట్టెను ఉంచుకుని, దానిలో డబ్బులు వేస్తూ కనిపించారు. ప్రియాంక గాంధీతో పాటు, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్, ఎస్‌పికి చెందిన ధర్మేంద్ర యాదవ్, టిఎంసికి చెందిన సాగరిక ఘోష్, జెఎంఎంకు చెందిన మహువా మాజీ తదితరులు ఈ నిరసనలో పాల్గొన్నారు. 'హోం మంత్రి అమిత్ షా ఇంకెంతకాలం దాక్కుని భారత ప్రజలకు సమాధానం చెప్పకుండా ఉంటారు? ఆయన పార్లమెంటు నుండి ఎందుకు అదృశ్యమయ్యారు?. విద్యార్థులపై పెల్లెట్ గన్లను ఉపయోగించమని ఎవరు ఆదేశించారు, అలాగే బుధవారం లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని మాట్లాడకుండా అడ్డుకున్నందుకు ఎవరు ఆదేశించారు అనే విషయాలపై స్పష్టమైన సమాధానం కోరుతూ మేము ప్రతిపక్ష ఎంపిలం మకర ద్వారం బయట నిరసన తెలుపుతున్నాము' అని వేణుగోపాల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. నిరసన తెలుపుతున్న ఎంపిలు 'ఆదేశం ఎవరు ఇచ్చారు' అని రాసి ఉన్న ఒక పెద్ద బ్యానర్‌ను ప్రదర్శించారు. ఇది, ఇటీవల నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా తరువాయి 12లో



కాషాయ జెర్సీ!

### ఎల్‌నినో సవాళ్లపై సమగ్ర కార్యాచరణకు
# రూ.803 కోట్లు

- 75 శాతం సబ్సిడీపై ప్రత్యామ్నాయ పంటల సాగు విత్తనాలు అందించాలి

### 'ఎల్‌నినో'పై చర్యలకు నిపుణుల కమిటీ సిఫార్సులు

- సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలి
- ఉపాధి హామీ ద్వారా చెక్‌డ్యాంలు, చెరువుల పూడికతీత, వర్షపునీటి సంరక్షణ పనులు చేపట్టాలని సూచన
- నివేదికను సిఎం రేవంత్‌రెడ్డికి అందజేసిన కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి



"రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖతో కలిసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం స్పష్టం చేశారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు."

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. ఈ కార్యాచరణ ప్రణాళిక అమలుకు దాదాపు రూ.802.92 కోట్ల నిధులు అవసరమవుతాయని సూచించింది. వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో సాగు విస్తీర్ణం తగ్గినందున, నీటి అవసరం ఎక్కువగా ఉండే పంటలకు బదులుగా కందులు, పెసలు, మినుములు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, రాగులు, నూనెగింజలు, కూరగాయలు, పశుగ్రాస పంటలు వంటి ప్రత్యామ్నాయ పంటలను గ్రామాల వారీ కార్యాచరణ ప్రణాళికతో విస్తృతంగా ప్రోత్సహించాలని కమిటీ సూచించింది. ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను 75 శాతం వరకు సబ్సిడీపై రైతులకు అందించాలని సిఫార్సు చేసింది. ఈ నివేదికను నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి,వ్యవసాయ శాఖ సీనియర్ అధికారులు కృపాకర్ రెడ్డి, తరువాయి 12లో



07

నీట్ లీకేజీ ఉద్యమం విజయం సాధించినందుకు సిజెపి అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, ఎఐఎస్‌ఎఫ్ దినేష్ సి.రంగరాజ్‌లను అభినందిస్తున్న సిపిఐ ప్రధాన కార్యదర్శి, డి.రాజా, జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్




## 10న దేశవ్యాప్తంగా కార్మికులు, రైతుల నిరసన

- రైలు, రోడ్డు దిగ్బంధనాలు, మానవహారాలు, పలురూపాల్లో ప్రదర్శనలు
- జీవనోపాధి, రాజ్యాంగ హక్కుల సాధన ప్రధాన లక్ష్యం
- మోదీ ప్రభుత్వంపై సమన్వయ పోరాటాలు తీవ్రతరం చేయాలి
- రుణ వసూళ్ళ దోపిడీ అరికట్టకపోతే శాసనోల్లంఘన, భారత్ బంద్
- ఢిల్లీలో జరిగిన సంయుక్త జాతీయ సదస్సు పిలుపు

డా॥జ్ఞాన్ పాఠక్

న్యూఢిల్లీ : జీవనోపాధి,రాజ్యాంగ హక్కుల సాధనకోసం దేశవ్యాప్తంగా కార్మికులు–రైతులు ఆగస్టు 10వ తేదీన నిరసన ప్రదర్శనలు చేయాలని జాతీయ సదస్సు పిలుపు ఇచ్చింది. ఆరోజున రైలు–రోడ్డు దిగ్బంధనలు, కార్యాలయాలలో నిరసన ప్రదర్శనలు, మానవహారాలు, పలు రూపాల్లో జిల్లా, రాష్ట్రస్థాయిల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టాలని కోరింది. పది జాతీయ కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా తరువాయి 8లో

### ఉద్యోగుల బకాయిలు మరో
## రూ. 2000 కోట్లు విడుదల

100 రోజుల్లో రూ.6 వేల కోట్ల బకాయిల చెల్లింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగులకు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకుంది. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు గురువారం ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మరో రూ.2 వేల కోట్లను విడుదల చేశారు. దీంతో ఉద్యోగ జెఏసి నాయకులకు ఇచ్చిన మాట మేరకు 100 రోజుల్లో ఇప్పటి వరకు మొత్తం రూ.6 వేల కోట్ల బకాయిలను మూడు విడతల్లో విడుదల చేసింది. గత మే 29న తొలి విడతగా రూ.2 వేల కోట్లు, తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
31-07-2026
www.prajapaksham.in





# ఉపశమన వర్షాలు

రెండు, మూడు రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు ఉపశమనాన్ని కలిగిస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో నైరుతి రుతుపవనాలు ప్రారంభమై నెల రోజులు దాటినా పెద్దగా వానలు పడలేదు. దీంతో అనేకచోట్ల ఖరీఫ్‌లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. అంతకుమించి తాగునీటి సంక్షోభం తరుముకొస్తుందా అనే సందేహాలు ముసిరాయి. ఈ వారం మొదట్లో రాష్ట్ర వ్యాప్తంగా జలాశయాల్లో నీటి మట్టాలు కేవలం 30 శాతంగానే నమోదయ్యాయి. సాధారణంగా ఈ సమయానికి ప్రాజెక్టులన్నీ జలకళతో తొణకిసలాడేవి. రైతులు పంట పనుల్లో నిమగ్నమయ్యే వారు. కానీ, రాష్ట్రంలో తద్భిన్నమైన పరిస్థితి కనపడింది.

ఎగువన కృష్ణా నది నుంచి, అలాగే గోదావరి నది నుంచి నీళ్ళు రాక రిజర్వాయర్‌లు వెలవెలబోయాయి.అయితే, కర్నాటకలో నెల మధ్యలో వర్షాలు కురియడంతో కృష్ణా నదిలో జలాలు వచ్చినా, ఎగువ రాష్ట్రాలు ప్రాజెక్టులను నింపుకోవడంలోనే నిమగ్నమయ్యాయి. వర్షాలు పెరగడంతో ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాలు నిండ నిండి, వారం రోజులుగా నీళ్లు వదులుతుండడంతో జూరాలకు చేరుకున్నాయి. ఇది కృష్ణా ప్రాజెక్టుల పరిధిలో, ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాలకు ఉపశమనాన్ని కలిగించింది. ఉత్తర తెలంగాణలో పరిస్థితి వర్షాలు పడక, నిన్న మొన్నటి వరకు పరిస్థితి క్లిష్టంగా ఉండేది. గోదావరి నది పరిధిలో వర్షాలు రాక శ్రీరామ్‌సాగర్, కడెం, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులు వెలవెలబోయాయి. అదే సమయంలో ప్రాణహిత నది జలకళ నింపుకొని ప్రవహిస్తుండడం, మేడిగడ్డ వద్ద పరవళ్లు తొక్కడంతో బిఆర్‌ఎస్ పక్షం రోజులుగా జలరాజకీయాలు రాజేసింది. కన్నెపల్లి పంపు హౌజు నుంచి నీరు ఎత్తిపోయాలంటూ కొత్త రాగం తీసుకొని ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టజూసింది. నిజానికి కన్నెపల్లి పంపుహౌజ్ వద్ద నీళ్ళెత్తిపోసినా, ఎగువన అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలు మూసివేస్తేనే, ఎల్లంపల్లికి ప్రాణహిత నది నీటిని వెనక్కి ఎత్తిపోయవచ్చు. ఆ బ్యారేజీలు కూడా మేడిగడ్డలాగానే బలహీనంగా ఉన్నాయని, గేట్లు తెరిచే ఉంచాలని ఇదివరకే రాష్ట్ర ప్రభుత్వాన్ని జాతీయ ఆనకట్టల భద్రత ఏజెన్సీ(ఎన్‌డిఎస్‌ఎ) హెచ్చరించింది.

ఈ నేపథ్యంలో తీవ్ర వాయుగుండం ఫలితంగా ఉత్తర తెలంగాణలో వర్షాలు మూడు రోజులుగా జోరందుకున్నాయి. రెండు రోజుల క్రితం తీరం దాటిన తీవ్ర వాయుగుండం పశ్చిమదిశలో పయనిస్తూ, రాష్ట్రంలో ఉత్తర దిశగా వెళ్తుండటంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురిసి, వాగులు, వంకలు పొంగిపొరలుతున్నాయి. ఫలితంగా వట్టిపోయిన కడెం ప్రాజెక్టు నుంచి, శ్రీరాంసాగర్ నుంచి ఎల్లంపల్లికి గోదావరి పరుగులు తీసింది. దీంతో కన్నెపల్లి పంపుహౌజు నుంచి ప్రాణహిత నీటిని ఎల్లంపల్లికి లిఫ్ట్ చేయాలన్న బిఆర్‌ఎస్ సృష్టించిన రాజకీయ వేడి చప్పున చల్లారింది. ప్రాణహిత జలాలు అవసరం లేకుండానే ఎల్లంపల్లి ప్రాజెక్టుకు చేరుకున్న సహజ గోదావరి నదీ ప్రవాహ జలాలనే నంది మేడారం పంపు హౌజు వద్ద నాలుగు పంపు హౌజులను ఆన్ చేసి, దిగువ మిడ్ మానేరుకు తరలించడం ప్రారంభించారు. ఉత్తర తెలంగాణకు కొంత ఊరటను కలిగించింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం జలరాజకీయ చక్రవ్యూహం నుంచి బైటపడినట్లయింది.

అయినప్పటికీ, రాష్ట్రానికి నీటి కొరత తీరినట్లేనని భావించకూడదు. ఎల్‌నినో ప్రభావం వచ్చే ఏడాది జూన్ వరకు కొనసాగే సూచనలు ఉన్నాయని వాతావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఎల్‌నినో కాలంలో దీర్ఘకాలం వర్షాలు పడకుండా ఉండడంతో పాటు, మధ్య మధ్యలో ఆకస్మికంగా రెండు మూడు రోజులు వర్షాలు పడతుంటాయని చెబుతున్నారు. ఈ వర్షాలతో వర్షపాతం లోటు తగ్గినట్లు అంకెల్లో కనపడినా వాస్తవంలో ప్రతిబింబించదు. ప్రస్తుతం తెలంగాణలో పడుతున్న వర్షాలతో లోటు వర్షపాతం తగ్గింది. రెండు వారాల క్రితం సగటున 33 శాతం లోటు వర్షాలు ఉండగా, ఇప్పటి వానలతో అది 22 శాతానికి చేరుకుంది. ఇంకా 13 జిల్లాల్లో అంత కంటే ఎక్కువగా నమోదైంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లో వర్షాలు పెద్దగా పడలేదు. కాబట్టి ఈ వర్షాలకే ప్రభుత్వం, రైతులు సంతోషిస్తే, మబ్బులను చూసి నీటిని పారబోసుకున్నట్లే అవుతుంది. ప్రభుత్వం చెబుతున్నట్లుగా రైతులు వరి వంటి వర్షాధార పంటలను తగ్గించి, మెట్ట పంటలకు సిద్ధం కావాలి. ఈ వర్షాలను చూసుకొని వరిపంటకోసం ముందుకుపోతే మొదటికే ప్రమాదం. వచ్చిన నీటిని జాగ్రత్తగా జలాశయాలలో భద్రపరుస్తూ, ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా వినియోగించుకోవాలి. ఎల్‌నినో ప్రభావంపై రాష్ట్రం ప్రభుత్వం వేసిన కమిటీ తన నివేదికను ముఖ్యమంత్రికి సమర్పించింది. అలాగే కంటింజెన్సీ ప్లాన్‌లు రూపొందించటమే కాకుండా, క్షేత్రస్థాయిలో అమలు అంతకంటే ముఖ్యం. •



## బిజెపి నుంచి బెదిరింపులు వచ్చాయి

నాకు చాలా బెదిరింపులు వచ్చాయి. బిజెపిలో చేరితే మీకూ, మీ కుటుంబానికీ అంతా మంచే జరుగుతుందని చెప్పారు. మోదీ, అమిత్ షాల మనవడి వయసులో ఉన్నవాడిని నేను. అలాంటి నన్ను బెదిరించే పరిస్థితి వస్తే, ఇంత పెద్ద ప్రధాని, హోం మంత్రి పదవులు ఉండి ఏమి లాభం? సంస్కృతిని దెబ్బతీయడం అని రాందేవ్ బాబా అంటున్నారు. ప్రజాస్వామ్యం, విద్య, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, మన భవిష్యత్తు కోసం పోరాడటం సంస్కృతిని దెబ్బతీయడమైతే, మేము అదే చేస్తున్నాం. సుప్రీంకోర్టు తప్పబట్టిన పతంజలి ఉత్పత్తుల సమస్యను రాందేవ్ ముందుగా పరిష్కరించుకోవాలి.

– మీడియాతో అభిజీత్ దిప్కే,
సిజెపి వ్యవస్థాపకుడు




# భ్రమలు గొలుపుతున్న కోచింగ్ సెంటర్లు

విద్య అనేది ఒక వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనం. సమాజ అభివృద్ధికి, దేశ ప్రగతికి విద్యే మూలాధారం. కానీ ఇటీవలి కాలంలో విద్యారంగం క్రమంగా వ్యాపారరంగంగా మారిపోతోందనే విమర్శలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఇంజినీరింగ్, మెడిసిన్, ఐఐటి, నీట్, జెఇఇ, సివిల్స్, బ్యాంకింగ్, గ్రూప్స్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ అందించే కోచింగ్ సెంటర్లు తమ ప్రచారంతో విద్యను వ్యాపార వస్తువుగా మార్చుతున్నాయి. ప్రతి సంవత్సరం ఎంట్రన్స్ పరీక్షల ఫలితాలు వెలువడగానే దినపత్రికలు, టెలివిజన్ ఛానళ్లలో రంగురంగుల ప్రకటనలతో ప్రజలను ఆకర్షించే ప్రయత్నం జరుగుతోంది. ఈ ప్రకటనలు విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంచడమే కాకుండా, అనవసరమైన మానసిక ఒత్తిడి, ఆర్థిక భారం, అసమానతలను కూడా పెంచుతున్నాయి. అందువల్ల కోచింగ్ సెంటర్ల ప్రకటనలను పూర్తిగా నిషేధించాలనే డిమాండ్ సమంజసమైనదే.

ప్రస్తుతం ఒక విద్యార్థి విజయం సాధిస్తే, ఆ విద్యార్థి ఫోటోను పత్రికల్లో పూర్తి పేజీ ప్రకటనగా ప్రచురించడం, టివిల్లో పదేపదే ప్రసారం చేయడం సాధారణమైపోయింది. ‘ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ మా సంస్థదే’, ‘టాప్10లో మా విద్యార్థులే’, ‘వంద శాతం విజయమే మా లక్ష్యం’ వంటి ఆకర్షణీయమైన నినాదాలతో తల్లిదండ్రులను ప్రభావితం చేస్తున్నారు. అయితే ఈ ప్రకటనల్లో చూపిస్తున్న ప్రతి విజయం నిజంగా ఆ సంస్థ శిక్షణ ఫలితమేనా అనే ప్రశ్నకు స్పష్టమైన సమాధానం ఉండదు. కొందరు విద్యార్థులు కేవలం టెస్ట్ సిరీస్ మాత్రమే రాసినా, వారిని కూడా తమ విద్యార్థులుగా ప్రచారం చేయడం జరుగుతోంది. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య. ఈ ప్రకటనల వల్ల ఎక్కువగా ప్రభావితమవుతున్న వారు మధ్యతరగతి, పేద కుటుంబాలే. తమ పిల్లలు కూడా టాపర్లు కావాలనే ఆశతో తల్లిదండ్రులు లక్షల రూపాయలు అప్పులు చేసి కోచింగ్ సెంటర్లలో చేర్పిస్తున్నారు. ఒక విద్యార్థి విజయం వెనుక అతని కృషి, కుటుంబ సహకారం, పాఠశాల విద్య, వ్యక్తిగత ప్రతిభ వంటి అనేక అంశాలు ఉంటాయి. కానీ కోచింగ్ సెంటర్లు మొత్తం విజయాన్ని తమకే ఆపాదించుకుంటాయి. దీంతో తల్లిదండ్రులు తప్పనిసరిగా ఖరీదైన కోచింగ్ అవసరమనే భ్రమలో పడుతున్నారు. కోచింగ్ సెంటర్ల మధ్య పోటీ నాణ్యమైన బోధనలో ఉండాలి కానీ ప్రకటనల ఆర్భాటంలో కాదు. లక్షల రూపాయలు ప్రకటనల కోసం ఖర్చు చేయడం కన్నా, ఆ నిధులను మెరుగైన అధ్యాపకులు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ బోధన, విద్యార్థుల సంక్షేమం కోసం వినియోగిస్తే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుం ది.

దినపత్రికలు, టెలివిజన్ ఛానళ్లు కూడా ఈ ప్రకటనల ద్వారా భారీ ఆదాయం పొందుతున్నప్పటికీ, సామాజిక బాధ్యతను మరవకూడదు. ప్రభుత్వం, విద్యాశాఖ, వినియోగదారుల పరిరక్షణ సంస్థలు, ప్రకటనల నియంత్రణ సంస్థలు కలిసి కఠిన నిబంధనలు రూపొందించాలి. తప్పుడు విజయాల ప్రచారం, ర్యాంకుల దుర్వినియోగం, విద్యార్థుల ఫోటోలను అనుమతి లేకుండా ఉపయోగించడం వంటి చర్యలపై భారీ జరిమానాలు విధించాలి. అవసరమైతే దినపత్రికలు, టెలివిజన్, రేడియో, డిజిటల్ మాధ్యమాల్లో కోచింగ్ సెంటర్ల ఎంట్రన్స్ పరీక్షల ప్రకటనలను పూర్తిగా నిషేధించాలి. విద్యార్థుల విజయాల గురించి సమాచారం ఇవ్వాలంటే ప్రభుత్వ అధికారిక పోర్టల్ లేదా విద్యా సంస్థల వెబ్‌సైట్లలో మాత్రమే పరిమితం చేయాలి. విద్యార్థుల కలలను మార్కెటింగ్ సాధనంగా మార్చడం సమాజానికి మంచిది కాదు. విద్యారంగంలో నైతిక విలువలు, పారదర్శకత, సమాన అవకాశాలను కాపాడేందుకు కోచింగ్ సెంటర్లు ఇస్తున్న దినపత్రిక లు, టెలివిజన్ ప్రకటనలను రద్దు చేయడం లేదా కఠినంగా నియంత్రించడం అత్యవసరం. విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల నమ్మకం, సమాజ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ దిశగా తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అదే నిజమైన విద్యా సంస్కరణకు నాంది అవుతుంది.

ఆళవందార్ వేణు మాధవ్
8686051752

# కేంద్ర ప్రభుత్వంలో
# ప్రచారం అధికం - ఫలితాలు పరిమితం



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా లేదా వ్యతిరేకంగా ప్రచారం చేయడం ప్రజాస్వామ్యంలో సహజం. అయితే రాజకీయ ప్రచారం, ఎన్నికల నినాదాలు, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే సందేశాలు వాస్తవాల స్థానాన్ని భర్తీ చేయలేవు. ఏ ప్రభుత్వాన్నైనా లేదా ఏ ప్రతిపక్షాన్నైనా అంచనా వేయాలంటే భావోద్వేగాల కంటే ఆధారాలు, గణాంకాలు, విధానాల ఫలితాలు, ప్రజల జీవన ప్రమాణాలపై వాటి ప్రభావమే ప్రమాణం కావాలి. ఇటీవల విస్తృతంగా ప్రచారంలో ఉన్న ‘ప్రపంచమంతా భారత్ లేదా బిజెపి ఓడిపోవాలని కోరుకుంటోంది’ అనే వాదన కూడా ఇదే ప్రమాణంతో పరిశీలించాల్సిన అవసరం ఉంది.

మొదట విదేశాలు లేదా అంతర్జాతీయ శక్తులు భారత ఎన్నికల్లో ఏకపక్షంగా ఒకే పార్టీ గెలవాలని లేదా ఓడిపోవాలని కోరుకుంటున్నాయనే వాదనకు ఇప్పటివరకు బలమైన, స్వతంత్ర ఆధారాలు అందుబాటులో లేవు. అమెరికా, యూరోపియన్ యూనియన్, బ్రిటన్, కెనడా వంటి దేశాలు తమ జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని భారత ప్రభుత్వంతో కలసి పనిచేస్తాయి. ప్రభుత్వం మారినా ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగుతూనే ఉంటాయి. అమెరికాతో రక్షణ, సెమీకండక్టర్లు, సాంకేతికత, వాణిజ్యం వంటి రంగాల్లో సహకారం పెరిగింది. అదే సమయంలో మానవ హక్కులు, మీడియా స్వేచ్ఛ, మైనారిటీల భద్రత వంటి అంశాలపై విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. విమర్శలను ఎన్నికల్లో ఒక పార్టీని ఓడించాలనే కుట్రగా పరిగణించడం వాస్తవాలను వక్రీకరించడం అవుతుంది.

భారత్ రక్షణరంగం స్వయం సమృద్ధి వైపు అడుగులు వేస్తున్న మాట కొంతమేరకు నిజమే. రక్షణ ఉత్పత్తుల విలువ గత దశాబ్దంలో గణనీయంగా పెరిగింది. రక్షణ ఎగుమతులు కూడా రికార్డు స్థాయికి చేరాయి. కానీ అదే సమయంలో భారత్ ఇప్పటికీ ప్రపంచంలో అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుల్లో ఒకటిగా కొనసాగుతోంది. అందువల్ల విదేశీ ఆయుధ పరిశ్రమ మొత్తం భారత్ బలపడకూడదని చూస్తోందనే వాదనకు సరిపడే ఆధారాలు లేవు. వాస్తవానికి అమెరికా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్ వంటి దేశాలు భారత రక్షణ మార్కెట్లో భాగస్వాములుగానే ఉన్నాయి. ఆ దేశాల నుండి యుద్ధ విమానాలు, ఆయుధాల దిగుమతులు అధికంగా ఉన్నాయి. ఆయుధాల ఉత్పత్తిలో సాంకేతిక సహకారం రష్యా, ఇజ్రాయెల్ నుండి లభిస్తుంది.

రామ మందిర నిర్మాణం బిజెపికి ఒక ముఖ్య రాజకీయ, సాంస్కృతిక విజయంగా భావించబడుతుంది. అయితే ఇటీవల రామ మందిరంలో దేవుని బంగారం, వెండి, పెద్ద ఎత్తున భక్తుల ముడుపులు దోపిడీ జరగటం అయోధ్య రామమందిరం ప్రతిష్ఠను దిగజార్చింది. ఇప్పుడు భక్తుల రద్దీ తగ్గింది. భక్తుల కానుకలు, పరిసర ప్రాంతాల్లో వ్యాపారాల ఆదాయం కూడా తగ్గింది. రామమందిర నిర్మాణం అన్ని భారతీయ వర్గాల ఏకాభిప్రాయ విజయంగా చెప్పలేం. కేవలం సుప్రీంకోర్టు తీర్పు మూలంగా జరిగింది. అలాగే ఆర్టికల్ 370 రద్దు తరువాత కాశ్మీర్‌లో ఉగ్రవాద ఘటనలు తగ్గినట్లు అధికారిక గణాంకాలు సూచించినప్పటికీ, రాజకీయ ప్రక్రియ, ప్రజాస్వామ్య ప్రతినిధిత్వం, నిర్బంధాలు, పౌర స్వేచ్ఛలపై అనేక ప్రశ్నలు దేశీయ, అంతర్జాతీయ వేదికలపై లేవనెత్తబడ్డాయి. కాబట్టి ఒకే విధానాన్ని పూర్తిగా విజయంగా లేదా పూర్తిగా వైఫల్యంగా చిత్రీకరించడం సరైన విశ్లేషణ కాదు. సిఎఎ అమలైంది కానీ జాతీయ పౌరుల నమోదు (ఎన్‌ఆర్‌సి) దేశవ్యాప్తంగా ఇప్పటికీ అమల్లోకి రాలేదు. అందువల్ల ‘సిఎఎ/ఎన్‌ఆర్‌సి పూర్తిగా అమలయ్యాయి’ అనే వాద న కూడా వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించదు. నూతన విద్యా విధానం కూడా సంస్కరణల దిశగా ఒక ప్రయత్నమే అయినప్పటికీ, రాష్ట్రాల అమలు సామర్థ్యం, నిధుల కొరత, డిజిటల్ అసమానత, ఉపాధ్యాయ శిక్షణ వంటి సవాళ్లు ఇంకా కొనసాగుతున్నాయి. ఇంకా చాలా రాష్ట్రాల లో అమ లు కావడం లేదు.

దేశభక్తి ఏ పార్టీకి గుత్తాధిపత్యం కాదు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ప్రశంసించడం ఎంత అవసరమో, లోపాలు ఉంటే ప్రశ్నించడం కూడా అంతే అవసరం. విమర్శించే వారిని దేశద్రోహులుగా, మద్దతు ఇచ్చేవారిని మాత్రమే దేశభక్తులుగా విభజించడం ప్రజాస్వామ్య చర్చను బలహీనపరుస్తుంది. ఓటరు బాధ్యత ప్రచార సందేశాలను పునరావృతం చేయడం కాదు; ఆధారాలను పరిశీలించడం, వాగ్దానాలను ఫలితాలతో పోల్చడం, పాలనను ప్రశ్నించడం.

భారత్ జిడిపి రీత్యా ప్రపంచంలో నాలుగు నుంచి ఆరవ స్థానానికి పడిపోయింది. అయినా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఈ మధ్య కాలం లో ఎదగడం ఒక ముఖ్యమైన మైలురాయి. అయితే తలసరి ఆదా యం, నిరుద్యోగం, యువత ఉపా ధి, మహిళల శ్రామిక భాగస్వామ్యం, ఆదాయ అసమానత వంటి సూచికల్లో ఇంకా అనేక అభివృద్ధి చెందుతున్న దేశాల కంటే వెనుకబడి ఉన్నాం అనే విషయాన్ని మర్చిపోకూడదు. జిడిపి పరిమాణం పెరగడం ఒక్కటే ప్రజల జీవన ప్రమాణాలు సమానంగా మెరుగుపడ్డాయని ఆర్థిక శాస్త్రం నిరూపించదు.




కరోనా సమయంలో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద టీకా కార్యక్రమాల్లో ఒకదాన్ని నిర్వహించింది. ఇది పరిపాలనాపరంగా ఒక విశేష విజయం. అదే సమయంలో రెండో కరోనా అలలో ఆక్సిజన్ కొరత, ఆసుపత్రులపై ఒత్తిడి, మరణాల లెక్కలపై వచ్చిన వివాదాలు కూడా చరిత్రలో నమోదయ్యాయి. కాబట్టి విజయాలను మాత్రమే కాదు, వైఫల్యాలను కూడా గుర్తుంచుకోవాల్సిందే.

మౌలిక సదుపాయాల అభివృద్ధిలో రహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలు, రైల్వే విద్యుదీకరణ, విమానాశ్రయాల విస్తరణ, డిజిటల్ చెల్లింపుల పెరుగుదల వంటి అంశాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తుంది. అదే సమయంలో విద్య, ఆరోగ్యం, పోషకాహారం, ప్రభుత్వ పాఠశాలల నాణ్యత, పట్టణ–గ్రామీణ అసమానతల వంటి రంగాల్లో ఇంకా పెద్ద పెట్టుబడులు అవసరమని స్వతంత్ర అధ్యయనాలు సూచిస్తున్నాయి.

జిఎస్‌టి దేశవ్యాప్తంగా ఒకే పన్ను వ్యవస్థను తీసుకువచ్చింది. కానీ ప్రారంభ సంవత్సరాల్లో చిన్న వ్యాపారులు ఎదుర్కొన్న సమస్యలు, తరచూ మారిన పన్ను రేట్లు, పరిహార నిధులపై రాష్ట్రాల అభ్యంతరాలు కూడా వాస్తవాలే. అదే విధంగా డీమానిటైజేషన్ నల్లధనాన్ని అరికడుతుందని ప్రకటించినప్పటికీ, రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం చలామణిలో ఉన్న దాదాపు మొత్తం కరెన్సీ బ్యాంకులకు తిరిగి వచ్చింది. అంటే ప్రభుత్వ ప్రచారంలో నిజం లేదని తెలుస్తోంది. డీమానిటైజేషన్ అనియతరంగంపై తీవ్ర ప్రభావం చూపించిందని అనేక మంది ఆర్థిక నిపుణులు విశ్లేషించారు.

‘మంత్రిత్వ స్థాయిలో అవినీతి శూన్యం’ అనే వాదనను కూడా జాగ్రత్తగా చూడాలి. పెద్ద అవినీతి కేసుల్లో కేంద్ర మంత్రులపై తీర్పు లు లేకపోవడం ఒక విషయం అయితే, ఎన్నికల బాండ్ల వ్యవస్థపై సుప్రీంకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలు, పారదర్శకతపై వచ్చిన విమర్శలు, దర్యాప్తు సంస్థల వినియోగంపై ప్రతిపక్షాల ఆరోపణలు మరోవైపు ఉన్నాయి. ఒకప్పుడు దేశంలో అవినీతిపరులు అని బిజెపి ముద్ర వేసిన వారిలో చాలామంది ప్రముఖులు తదనంతర కాలంలో బిజెపిలో చేరి కొందరు రాజకీయ పదవులు పొందినందువల్ల అవినీతి పూర్తిగా అంతరించిపోయిందని చెప్పడం కంటే, పారదర్శకతను కోల్పోయిన ఇడి,ఐటి, సిబిఐ లాంటి దర్యాప్తు సంస్థల నివేదికలు కూడా విశ్వసనీయతను కోల్పోయాయి.

బిజెపి ప్రభుత్వంలో ‘బాంబు పేలుళ్ల లేవు’, ‘పాకిస్థాన్‌ను ఒక్క బులెట్ కూడా వేయకుండా దెబ్బతీశారు’, ‘చైనాను నియంత్రించారు’ వంటి రాజకీయ నినాదాలు కూడా అతిశయోక్తితో కూడుకున్నవే. ఉగ్రవాద ఘటనలు తగ్గిన ప్రాంతాలున్నప్పటికీ, సరిహద్దు ఉద్రిక్తతలు, గాల్వాన్ వంటి సంఘటనలు, పుల్వామ ఉగ్రవాద సంఘటనలు, భారత– చైనా సరిహద్దుల వివాదాలు ఇంకా పూర్తిగా పరిష్కారమవలేదు. విదేశాంగ విధానాన్ని విజయాల జాబితాగా లేదా వైఫల్యాల జాబితాగా కాకుండా అదొక నిరంతర ప్రక్రియగా చూడాలి.

భారత్‌లో ఐఐటిలు, ఎయిమ్స్‌లు, తాగునీటి పథకాలు, ఆయుష్మాన్ భారత్, మొబైల్ తయారీ, అంతరిక్ష పరిశోధన వంటి రంగాల్లో నిజమైన పురోగతి కనిపిస్తోంది. అయితే ఈ విజయాలు కేవలం ఒకే పార్టీకి చెందినవి అని చెప్పడం కూడా సరైంది కాదు. అనేక రంగాల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రభుత్వరంగ సంస్థల స్థాపన, మిశ్రమ ఆర్థిక విధానాలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ రంగం కలిసి చేసిన మిశ్రమ కృషి ఫలితమే.

చివరగా, ‘దేశాన్ని ప్రేమించడం అంటే కేవలం ఒకే ఒక పార్టీకి మద్దతు ఇవ్వడం’ అనే భావన ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. దేశభక్తి ఏ పార్టీకి గుత్తాధిపత్యం కాదు. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ప్రశంసించడం ఎంత అవసరమో, లోపాలు ఉంటే ప్రశ్నించడం కూడా అంతే అవసరం. విమర్శించే వారిని దేశద్రోహులుగా, మద్దతు ఇచ్చేవారిని మాత్రమే దేశభక్తులుగా విభజించడం ప్రజాస్వామ్య చర్చను బలహీనపరుస్తుంది. ఓటరు బాధ్యత ప్రచార సందేశాలను పునరావృతం చేయడం కాదు; ఆధారాలను పరిశీలించడం, వాగ్దానాలను ఫలితాలతో పోల్చడం, పాలనను ప్రశ్నించడం. ప్రజాస్వామ్యంలో బలమైన దేశాన్ని నిర్మించేది ఏకపక్ష నినాదాలు కాదు; వాస్తవాల ఆధారంగా తీసుకునే చైతన్యపూర్వక నిర్ణయాలే.

# మట్టిగోడల నుండి..‘మహానగరం’దాకా!

గొప్పింట్లో పుట్టిన వారందరూ గొప్పవారు కారు. పేదింట్లో పుట్టిన వారందరూ పేదలుగ ఉండరు. అవరోధాలను సవాలుగా తీసుకొని అవకాశాలను అనుకూలంగా మార్చుకొని ముందుకెళ్లినవారే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారు. అందుకు డాక్టర్ తిప్పర్తి యాదయ్య జీవిత ప్రస్థానం ఒక చక్కటి ఉదాహరణ. మారుమూల పల్లెలో పుట్టి మహానగరంలో ఉద్యోగంలో మణిమాణిక్యంలా వెలిగి జులై 31న పదవీ విరమణ చేస్తున్న ఆయన ఎందరికో ఆదర్శప్రాయుడు.

నల్లగొండ జిల్లా చండూరు మండలం దోనిపాముల పల్లెలో తోలు శుభ్రంచేసే తిప్పర్తి అంతయ్య మనుమడిగా, కమ్యూనిస్టు కొండయ్య కొడుకుగా, మట్టిగోడల పాఠశాలలో చింపిరి జుట్టుతో, చిరిగిన బట్టలతో అక్షరాభ్యాసం చేసి ఓనమాలు దిద్దుతూ ముచ్చటగా మూడో తరగతి వరకు చదివి, ఆపై ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న బంగారిగడ్డకు నాలుగో తరగతి చదువుకు లేత వయసులో తండ్రి కష్టమని వారించినా తాత ప్రోత్సాహంతో నడకతో నడుం బిగించి ప్రయాణమయ్యాడు. బంగారిగడ్డలో ఎనిమిదో తరగతి లేకపోవడంతో వెనక్కి రమ్మన్న తండ్రికి, తాను భారం కారాదని భావించి హాస్టల్ చదువుకు నల్లగొండకు ప్రయాణమైతే హాస్టల్ సీటు దొరకక దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు, తాత సూచనతో భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులో ఉంటూ కట్టెల పొయ్యిపై వంట చేసుకుంటూ, కంపతుమ్మ కట్టెలు కొట్టుకొచ్చుకొని వంట చేసుకుంటూ, డబ్బులు లేక రాత్రిళ్లు రైస్‌మిల్లులో బస్తా బియ్యం నింపితే రూపాయి చొప్పున సంపాదించుకుంటూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషన్ దాటాడు.

డాక్టర్ కావాలనే కోరికతో ఇంటర్ బైపిసి చదివితే సీటు రాక నల్లగొండ నాగార్జున కళాశాలలో బీఎస్సీలో చేరి విద్యార్థి దశలో రాడికల్ విద్యార్థి సంఘంలో, అటుపిమ్మట ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థి సంఘంలో రాష్ట్రస్థాయి వరకు పనిచేసి సామ్యవాద భావాలు పుణికిపుచ్చుకున్నాడు. డిగ్రీ మధ్యలోనే వదిలేసి పూర్తిస్థాయి విద్యార్థి ఫెడరేషన్, యువజన సమాఖ్య నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా పనిచేస్తున్నప్పుడు విద్యార్థి సంఘ నాయకురాలిగా ఉన్న వట్టేపు సౌజన్యతో పరిచయమై భావాలు కలిసిన బంధం ఏర్పడి, ఒకరినొకరు పెద్దలను ఒప్పించి 1984లో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కమ్యూనిస్టు పార్టీ నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కామ్రేడ్ ధర్మభిక్షం గారి ఆధ్వర్యంలో ఆదర్శ వివాహం చేసుకున్నాడు. వారికి ప్రియ శిష్యుడుగా కొనసాగినాడు. వీరికి ముగ్గురు సంతానం.

1991 డిసెంబర్‌లో హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగం రావడంతో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైంది. తన భార్యకు కూడా అప్పుడే ఉద్యోగం వస్తే ఒకే ఇంటిలో ఇద్దరికీ ప్రభుత్వ ఉద్యోగం వల్ల మరో నిరుద్యోగికి నష్టమని భావించి ఇద్దరి అంగీకారంతో అర్ధాంగి ఉద్యోగాన్ని తిరస్కరించిన ఆదర్శ దంపతులు. 1994లో ఎంఆర్‌పిఎస్ ఏర్పడినప్పుడు నల్లగొండ జిల్లా సమన్వయకర్తగా పనిచేస్తూనే, ఉద్యోగం నిబద్ధతతో చేయడం పైరవీకారులకు పనిలేక కక్షగట్టి తాండూరుకు బదిలీ చేయించారు.



తిప్పర్తి యాదయ్య
నేడు పదవీ విరమణ సందర్భంగా

తాండూరులో పనిచేస్తూ షాబాద్ బండల క్వారీల్లో పనిచేసే పిల్లలకు తాను స్వయంగా ట్యూషన్లు ఏర్పాటు చేసి చదివించగా పదో తరగతి ఫలితాల ను చూసి ఆశ్చర్యపోయిన ఆనాటి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అజయ్ జైన్ అభినందించి ప్రశంసాపత్రం ఇచ్చారు. ‘ఈ సందర్భంగా పరిశీలనకు వచ్చిన ధర్మభిక్షం గారికి అభినంద న సభ జరిపారు. మీరెంత తిన్నా మా పిల్లలకు మాత్రం కడుపునిండా భోజనం పెట్టండి’ అని హాస్టల్ వార్డెన్లను ప్రాధేయపడితే వార్డెన్లే సంభ్రమాశ్చర్యానికి లోనైన సందర్భాలెన్నో ఉన్నాయి.

ఒకవైపు ఉద్యోగం చేస్తూనే మరోవైపు దూరవిద్య ద్వారా తన ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగించారు. ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఎంఏ సోషియాలజీ పూర్తిచేసి అనంతరం హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల మురికివాడల నివాసితులలో ఆరోగ్య అవగాహన పద్ధతులు అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

2002లో హైదరాబాద్‌కు బదిలీ కాగానే అప్పుడప్పుడే మలిదశ తెలంగాణ ఉద్యమం ఊపందుకుంటున్నది. ఉద్యోగంతో పాటుగా ఉద్యమ బాధ్యతలు తోడైనవి. తెలంగాణ ఉద్యోగుల సంఘాలతో కలిసి పనిచేస్తూనే, మున్సిపల్ శాఖలో తెలంగాణ మున్సిపల్ కార్మిక ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసి పదవీ విరమణ నాటికి అధ్యక్షుడిగా సేవలందించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ మున్సిపల్ ఉద్యోగుల, కార్మికుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. సకల జనుల సమ్మె పిలుపు మేర కు తన ఉద్యోగం ఊడిపోతుందని తోటివారు వారించినా ఆనాటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి ఇంటి ముందు మున్సిపల్ వాహనాల ద్వారా చెత్త పోసి నిరసన తెలిపారు. ప్రధాన కార్యాలయంలో నిరంతరం ఉద్యమ కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రపంచ శాంతి సంఘం అనుబంధమైన అఖిల భారత శాంతి–సంఘీభావ సంఘానికి జాతీయ ఉపాధ్యక్షుడిగా అనేక దేశాలలో జరిగిన శాంతి సమావేశాల్లో భారత ప్రతినిధి గా పాల్గొన్నారు. 2005లో, 2010లో సమర్థవంతమైన అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం చేత అవార్డులు అందుకున్నారు. ఇందిరాగాంధీ జాతీయ సమైక్యత అవార్డు, భారతీయ దళిత సాహిత్య అకాడమీ, న్యూఢిల్లీచే 2016లో సేవారత్న అవార్డు, 2017 లో అఖిల భారత శాంతి సంఘీభావ అవార్డు, మరెన్నో ప్రశంసలు అందుకున్నారు. అనేక సామాజిక సంస్థల్లో, దళిత చైతన్య ఉద్యమాల్లో చురుకుగా పాల్గొన్నారు.నక్సల్బరి గర్జనకు ఏడాది ముందు జల్లుల జడివానలు కురిసే గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసంలో జన్మించి, తొలి పండుగ రక్షాబంధన్‌తో స్నేహ సంబంధాలను పుణికిపుచ్చుకొని హైదరాబాద్‌లో అందరివాడుగా ఆత్మీయంగా పిలిపించుకునే డాక్టర్ తిప్పర్తి యాదయ్య అందరికీ మంచి మిత్రుడు, అంతకుమించి ఎందరికో ఆత్మీయుడు. మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో జులై 31న సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ (జిహెచ్‌ఎంసిలో జాయింట్ కమిషనర్) హోదాలో పదవీ విరమణ చేయుచున్న డాక్టర్ తిప్పర్తి యాదయ్య అభ్యుదయ, వామపక్ష, దళిత ఉద్యమాలకు మంచి మార్గదర్శకుడు.

మహేశ్ తిప్పర్తి, మాజీ ప్రధాన కార్యదర్శి,
ఎఐఎస్‌ఎఫ్, నల్లగొండ జిల్లా

భారీ వర్షాలు

# అప్రమత్తంగా ఉండండి

జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులకు సిఎస్ సంజయ్ జాజు ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్) సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులను ఆదేశించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించిన నేపథ్యంలో ఆయన గురువారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో డిజిపి సి.వి. ఆనంద్, అదనపు డిజి మహేష్ భగవత్, విపత్తు నిర్వహణ శాఖ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌లతో పాటు పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అన్ని శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి జిల్లా కేంద్రంలో వెంటనే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. ప్రమాదకర పిక్నిక్ స్పాట్‌లకు పర్యాటకులు వెళ్లకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాల కలెక్టర్లు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను ఇప్పటికే అందుబాటులో ఉంచామని, జిల్లాలకు ఏ సహాయం కావాలన్నా ప్రభుత్వం అందిస్తుందని స్పష్టం చేశారు.

**ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన**

ఎల్‌నినో ప్రభావం వల్ల సెప్టెంబర్ నెలలోనూ వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపిన దృష్ట్యా, రైతులు కేవలం వరిపైనే ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలు వేసేలా అవగాహన కల్పించాలని కలెక్టర్‌లకు సంజయ్ జాజు సూచించారు.

**249 ప్రమాదకర జలాశయాల గుర్తింపు : డిజిపి సి.వి. ఆనంద్**

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను డిజిపి సి.వి. ఆనంద్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 249 ప్రమాదకర జలాశయాలు ఉన్న పిక్నిక్ స్పాట్‌లతో పాటు మరో 167 పర్యాటక ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. వర్షాల సమయంలో ప్రజలు ఈ ప్రాంతాలకు వెళ్లకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే, ఏ క్షణంలోనైనా సహాయక చర్యల్లో పాల్గొనేందుకు 12 కంపెనీల ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. వెల్లడించారు.

# అంగన్‌వాడీల్లో 100% మౌలిక వసతులు

అధికారులకు మంత్రి సీతక్క ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మహిళా, శిశు సంక్షేమ శాఖపై గురువారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి శృతి ఓజా, జాయింట్ డైరెక్టర్ మోతి పాల్గొన్నారు. గత ఏడాది కాలంలోనే అదనంగా 5,938 కేంద్రాలకు టాయిలెట్లు, 3,815 కేంద్రాలకు తాగునీరు, 14,271 కేంద్రాలకు విద్యుత్ సౌకర్యం కల్పించినందుకు అధికారులను మంత్రి అభినందించారు. మిగిలిపోయిన మౌలిక వసతుల పనులను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడిలకు కనీస వసతులు కూడా అందలేదని, రాష్ట్రంలోని ప్రతి కేంద్రంలో వంద శాతం టాయిలెట్లు, తాగునీరు, విద్యుత్ సదుపాయాలు ఉండాలన్నారు. చిన్నారుల పోషకాహారం, ఎదుగుదలపై శాంపిల్ సర్వే నిర్వహించి, ఫలితాల ఆధారంగా కార్యక్రమాలను మెరుగుపరచాలని, పాలు/బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అన్ని జిల్లాల్లో ఆలస్యం లేకుండా అమలు చేయాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడి టీచర్లు, ఆయాల ఖాళీల భర్తీపై 16 జిల్లాల్లో నోటిఫికేషన్లు జారీ అయినట్లు అధికారులు వివరించగా, మిగిలిన జిల్లాల్లో కలెక్టర్‌లతో సమన్వయం చేసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. యూనిఫాంలను అక్టోబర్ తొలి వారంలోగా సిద్ధం చేయాలని, డిప్లొమా సర్టిఫికెట్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కేంద్రాలకు ఆహ్లాదకరమైన రంగులు వేయాలని, రద్దీ ప్రాంతాల్లో ఇప్పటికే 54 తల్లి ఒడి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం 17 అడాప్షన్ సెంటర్లు ఉన్నాయని, వీటిని ప్రతి జిల్లాలో ఏర్పాటు చేసే దిశగా చర్యలు వేగవంతం చేయాలన్నారు. తెలంగాణను బాల్య వివాహాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు గ్రామస్థాయి నుంచి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు లాప్స్ కాకుండా పూర్తిగా వినియోగించాలని, జిల్లా సంక్షేమ అధికారులు హాస్టళ్లు, అంగన్‌వాడిలను క్రమం తప్పకుండా సందర్శించి నివేదికలు సమర్పించాలని మంత్రి ఆదేశించారు.

# నిమిషం కూడా నిర్లక్ష్యం వద్దు

వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి : మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల కలెక్టర్లు, యంత్రాంగం నిమిషం కూడా నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర రెవెన్యూ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశించారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణ అధికారులతో గురువారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, వర్షాల పరిస్థితిపై సమీక్షించారు. ఛత్తీస్‌గఢ్ మీదుగా పయనిస్తున్న తీవ్ర వాయుగుండం, చురుగ్గా ఉన్న నైరుతి రుతుపవనాల ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షభయం ఉన్న నేపథ్యంలో జిల్లా స్థాయిలో రెవెన్యూ యంత్రాంగం అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, అవసరమైతే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కలెక్టర్లు, పోలీస్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అత్యవసర పరిస్థితుల్లో తక్షణమే స్పందించాలన్నారు. హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రవాణా, విద్యుత్, తాగునీటి సరఫరాకు ఆటంకం కలగకుండా చూడాలని, హైడ్రా, జిహెచ్ఎంసి, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నాలుగు రోజుల క్రితం వరకు రాష్ట్రంలో 30 శాతం మేర ఉన్న వర్షపాతం లోటు, గత రెండు రోజుల భారీ వర్షాలతో దాదాపు సాధారణ స్థాయికి చేరుకుందని మంత్రి తెలిపారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం జూలై 30, 31 తేదీల్లో రాష్ట్రంలో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు రెడ్ అలర్ట్, నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిందన్నారు. భారీ వర్షాలు కురిసే జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా వ్యవహరించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

## ఆర్ అండ్ బి యంత్రాంగం అప్రమత్తం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆర్ అండ్ బి యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో రోడ్లు, వంతెనల పరిస్థితిపై ఆర్ అండ్ బి శాఖ అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలు, ఆర్‌అండ్‌బి డివిజన్ల వారీగా రహదారులు, వంతెనలు, లోలెవల్ కాజ్‌వేలు, కల్వర్టుల పరిస్థితిపై మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. కల్వర్టులు, లోలెవల్ కాజ్‌వేలు, కోతకు గురైన రహదారుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట ట్రాఫిక్‌ను మళ్లించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రహదారులు, వంతెనల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు పాటించి ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఆర్ అండ్‌బి శాఖ అధికారులు అందరూ క్షేత్రస్థాయిలోనే ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, నీటిపారుదల శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి రోజు ఫీల్డ్ రిపోర్టును సిద్ధం చేసి సమర్పించాలని, క్షేత్రస్థాయి ఇంజనీర్లతో తాను ప్రతి రోజూ మొబైల్ ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తానని మంత్రి తెలిపారు.

# అంబేద్కర్ వర్సిటీలో నాలుగు ఆన్‌లైన్ కోర్సులకు యుజిసి అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలోనే మొట్ట మొదటి సార్వత్రిక విశ్వవిద్యాలయమైన డాక్టర్ .బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2026–27 విద్యా సంవత్సరానికి గాను నాలుగు ఆన్‌లైన్ కోర్సులకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) అనుమతించింది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి మొత్తం 8 కోర్సుల కోసం దరఖాస్తు చేసుకోగా ఇందులో నాలుగు కోర్సులు ఎం.ఎ. (తెలుగు), ఎం.కామ్; బి.కామ్ (ఇంగ్లీష్ మీడియం), బి.కామ్ (తెలుగు మీడియం)లకు యుజిసి ఆమోదం తెలిపిందని యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ అండ్ లెర్నింగ్ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.పుష్పాచక్రపాణి గురువార ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన నాలుగు కోర్సులకు సంబంధించి యుజిసి కొన్ని సూచనలు, సలహాలు చేసిందని, వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. ఆన్‌లైన్ కోర్సులకు యుజిసి ఆమోదం తెలపడం పట్ల విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి విశ్వవిద్యాలయ సిబ్బందిని అభినందించారు. కెనడాలో అధికారిక పర్యటనలో ఉన్న ఆయన విశ్వవిద్యాలయ అధికారులతో గురువారం మాట్లాడారు. డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ దేశంలోనే మొదటి డిస్టెన్స్ యూనివర్సిటీగా రూపాంతరం చెందుతోందని, రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ అన్ని కోర్సులను ఆన్‌లైన్ కోర్సులుగా మారుస్తూ పూర్తి స్థాయి డిజిటల్ యూనివర్సిటీగా మారుస్తామని ఘంటా చక్రపాణి వెల్లడించారు. కాగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నాణ్యమైన ఉన్నత విద్యను మరింత విస్తరించేందుకు యుజిసి తీసుకున్న నిర్ణయాన్ని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డి, ఇతర విభాగాల డిరెక్టర్లు, డీన్స్ స్వాగతించారు. యుజిసి కొత్తగా ఆమోదించిన కోర్సుల వివరాలు, కనీస అర్హత, అడ్మిషన్ విధానం, ఫీజుల వివరాలు, కోర్సు వ్యవధి వివరాలతో విశ్వవిద్యాలయం త్వరలో అడ్మిషన్ నోటిఫికేషన్ జారీ చేస్తుందని వారు తెలిపారు. సమాచారం కోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.braou.ac.in లేదా www.braouonline.in ను సందర్శించాలని, లేదా హెల్ప్ డెస్క్ 040 23680 333 / 555 /, టోల్‌ఫ్రీ: 18005990101లో సంప్రదించాలని సూచించారు.

వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు

# ఫైర్ శాఖ పూర్తి సన్నద్ధం

జిల్లాల అధికారులతో డిజి విక్రమ్ సింగ్ మాన్ వీడియో కాన్ఫరెన్స్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కొనసాగుతున్న వర్షాకాల పరిస్థితులు, భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో తెలంగాణ అగ్నిమాపక, విపత్తు స్పందన, అత్యవసర సేవలు, సివిల్ డిఫెన్స్ శాఖ అప్రమత్తమైంది. శాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్ రాష్ట్రంలోని 33 జిల్లాల జిల్లా అగ్నిమాపక అధికారులు, అసిస్టెంట్ జిల్లా అగ్నిమాపక అధికారులు, స్టేషన్ ఫైర్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వర్షాకాల సన్నద్ధతను సమీక్షించారు. భారీ వర్షాల హెచ్చరికలు జారీ అయిన జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించిన డిజి, ప్రతి జిల్లాలో రెస్క్యూ సిబ్బంది, పడవలు, డీవాటరింగ్ పంపులు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర అత్యవసర పరికరాల లభ్యత, వాటి కార్యాచరణ సన్నద్ధతపై అధికారులతో సమీక్షించారు. విపత్తుల నిర్వహణలో ముందస్తు సన్నద్ధత, సకాలంలో స్పందన అత్యంత కీలకమని పేర్కొన్న ఆయన, అన్ని అగ్నిమాపక కేంద్రాలు, రెస్క్యూ బృందాలు ఎప్పటికప్పుడు హై అలర్ట్‌తో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుత వర్షాకాలంలో అధికారులు ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిజి విక్రమ్ సింగ్ మాన్ సూచించారు.

# దళిత సంక్షేమాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం

ఆగస్టు 3న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద ధర్నా : అనిల్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళిత సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, దీనిని నిరసిస్తూ అగస్టు 3వ తేదీన దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ల కార్యాలయం ముట్టడించనున్నట్లు రాష్ట్ర ప్రధనకార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ తెలిపారు. ఈ ధర్నాల్లో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గురువారం డి హెచ్ పి ఎస్ హైదరాబాద్ జిల్లా సమితి సమావేశం కె బాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అనిల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. దళితుల అభివృద్ధికి ఉద్దేశించిన ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు ఇతర అవసరాలకు మళ్లించడం రాజ్యాంగ స్ఫూర్తికి, సామాజిక న్యాయానికి విరుద్ధమని పేర్కొన్నారు. దళితుల విద్య, ఉపాధి, గృహనిర్మాణం, ఆరోగ్యం, మౌలిక వసతుల కోసం ఖర్చు చేయాల్సిన నిధులను పూర్తిగా అదే లక్ష్యాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ జిల్లాలో వేలాది దళిత కుటుంబాలు ఇప్పటికీ సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలోనో, తాత్కాలిక నివాసాల్లో జీవిస్తున్నాయని, ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కార్యాచరణ చేపట్టి ప్రతి దళిత కుటుంబానికి గౌరవప్రదమైన శాశ్వత ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు.ఎస్‌సిసబ్ ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి దళిత సంక్షేమానికే ఖర్చు చేయాలి.ప్రతి దళిత కుటుంబానికి ఉచితంగా శాశ్వత గృహాన్ని నిర్మించి ఇవ్వాలన్నారు. దళితులకు పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయలని, దళిత బస్తీలలో మౌలిక వసతులు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్ వంటి సౌకర్యాలు మెరుగుపర్చడం, దళిత యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించి, ఆర్థిక సహాయాన్ని అందించాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే రాష్ట్రవ్యాప్తంగా దళిత ప్రజలను సమీకరించి ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కాంపెల్లి శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్, మురళి, జి యాకయ్య, జీ రవి, హనుమంత్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులు విద్యాసాగర్, తిరుపతికి జాతీయ వాగ్దేవి పురస్కారాలు

కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రదానం



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో పనిచేస్తున్న ముగ్గురు తెలుగు జర్నలిస్టులకు జాతీయ వాగ్దేవి పురస్కారాలు దక్కాయి. వీరిలో ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి, పెద్దపల్లి జిల్లాకు చెందిన విద్యాసాగర్ వేములకు జాతీయ వాగ్దేవి పురస్కారం లభించింది. ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ భవన్‌లో జాతీయ తెలుగు సారస్వత పరిషత్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేశిరాజు రాంప్రసాద్ ఆధ్వర్యంలో 'తెలుగు వెలుగు సంబరాలు' పేరిట జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) జయంతి వేడుకలను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి జాతీయ వాగ్దేవి పురస్కారాలను అందజేశారు. ప్రింట్ జర్నలిజంలో ప్రతిభ కనబరుస్తున్నందుకు ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి విద్యాసాగర్ వేములకు,వీ6 వెలుగు ఢిల్లీ ప్రతినిధి వంగ తిరుపతికి కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ జాతీయ వాగ్దేవి పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. సాక్షి ఢిల్లీ ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డికి జాతీయ వాగ్దేవి విశేష ప్రతిభా పురస్కారం, అలాగే మాజీ మంత్రి పితాని సత్యనారాయణ, కాశీ విశ్వనాథరాజుకు వాగ్దేవి జీవిత సాఫల్య పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఎంపీలు కె.లక్ష్మణ్, బీద మస్తాన్ రావు, మాగుంట శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకులభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు ఈ వేడుకలలో పాల్గొన్నారు.


తెలంగాణా ప్రభుత్వము

ఫారం-6

(ప్రాథమిక ప్రకటన)

(చట్టం -30/2013 లోని 11(1) మరియు సబ్ రూల్-1, రూల్ 19 ప్రకారం)

| | |
|---|---|
| ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ ఆర్.సి.నెం. బి /340//2024 | తేది: 10-07-2026 |
| జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి ఉత్తర్వులు నెం. జి/2034/2026 | తేది: 13-07-2026 |
| భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాజ పత్రము నెం. బి3/32/2026 | తేది: 18-07-2026 |

ఈ దిగువ నిర్దిష్ట పరచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా **బూర్గంపాడు** మండలం, **ఇరవెండి** గ్రామంలో ఉన్న భూమి విస్తీర్ణం **ఎ.5-20 1/4 గుంటలు** ప్రజా ప్రయోజనం నిమ్మిత్తం అనగా సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్ట్ క్రింద డిస్ట్రిబ్యూటరి కెనాల్-1L (LM-3), ప్యాకేజి నెం.1, ఇరవెండి గ్రామము వద్ద ఈ దిగువ చూపిన భూమి అవసరమై ఉన్నదని భావించినందున భూసేకరణ, పుణరావాస, పునఃనిర్మాణం కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్దమైన పరిహారాన్ని పొందే హక్కుచట్టం 30/2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారిచేయనైనది.

భూసేకరణ వలన భూనిర్వాసితులయ్యే కుటుంబాలు ఏమియులేవు. నిర్వాసిత కుటుంబాల పుణరావాస, పునఃనిర్మాణం అంశాలకు అదనపు కలెక్టర్ (రెవిన్యూ) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వారు ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అధికారిగా నియమించబడినారు. కావున ఈ ప్రాజెక్ట్ క్రింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా **బూర్గంపాడు** మండలం, **ఇరవెండి** గ్రామంలోని విస్తీర్ణం **ఎ.5-20 1/4 గుంటలు** గల భూమి ఈ క్రింద చూపిన విధంగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచయనైనది.

షెడ్యూల్

గ్రామం:: ఇరవెండి మండలం:: బూర్గంపాడు జిల్లా : భద్రాద్రి కొత్తగూడెం

| క్ర.సం. | సర్వే నెం. (సబ్ డివిజన్ ప్రకారం) | సర్వే నెం. (పహాణి ప్రకారం) | భూమి (యాజమాన్యం) | భూమి యొక్క రకం (మెట్ట/తరి) | సేకరించు విస్తీర్ణం | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: భూమి (యాజమాన్యం) | ఆసక్తి గల వ్యక్తి పేర్లు మరియు చిరునామా: అనుభవదారుని పేరు | నిర్మాణములు & వృక్షములు రకం |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 79/1/2 | 79 | పట్టా | మెట్ట | 0.31 1/4 | సానికొమ్ము జయరామిరెడ్డి తం: వెంకటరెడ్డి | సానికొమ్ము జయరామిరెడ్డి తం: వెంకటరెడ్డి | లేవు |
| 2 | 87/1/2 | 87 | పట్టా | మెట్ట | 0.12 1/4 | గుదిబండి వెంకట సుబ్రమన్యా రెడ్డి తం: జనకిరామిరెడ్డి | గుదిబండి వెంకట సుబ్రమన్యా రెడ్డి తం: జనకి రెడ్డి | లేవు |
| 3 | 96/1/1/2 | 96/3/E E/1 | పట్టా | మెట్ట | 0.01 1/2 | వెంగల ముత్తరెడ్డి తం: రామిరెడ్డి | వెంగల కౌసల్య భ: శ్రీనివాసరెడ్డి | లేవు |
| 4 | 96/1/1/2 | 96 | పట్టా | మెట్ట | 0.01 1/4 | ప్రభుత్వ భూమి | రోడ్డు | లేవు |
| 5 | 96/1/1/2 | 96/3/E E/1 | పట్టా | మెట్ట | 0.34 1/4 | వెంగల ముత్తరెడ్డి తం: రామిరెడ్డి | వెంగల ముత్తరెడ్డి తం: రామిరెడ్డి | లేవు |
| 6 | 96/1/1/2 | 96/9/A | పట్టా | మెట్ట | 0.13 1/2 | వాంకుడోత్ వెంకన్న తం: పెద్ద భద్రు | వాంకుడోత్ వెంకన్న తం: భద్రు | లేవు |
| 7 | 96/1/1/2 | 96/10/E/1 | పట్టా | మెట్ట | 0.27 1/2 | బొర్రా నాగయ్య తం: గుట్టయ్య | మూతి లక్ష్మి భ: పెంటయ్య | బోర్ వెల్ -1 |
| 8 | 96/1/1/2 | 93/A | పట్టా | మెట్ట | 0.13 1/2 | గుదిబండి వెంకట సుబ్రమన్యా రెడ్డి తం: జానకి రామిరెడ్డి | గుదిబండి వెంకట సుబ్రమన్యా రెడ్డి తం: జానకి రెడ్డి | లేవు |
| 9 | 96/1/1/3 | 96/7/A A | పట్టా | మెట్ట | 0.03 3/4 | గనిబోయిన జోగయ్య తం: పుల్లయ్య | గనిబోయిన రవి తం: జోగయ్య | లేవు |
| 10 | 96/1/1/3 | 96/9/A A | పట్టా | మెట్ట | 0.08 3/4 | భుక్య బాలాజీ తం: రాములు | భుక్య బాలాజీ తం: బాలు | లేవు |
| 11 | 96/1/1/3 | 96/7/A /1 | పట్టా | మెట్ట | 0.20 | గుంపనపల్లి రాజశేకర్ తం: రమేష్ | గుంపనపల్లి రాజశేకర్ తం: రమేష్ | లేవు |
| 12 | 96/1/1/3 | 96/8/A A/2 | పట్టా | మెట్ట | 0.10 | సోడే వీరయ్య తం: భద్రయ్య | సోడే వీరయ్య తం: భద్రయ్య | లేవు |
| 13 | 96/1/1/3 | 96/8/A A3 | పట్టా | మెట్ట | 0.10 | సోడే బక్కయ్య తం: భద్రయ్య | సోడే భద్రయ్య | లేవు |
| 14 | 96/1/1/3 | 96/9/E/1/1 | పట్టా | మెట్ట | 0.06 1/4 | కాకా కన్నయ్య తం: లచయ్య | కాకా అశోక్ తం: కన్నయ్య | లేవు |
| 15 | 96/1/1/3 | 96/3/E/2 | అసైన్డ్ పట్టా | మెట్ట | 0.00 1/2 | వంకుడోత్ సక్కుబాయి తం: వెంకన్న | వంకుడోత్ వెంకన్న తం: భద్రు | బోర్ వెల్ -1 |
| 16 | 96/1/1/3 | 96/5/1 | పట్టా | మెట్ట | 0.25 | సానికొమ్ము జయరామిరెడ్డి తం: వెంకటరెడ్డి | సానికొమ్ము జయరామిరెడ్డి తం: వెంకటరెడ్డి | లేవు |
| 17 | 117/3/2 | 96 | పట్టా | మెట్ట | 0.00 1/4 | ప్రభుత్వ భూమి | రోడ్డు | లేవు |
| 18 | 117/3/2 | 96/3/UU | పట్టా | మెట్ట | 0.00 3/4 | కొమందరి రంగాచారి తం: రామానుజా చారి | వెంగలి కౌసల్య భ: శ్రీనివాసరెడ్డి | లేవు |
| | మొత్తం విస్తీర్ణం : 5-20 1/4 | | | | | | | |

ఇట్టి నోటిఫికేషన్ భూసేకరణ భూ నిర్వాశితులు పునరావాసం మరియు పునఃనిర్మాణం చట్టం, 2013 (నెం.30/2013 సెక్షన్ 11(1) ప్రకారం సంబదిత భూ యజమానులకు సరియైన భూ నష్టపరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారిచేయనైనది. భూమీయొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మరియు భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్& ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ గారి కార్యాలయంలో ఉంచనైనది సంబధిత వ్యక్తులు ఏద్దైన పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖి చేసుకోవచ్చును.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారు, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ & ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి.యూనిట్-I, పాల్వంచ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణ సంబంధిత సెక్షన్12 ప్రకారం పైతెలిపిన భూములలో ఏద్దైన ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టాడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయంలో జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారిచేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదాహరింపబడిన భూమి హక్కు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకం, తనఖా మొదలగు చర్యలు చేపట్టారాదు.

భూసేకరణ విషయాలో సంబందించిన భూయజమానులు ఏద్దైన అభ్యంతరములున్న యెడల చట్టం 15వ విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, భద్రాద్రి కొత్తగూడెం /భూసేకరణ అధికారి ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యస్.ఆర్.ఎల్.ఐ.పి. యూనిట్-I, పాల్వంచ వారికి ఇట్టి ప్రకటన జారీచేసిన (60) దినములలోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల తమ అభ్యంతరములు లిఖిత పూర్వకముగా తెలియచేయవలసి ఉన్నది.

సం/- యం.వి.రవింద్రనాథ్, ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), ఆర్&ఆర్ ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, సీతరామ ఎత్తిపోతల ప్రాజెక్ట్, యూనిట్-1, పాల్వంచ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సం/- డి.వేణుగోపాల్, అదనపు కలెక్టర్ (రెవిన్యూ), భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సం/- అంకిత్ ఐ.ఎ.ఎస్., కలెక్టర్ & జిల్లా మేజిస్ట్రేట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

DIPR RO NO. 559/LA/PP/Advt/Pub/2026-27



GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్

షార్ట్ టెండర్ నోటీసు నెం. 19/EE.Div.NO.28/GHMC/2026-27 తేది: 29.07.2026

| Nit No. | పని పేరు | అంచనా విలువ | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| షార్ట్ టెండర్ నోటీసు నెం. 19/ EE.Div.NO. 28/ GHMC/ 2026-27, తేది: 29.07.2026 | నిర్వహణ పనులు (01) నెం.లు | రూ. 23.40 లక్షలు | ప్రారంభ తేది: 29.07.2026 సా.5.00గం.లకు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 01.08.2026 సా.5.10గం.ల వరకు | శ్రీమతి ఆర్.ఇందిరా బాయి, సెల్ నెం. 9963025505 |

పనుల వివరాల కాపీ జతపరడమైనది.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్.28, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 6999-PP/CL/ADVT/2026-27, Date: 30-07-2026



తెలంగాణ ప్రభుత్వం

వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్, హైదరాబాద్.

నెం. వ్య.మా.క./గుడి/ /2026-27 టెండరు నోటీసు తేది: 30/07/2026

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్ పరిదిలో గల హోల్‌సేల్ మార్కెట్ యార్డ్ మరియు పూల మార్కెట్ & రిటైల్ కూరగాయల మార్కెట్ యందు టాయిలెట్ బ్లాక్స్ BOT పథతిలో నిర్వహణకు సీల్డు టెండర్లు ఆహ్వానించడమైనది.

| క్ర.సం. | పని పేరు | ధరావత్తు రూ. | టెండరు షెడ్యూలు సరఫరా చేయు తేది & సమయం | టెండరు షెడ్యూలు దాఖలు చేయు చివరి తేది & సమయం | టెండరు తెరువబడు తేది & సమయం |
|---|---|---|---|---|---|
| 1 | హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నందు బయోగ్యాస్ ప్లాంట్ ముందు టాయిలెట్ బ్లాక్ BOT పథతిలో | 25,000/- | 06-08-2026 నుండి 07-08-2026 వరకు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 3.00 గంటల వరకు | 08-08-2026 రోజున మధ్యాహ్నం 12.00 గంటల వరకు | 08-08-2026 రోజున మధ్యాహ్నం 12.30 గంటలకు |
| 2 | హోల్‌సేల్ కూరగాయల మార్కెట్ నందు ఆకుకూరల నందు టాయిలెట్ బ్లాక్ BOT పథతిలో | 25,000/- | | | |
| 3 | పూల మార్కెట్ యార్డ్ నందు టాయిలెట్ బ్లాక్ BOT పథతిలో | 25,000/- | | | |
| 4 | రిటైల్ కూరగాయల మార్కెట్ యార్డ్ నందు టాయిలెట్ బ్లాక్ BOT పథతిలో | 25,000/- | | | |

టెండర్ షెడ్యూలు కొరకు రూ.3,000/- డి.డి. రూపేన సెక్రటరీ, అగ్రికల్చరల్ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్ వారి పేరు మీద తీసి మార్కెట్ కమిటీ కార్యాలయము నందు లిఖితపూర్వ దరఖాస్తుతో పాటు షెడ్యూల్ ధర, ధరావత్తు డి.డి.లను మరియు ఈ క్రింద తెలిపిన అర్హత ధ్రువీకరణలు సమర్పించిన వారికి మాత్రమే టెండర్ షెడ్యూల్ ఇవ్వబడును.

**అర్హతలు:-**

1) టాయిలెట్ బ్లాక్ వారి సొంత డబ్బుతో నిర్మించి BOT పద్ధతిలో నిర్వహించుటకు జిఎస్టి రిజిస్ట్రేషన్, ఫర్మ్ రిజిస్ట్రేషన్ మరియు లేబర్ లైసెన్స్ గల కాంట్రాక్టర్లు మాత్రమే టెండర్ నందు పాల్గొనుటకు అర్హులు.

2) పైన తెలిపినపనిలలో ఏదైనా ప్రభుత్వ సంస్థలో కనీసం (3) సంవత్సరముల అనుభవ ధ్రువీకరణ పత్రములు కలిగి ఉన్న వారికి మాత్రమే అర్హులుగా పరిగణించి టెండర్ షెడ్యూల్ ఇవ్వబడును.

అసంపూర్తిగా ఉన్న టెండర్ గాని, అభ్యంతరములు ఉన్న టెండర్లు అన్ని ఎలాంటి కారణము చూపకుండా టెండరు ఆమోదించుటకు లేదా తిరస్కరించుటకు లేదా వాయుదావేయుటకు లేదా మార్పు చేయుటకు లేదా టెండరు ప్రక్రియను.

ఏ దశలోనైన రద్దు చేయు అధికారము ఈ దిగువ సంతకముదారునకు కలదు.

సం/- చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్.

సం/- కార్యదర్శి (FAC), వ్యవసాయ మార్కెట్ కమిటీ, గుడిమల్కాపూర్.

DIPR R.O. No. : 7025-PP/CL/ADVT/2026-27, Date: 30-07-2026

## పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు

జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డి




**ప్రజాపక్షం/కేశంపేట:** గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డి సూచించారు. గురువారం కేశంపేట ఎంపిడిఒ సమావేశ మందిరంలో ఎంపిడిఒ రవిచంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు పంటలను సాగుచేసుకునే విధంగా అధికారులు పంచాయతీల్లో సభలో ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఏడిఏ రమాదేవి, ఏఈఓ ఈశ్వర్, ఎంపిఓ దయానంద్, ఎంఇఓ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎంపిడిఒ రాధరాణి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికి చేరే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపిడిఒ రాధ రాణి అన్నారు. గురువారం మండల పరిధిలోని గున్‌గల్ గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మాణం పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పెన్షన్లను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శోభారాణి, ఉపసర్పంచ్ మచ్చ అనిల్‌కుమార్, వార్డుసభ్యులు పంతంగి సుగుణమ్మ, మహేశ్, కొంగర సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి




**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే బంగారు భవిష్యత్ లభిస్తుందని లింగారెడ్డిగూడ సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్ వివరించారు. గురువారం మండల పరిధిలోని లింగారెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎంసి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ తరగతి గదిలోనే దేశ భవిష్యత్ లభిస్తుందని, ఉపాధ్యాయులు చేప్పె పాఠ్యంశాలను శ్రద్ధగా నేర్చుకొని ఉన్నత స్థాయికి చేరుకునేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, వార్డు సభ్యులు వట్టిల మల్లేష్ యాదవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకరయ్య పాల్గొన్నారు.

## జిల్లేడు చౌదరిగూడలోనే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రజాభిప్రాయ నిర్ణయం మేరకే జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోనే పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జేఏసి నాయకులు కోరారు. గురువారం రాష్ట్ర డిజిపికి జేఏసి నాయకులు మచ్చ సుధాకర్ రావు, సయ్యద్ హాఫీజ్, పడకంటి వెంకటేష్ వినతిపత్రం అంధించారు. ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని మండల కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని డిజిపిని కోరినట్లు తెలిపారు.

## విద్యుత్ సమస్యకు పరిష్కారం



**ప్రజాపక్షం/కొందుర్గు:** షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతోనే విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి వివరించారు. గురువారం కొందుర్గు మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో సింగిల్‌ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ లైన్ షిఫ్టింగ్ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, సర్పంచ్ యాదయ్య, డిసిసి ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, మల్లేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు నర్సింలు, మల్లయ్య, శివకుమార్, జీవన్, వార్డులు కుమార్, వెంకటేష్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జాతీయ ఎస్‌సి కమిషన్‌కు వినతి



**ప్రజాపక్షం/కొత్తూరు:** పర్యావరణానికి విరుద్ధంగా ఏర్పాటు చేయనున్న చెత్త డంపింగ్ యార్డుపై జాతీయ ఎస్సీ కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామానికి చెందిన పట్నం సురేష్ చేసిన ఫిర్యాదును పరిశీలించిన జాతీయ ఎస్సీ కమీషన్ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా లేఖ పంపించారు. సిద్దాపూర్‌లో నిబంధనలకు విరుద్ధంగా చెత్త డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే షెడ్యూల్డ్ కులాల కుటుంబాలతోపాటు చిన్నకారు రైతుల భూములు, జీవనోపాధి, ఆరోగ్య హక్కులు దెబ్బతినే అవకాశం ఉంటుందని కమిషన్ పేర్కొన్నట్లు తెలిపారు.

## అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

**ప్రజాపక్షం/హయత్ నగర్ :** నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై అమానుషంగా దాడి చేయించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఎల్బీనగర్ మాల్ మైసమ్మ ఫ్లైఓవర్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సాయిరాంరెడ్డి, సాయిరాం సామలేటి, సంజు గౌడ్, రూత్విక్ రెడ్డి,జావేద్, తిరుపతి, నేలపాటి రాజేష్ పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో భవన నిర్మాణ పనుల్లో ప్రమాదం

సెల్లార్ తవ్వకంలో నిర్లక్ష్యం
మట్టి కూలి ముగ్గురు కార్మికులకు తీవ్ర గాయాలు
రక్షణ చర్యలు లేకుండానే తవ్వకాలు జరిపినట్లు ప్రాథమిక గుర్తింపు
సెల్లార్‌ను పూడ్చేయించిన అధికారులు
యజమానిపై క్రిమినల్ కేసు నమోదు







**ప్రజాపక్షం/హైదరాబాద్/శేరిలింగంపల్లి :** నిర్మాణ రంగానికి కేంద్రంగా ఉన్న ఐటి కారిడార్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం సెల్లార్ తవ్వుతుండగా మట్టిపెళ్లలు విరిగిపడి ముగ్గురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని టిఎన్‌జిఓ కాలనీ, గౌలిదొడ్డి సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం, గౌలిదొడ్డి సమీపంలో ఓ ప్రైవేట్ అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం భారీ స్థాయిలో సెల్లార్ తవ్వకాలు చేపట్టారు. గురువారం పిల్లర్ల కోసం తవ్విన గుంతల్లో కార్మికులు సిమెంట్ బెడ్ వేసే పనిలో నిమగ్నమయ్యారు. అదే సమయంలో ఎగువ భాగం నుంచి ఒక్కసారిగా భారీస్థాయిలో మట్టి కూలిపడింది. దీంతో అక్కడ పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు మట్టిదిబ్బల కింద చిక్కుకుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన తోటి కార్మికులు, స్థానికులు మట్టిలో చిక్కుకున్న వారిని బయటకు తీసి, హుటాహుటిన సమీప ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న గచ్చిబౌలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

### నోటీసులు ఇచ్చాం : సిసిపి బి.వెంకన్న

విషయం తెలిసిన వెంటనే సిఎంసి, అధికారులు, హైడ్రా బృందాలు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించాయి. ఎలాంటి ముందస్తు రక్షణ చర్యలు తీసుకోకుండా, నిబంధనలకు విరుద్ధంగా భారీస్థాయిలో సెల్లార్ తవ్వడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ముందస్తు చర్యల్లో భాగంగా సెల్లార్‌ను మట్టితో పూడ్చివేశారు. సెల్లార్ తవ్వాకాలపై నిషేదం అమల్లో ఉండగానే తవ్వుతున్నారనే విషయం తెలిసి 10 రోజులకు ముందే నోటీసులు జారీ చేశామని సిఎంసి చీఫ్ సిటీప్లానర్ బి.వెంకన్న తెలిపారు. సంఘటనపై యజమానిపై కేసు నమోదు చేశామన్నారు. స్టిల్ట్ ప్లస్ రెండు అంతస్తుల భవన నిర్మాణ అనుమతులు పొందిన యజమాని, నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ తవ్వకాలు చేపట్టారన్నారు. నిబంధనల ప్రకారం యజమానిపై చర్యలు తీసుకుంటామని వెంకన్న స్పష్టం చేశారు. ప్రస్తుతం వర్షాకాల సీజన్ నడుస్తున్నందున సెల్లార్ తవ్వకాలపై నిషేదం ఉందని, ఎవ్వరూ సెల్లార్ తవ్వకాలు చేపట్టవద్దని హెచ్చరించారు.

## కార్యకర్తలను అన్నివిధాల ఆదుకుంటాం

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/కొందుర్గు:** బిఆర్‌ఎస్ కార్యకర్తలను అన్నివిధాల ఆదుకుంటామని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి వివరించారు. గురువారం మండల కేంద్రంలోని రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాల ఇండ్లకు వెళ్ళి పరామర్శించారు. మండలంలోని రేగడి చిల్కమర్రి గ్రామానికి చెందిన రాంచెంద్రి, శ్రీరామ్, బాలయ్య, రాములు, మల్లేష్‌తోపాటు పర్వతాపూర్ గ్రామానికి చెందిన విద్యాసాగర్‌ను కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులు త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులు ధైర్యంగా ఉండాలని, అధైర్య పడోద్దని సూచించారు. ఆర్థిక పరమైన ఇబ్బందులు ఎమైన ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచులతోపాటు బిఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మార్కెట్ సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎగుమతులను పెంచడంతో పాటు ఇప్పటికే ఉన్న పరిశ్రమలు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌ను మరింత సద్వినియోగం చేసుకునేందుకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా ఎగుమతుల ప్రోత్సాహం, ఈకామర్స్ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కామర్స్ సమ్మిట్ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో రంగారెడ్డి జిల్లా ఒక వ్యూహాత్మక స్థానాన్ని ఆక్రమించి, రాష్ట్రంలోని అత్యంత చైతన్యవంతమైన పారిశ్రామిక, ఎగుమతి ఆధారిత జిల్లాలలో ఒకటిగా ఆవిర్భవించిందన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం వలన, జిల్లా మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, నైపుణ్యం గల మానవ వనరులు, పరిశోధనా సంస్థలు, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ప్రాధాన్యత పరంగా గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుందని చెప్పారు. కొన్ని సంవత్సరాలుగా రంగారెడ్డి జిల్లా ఐటీ, ఐటీఈఎస్, రక్షణ రంగంతోపాటు ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్,ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్,ప్యాకేజింగ్ మెటీరియల్స్, సోలార్ ప్యానెల్స్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, క్వార్ట్జ్ అండ్ ఫల్డ్‌స్పార్ ఆధారిత పరిశ్రమలలో బలమైన ఉనికితో ఒక ప్రధాన తయారీ, సేవల కేంద్రంగా అభివృద్ధి చెందిందని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి గుర్తు చేశారు. అదేవిధంగా డిజిఎఫ్‌టి అధికారుల సమన్వయంతో జిల్లా ఎగుమతులు హబ్ గా నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలోజాయింట్ టిజిఎఫ్‌టిఎస్ ఎ.చవాన్, పరిశ్రమల శాఖ జిఎం ఎం.శ్రీలక్ష్మి, జిఎండిఐసి ఎస్.సుమతి, అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎస్ఎంఇ, ఎపి ఇడిఎ, వాల్‌మార్ట్, ఇండియా పోస్ట్ వంటి ఎగుమతి ప్రోత్సాహక మండళ్ల ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు, పలు సంస్థల ప్రతినిధులు సమావేశంలో పాల్గొని, వివిధ పథకాలు, అవకాశాలపై అవగాహన కల్పించడం తోపాటు ఇకామర్స్ ద్వారా వ్యాపార అభివృద్ధిపై అవగాహన కల్పించారు.

# భారీ వర్షాలకు అంతా అప్రమత్తం

కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచన

కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీవర్షాలు, భారత వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయ సేవలు అందించేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలు, వాగులు, వంకలు, చెరువుల పరిసరాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసర పరిస్థితులు మినహా అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, నీటితో నిండిన రహదారులను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. విద్యుత్ తీగలు తెగిపడిన ప్రాంతాలకు దూరంగా ఉండాలని, చెట్లు కూలి పోయే అవకాశం ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలని, చిన్నారులు, వృద్ధుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వర్షాల కారణంగా ఎక్కడైనా ముంపు, రవాణా అంతరాయం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని తెలిపారు. అందిన ప్రతి సమాచారం పై సంబంధిత శాఖలు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అన్ని మండలాల తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒ లు తమ పరిధిలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు అధికారుల సూచనలు, వాతావరణ శాఖ హెచ్చరికలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. జిల్లా కంట్రోల్ రూమ్‌లో 04023237416, 9704958473 నంబర్లను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ కోరారు.



## మానవ అక్రమ రవాణా నిరోధానికి సమష్టి కృషి అవసరం

డాక్టర్ సునీతా కృష్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానవ అక్రమ రవాణా నిర్మూలనకు సమాజం, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని పద్మశ్రీ డాక్టర్ సునీతా కృష్ణన్ పేర్కొన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని బివిఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీలో గురువారం నిర్వహించిన 'మానవ అక్రమ రవాణాసురక్షిత వలస' అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ మానవ అక్రమ రవాణా ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న సంఘటిత నేరమని తెలిపారు. లైంగిక దోపిడి, బాల కార్మికత్వం, బలవంతపు భిక్షాటనం, అవయవాల అక్రమ రవాణా, సైబర్ మోసాలు, నకిలీ విదేశీ ఉద్యోగాల పేరుతో జరిగే అక్రమ రవాణాపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాధితుల రక్షణ, పునరావాసం, నేరస్తులపై సమర్థవంతమైన చర్యల కోసం ప్రివెన్షన్, ప్రొటెక్షన్, ప్రాసిక్యూషన్, పార్ట్నర్షిప్ సూత్రాలను సమిష్టిగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ పోలీసు యూనిఫాంపై ప్రజలకు అపారమైన విశ్వాసం ఉందని, ప్రతి పోలీసు అధికారి నిజాయితీ, వృత్తి నైపుణ్యం, మానవీయ దృక్పథంతో ఆ విశ్వాసాన్ని నిలబెట్టాలని అన్నారు. మానవ అక్రమ రవాణా ఆధునిక బానిసత్వానికి ప్రతిరూపమని పేర్కొంటూ, బాధితుల పట్ల సానుభూతితో వ్యవహరించడం, వివిధ శాఖలతో సమన్వయంగా పనిచేయడం అవసరమన్నారు. కార్యక్రమంలో అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ జి. కవిత, అసిస్టెంట్ డైరెక్టర్ వేమా శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులు, ప్రొబేషనరీ డిఎస్‌పిలు, ట్రైనీ అధికారులు పాల్గొన్నారు.




## లోవోల్టేజీ సమస్య నియంత్రించడంలో అధికారులు విఫలం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పంచాయతీల్లో విద్యుత్ సమస్యలు లేకుండా ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అదేశించినా పట్టించుకోవడం లేదని సర్పంచ్‌లు ఆరోపించారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిడిఒ శ్రీకాంత్ అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వయంగా దేవునిబండా తండా పంచాయతీలో 100కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని చెప్పినా రూరల్ ఏఈ చణ్ముక్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్పంచ్‌లు శ్రీనునాయక్, రాజునాయక్, నరేష్, బాబునాయక్, చందునాయక్, శివారెడ్డి, రవీందర్‌రెడ్డిలు సభ దృష్టికి తీసుకువచ్చారు. కాలం చెల్లిన విద్యుత్ తీగల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడమే కాకుండా విద్యుత్ లోవోల్టేజీ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదులు చేసినా తనకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పంచాయతీల్లో చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులు వివరించారు. పంచాయతీల్లో జలసిరి అమలు అయ్యే విధంగా సర్పంచులు సహకరించాలని, ప్రతి ఇంటి అవరణలో ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఫరూక్‌నగర్ మండలంలోని మేళ్ళగూడ, కొండన్నగూడ పంచాయతీల్లో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, తక్షణమే వాటికి మరమ్మత్తులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు కోరారు. మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రావడం లేదని, దాంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీల్లో డ్రైనేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకు సంబంధించిన బిల్లులు సకాలంలో చెల్లించేందుకు అధికారులు కృషి చేయాలని సర్పంచ్‌లు కోరారు. సమావేశంలో ఫరూఖ్‌నగర్ తహశీల్దార్ నాగయ్యతోపాటు పంచాయతీల కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో మంత్రి శ్రీధర్‌బాబు పూజలు

**ప్రజా పక్షం/హయత్‌నగర్ :** గురు పౌర్ణమి సందర్భంగా దిల్‌షుక్‌నగర్ సాయిబాబా దేవాలయంలో రంగారెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు,టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ప్రత్యేక పూజ కార్యక్రమములో పాల్గొన్నారు. గురువారం దిల్ షుక్ నగర్ సాయిబాబా దేవాలయంలో సాయినాథుడిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.దేవాలయ కమిటీ ప్రతినిధులు మంత్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వేదిరె యోగేశ్వర్‌రెడ్డి, తులసి శ్రీనివాస్, సునీల్‌బాబు, వేణుగోపాల్ యాదవ్ శశిధర్‌రెడ్డి, ప్రేమ్‌నాథ్ గౌడ్, సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ చైర్మన్ లింగయ్య పాల్గొన్నారు.

# నిర్మాణ కార్మికుల సంక్షేమమే లక్ష్యం

సైబర్ నేరాలు, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి
సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** నిర్మాణ కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం.రమేష్ అన్నారు. గురువారం సైబరాబాద్ పోలీస్, తెలంగాణ కార్మిక శాఖ సమన్వయంతో రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడ శశి టవర్ వద్ద "నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం, లేబర్ కార్డుల పంపిణీ" నిర్వహించారు. కార్యక్రమానికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం.రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ నిర్మాణ కార్మికులు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సంక్షేమం మరియు సామాజిక భద్రత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హత కలిగిన కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లేబర్ కార్డు ద్వారా ప్రమాద బీమా, ఆరోగ్య సేవలు పిల్లల విద్యా సహాయం ప్రసూతి ప్రయోజనాలు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందవచ్చని తెలిపారు. పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యం లో అపరిచితుల ఫోన్ కాల్స్, నకిలీ ఉద్యోగ ఆఫర్లు, బ్యాంక్ కెవైసి పేరుతో వచ్చే సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో డయల్112కు సమాచారం అందించాలని సూచించారు. రోడ్డుభద్రత ప్రతిఒక్కరి బాధ్యత అని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. యువతతో పాటు కార్మికులు కూడా "సే నో టు డ్రగ్స్" అనే సందేశాన్ని జీవితంలో ఆచరించాలని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సిపి కోరారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డిసిపి రితిరాజ్, ఎడిసిపి సుదర్శన్, శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్, అధికారులు, నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



## ‘సర్’ ప్రక్రియ 90 శాతం పూర్తి

**ప్రజాపక్షం/నవాబుపేట** : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ నవాబుపేట మండలంలోని ఆర్కతల గ్రామంలో సమర్థవంతంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం 19వ పోలింగ్ బూత్‌ను యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, బూత్ ఏజెంట్ తలారి శేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 18, 19 పోలింగ్ బూత్‌లలో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై బిఎల్‌ఒలు, బీఎల్ఎలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 19వ పోలింగ్ కేంద్రంలో మొత్తం 589 మంది ఓటర్లు ఉండగా, వారిలో ముగ్గురు మృతి చెందినట్లు, 19 మంది ఇతర ప్రాంతాలకు ఓటును మార్చుకున్నట్లు, మరో 19 మందికి ద్వంద్వ ఓటు నమోదైనట్లు, 12మంది గ్రామంలో లేనివారుగా గుర్తించినట్లు బిఎల్ఒ వివరించినట్లు తలారి శేఖర్ తెలిపారు. గ్రామంలో ఇప్పటివరకు సుమారు 90 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను కూడా వేగంగా పూర్తిచేసి ఒక్క అర్హుడైన ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడాలని బిఎల్‌ఒలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి అర్హుడి ఓటు హక్కును పరిరక్షించడానికే ఈ ప్రక్రియను చేపట్టిందని, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు, సవరణల ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని తలారి శేఖర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఫీల్డ్ అసిస్టెంట్ గంజాయి జనార్ధన్, ఉపసర్పంచ్ శివనీల బాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంతో ప్రజాపాలన

### రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి/ఉప్పల్:** అభివృద్ధి, సంక్షేమం అనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ప్రజా పాలన కొనసాగిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొని వెళుతోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం మిగిల్చిన అప్పులు తీర్చటంలో పలు సమస్యలను అధిగమిస్తూనే వాటితో నిమిత్తం లేకుండా 2034 వరకు దీర్ఘకాలిక ప్రణాళికతో ఎక్కడా రాజీ పడకుండా నగరాభివృద్ధి పనులను కొనసాగిస్తున్నామన్నారు. భవిష్యత్తులో వరదలు, డ్రైనేజి సమస్యలు తలెత్తకుండా ఆధునిక వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీనిలోని భాగంగానే ఉప్పల్‌లో సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణ పనులు వేగం గా కొనసాగుతున్నాయని చెప్పారు. ఉప్పల్ నియోజకవర్గంలో మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలోని రామంతాపూర్, వెంకట్‌రెడ్డినగర్, చిలుకానగర్, ఉప్పల్, చర్లపల్లి డివిజన్లలో రూ.76.45కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఆయన గురువారం శంకుస్థాపనలు చేసారు. ఉప్పల్ నియోజకవర్గంలోని ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించి మధ్యలో నిలిచిపోయిన ఉప్పల్ నారపల్లి ఎలివేటెడ్ పనులను తమ ప్రభుత్వం వచ్చాక తిరిగి ప్రారంభించామని, త్వరలో ఈ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకొంటున్నామని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర ప్రజలకు స్వచ్ఛమైన నీరు, పరిశుభ్రమైన వాతావరణం అందించేలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళన కార్యక్రమా న్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతిపక్షాలు సృష్టిస్తున్న అవరోధాలను సమర్థవంతంగా ఎదుర్కొం టూ వెళుతున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మెట్రో ఫేజ్1 ప్రారంభమైందని, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణాను పదేళ్ల పాటు పాలించిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం మెట్రో ఫేజ్ 2ను తీసుకొని రావటంలో ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తే తమ ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో దీన్ని తీసుకొని రావటానికి చిత్తశుద్ధితో చేస్తున్న కృషికి కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు సహకరించక పోవటం విచారకరంగా ఉందని, అయినప్పటికి దీన్ని పూర్తిచేసే తీరుతామని మంత్రి స్పష్టం చేసారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి, ఎంఎంసి కమిషనర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి, ఎంఎంసి చీఫ్ ఇంజనీర్, శ్రీనివాసరావు, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, ఉప్పల్ డిప్యూటి కమిషనర్ ఆనంద్, ఏఈ రమేష్‌బాబు, కీసర ఆర్‌డిఓ వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాత్రం గైరాజయ్యారు. రూ. 90 లక్షల వ్యయంతో రామంతాపూర్ డివిజన్‌లో భజరంగ్ వ్యాయామ శాల భవనం గ్రౌండ్ ఫ్లోర్ విస్తరణ, బోర్‌వెల్, ఆధునిక జిమ్ పరికరాల ఏర్పాటు, రూ.56.35 కోట్ల వ్యయం తో ఉప్పల్ భగాయత్‌లో సిసి రోడ్లు, విటి కమాన్ వద్ద బస్‌స్టాప్ అభివృద్ధి, రూ.3.23 కోట్ల వ్యయంతో చిలుకానగర్ డివిజన్‌లోని బొడ్రాయి, బీరప్పగడ్డ ప్రాంతాల్లో సిసి రోడ్లు, స్మార్ట్ వాటర్ డ్రైన్ల పునర్నిర్మాణం, రిటైనింగ్, శ్మశాన వాటికల అభివృద్ధి పనులు, రూ. 15.97 కోట్ల వ్యయంతో చెర్లపల్లి డివజన్‌లోని వంపుగూడ, కాప్రా ప్రాంతాల్లో కల్వర్టు పునర్నిర్మాణం, సిసి రోడ్లు తదితర పనులకు మంత్రి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేసారు.

**ఇసిఐఎల్, రాధికా చౌరాస్తాలలో పాదచారుల వంతెనలు కావాలి**

వాహనాల రద్దీతో రోజు రోజుకు తీవ్రమవుతున్న ట్రాఫిక్ సమస్యల కారణంగా పాదచారులు రోడ్లు దాటేందుకు ఇసిఐఎల్, రాధికా చౌరాస్తాలలో పాదచారుల వంతెనలు ఏర్పాటు చేయాలంటూ ప్రాంతంలో మాజీ కార్పొరేటర్లు పావనిరెడ్డి, శ్రీదేవి, స్వర్ణరాజు శివమణి, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు మధుకర్‌రెడ్డిలతో మంత్రిని కల్సి వినతిపత్రం సమర్పించారు.

## ఎడతెరిపి లేని వర్షాలతో జాగ్రత్తగా ఉండాలి

### ఎస్ఐ శైలజ

**ప్రజాపక్షం/కోట్‌పల్లి** : మండలంలో కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి మండల ఎస్ఐ శైలజ తెలిపారు. వాగులు, వంకలు దాటకుండా రావద్దని తెలిపారు. చిన్నారులను నీటిప్రవాహాల సమీపానికి వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని , విద్యుత్ స్తంభాలు తెగిన తీగలకు దూరంగా ఉండాలని సూచించారు. చెరువులు, వాగుల్లో నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజల భద్రత కోసం పోలీసుశాఖ ఎల్లప్పుడూ అప్రమత్తంగా పనిచేస్తుం దని తెలిపారు. రానున్నరోజుల్లో కూడా అధికారుల సూచనలు పాటించి సురక్షితంగా ఉండాలని ఎస్ఐ శైలజ విజ్ఞప్తి చేశారు.

## రేపు డయల్ యువర్ డిఎం

**ప్రజాపక్షం/వికారాబాద్:** రేపు డయల్ యువర్ డిఎం కార్యక్రమం బుధవారం ఉదయం 11గంటల నుండి 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రయణీకులు బస్సు సౌకర్యాలు, టైమింగ్స్, సిబ్బంది ప్రవర్తన డిపో పరిధిలోని ఇతర సమస్యలపై నేరుగా డిపో మేనేజర్‌కు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.




## పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్ల వినతి

**ప్రజాపక్షం/ఉప్పల్:** ఎంఎంసి పరిధిలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని కాంట్రాక్టర్ల అసోసియేషన్ కోరారు. గత కొద్ది కాలంగా అధికారులను కలుస్తూ ఎన్ని సార్లు విన్నవిస్తున్నా ఫలితం లేకపోవటంతో తార్నాకలోని ఎంఎంసి కమిషనర్ కార్యాలయం ఎదుట గురువారం అసోసియేషన్ సమావేశమై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, వైస్ ప్రసిడెంట్ రవీంద్ర సాగర్, జనరల్ సెక్రటరి శివరాత్రి మల్లేష్, తదితరులు మాట్లాడుతూ పనులు పూర్తయి నెలలు, సంవత్సరాలు గడుస్తున్నప్పటికి సకాలంలో బిల్లులు చెల్లించకపోవటం వల్ల తాము తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటు న్నామన్నారు. ఇప్పటికైనా నగర పాలక సంస్థ అధికారులు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

## ఎంపిడిఒ కార్యాలయంలో నేడు మండల సర్వసభ్య సమావేశం

**ప్రజాపక్షం/నవాబుపేట్** : వికారాబాద్ జిల్లా నవాబుపేట మండల ఎంపిడిఒ కార్యాలయంలో నేడు ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు గురువారం ఎంపిడిఒ అనురాధ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, సంబంధిత శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. గ్రామ పంచాయతీల పరిధిలో అమలవుతున్న అభివృద్ధి పనుల పురోగతి, గ్రామీణాభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధం, ఉపాధి హామీ పథకం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ఇతర ప్రజా సమస్యలపై సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే సంబంధిత శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో సమావేశానికి హాజరై, అవసరమైన నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. అందరూ తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరినారు.




## తప్పిపోయిన వృద్ధుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

**ప్రజాపక్షం/చర్లపల్లి:** వృద్ధుడు తప్పిపోయిన కొద్ది సేపటికి కుటుంబ సభ్యులకు అందజేసిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ పిఎస్ పరిధిలోని విష్టా హోమ్స్ నుండి తప్పిపోయిన బృందావన్ సాహో అనే వ్యక్తి ఫోటో, వివరాలను పోలీసులు వివిధ కాలనీ వాట్సాప్ గ్రూపులు, మిగతా గ్రూపులలో ప్రచారం చేశారు. సాంకేతిక ఆధారాలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా అందిన సమాచారం ఆధారంగా దమ్మాయిగూడ పరిధిలో దారితప్పి తిరుగుతున్న బృందావన్ సాహోను గుర్తించి సురక్షితంగా అదుపులోకి తీసుకుని సిఐ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో అతని కుటుంబానికి క్షేమంగా అప్పగించారు.ఇందులో ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి...ఒక రోజు శిక్ష



**ప్రజాపక్షం/చర్లపల్లి:** మహిళపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి కోర్టు ఒక రోజు శిక్ష విధించింది. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో యాప్రాల్‌కు చెందిన రామ్ షకల్ ఠాకూర్(42) మహిళతో అసభ్యంగా ప్రవర్తించడంతో కుషాయిగూడ జిల్లా కోర్టు 5వ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారు. విచారించిన కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించి ఒకరోజు కారాగార శిక్షతో పాటు 500 రూపాయల జరిమానా విధించింది.

## వెట్టిచాకిరి కార్మిక నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

### నల్సార్ వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు




**ప్రజాపక్షం/శామీర్‌పేట:** బంధిత కార్మిక నిర్మూలన వ్యవస్థను అంతమొందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, మొదటి అడుగు ఫిర్యాదుతోనే సాధ్యమవుతుందని, ఆ తర్వాతనే బంధిత కార్మికులకు రక్షణ, విముక్తి, పునరావాసం కొరకు చర్యలు తీసుకోవాలని నల్సార్ యూనివర్శిటి వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు స్పష్టం చేశారు. గురువారం శామీర్‌పేటలోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో వరల్డ్ అగైనెస్ట్ ట్రాఫికింగ్ ఇన్ పర్సన్స్, అలాగే బిఎల్‌ఎస్ఎ చట్టం అమలై 50 సంవత్సరాలు పూర్తైన సంధర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, నల్సార్ లా యూనివర్శిటి, మరియు ఐజెఎం సంయుక్తంగా రాష్ట్రస్థాయి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు మాట్లాడుతూ బంధిత కార్మికులకు రక్షణతో మాత్రమే సరిపోదని బాధితులకు స్థిరమైన జీవనోపాధి లేకపోతే వారు మళ్లీ దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే పునరావాసం నిరంతర ప్రక్రియ కావాలని స్పష్టం చేశారు. జిల్లా విజిలెన్స్ కమిటీలు, న్యాయవాదులు, ఉపాధ్యాయులు, పౌరసమాజసేవా సంస్థలు, ప్రభుత్వ అధికారులు, పంచాయతి రాజ్, రాష్ట్ర న్యాయ సేవల సంస్థలు, తదితరుల భాగస్వామ్యం వహించి కలిసి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల సంస్థ (టిఎస్ఎల్ఎస్ఎ) సభ్య కార్యదర్శి పంచాక్షరి, నల్సార్ యూనివర్శిటి వైస్ చాన్స్‌లర్ శ్రీకృష్ణదేవరావు లు కలిసి స్వేచ్ఛా రథంను ప్రారంభించారు. తెలంగాణలోని 33 జిల్లాల్లో పర్యటిస్తు బంధిత కార్మిక వ్యవస్థపై ప్రజలకు అవగాహన కల్పించడం, గ్రామీణ స్థాయిలో చైతన్యం పెంపొందించడం, ప్రభుత్వ సేవలపై ప్రజల్లో విశ్వాసాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా పని చేస్తుందన్నారు. 380 మంది బంధిత కార్మిక వ్యవస్థ నుంచి విముక్తి పొందిన బాధితులు పాల్గొ న్న ఈ సదస్సులో పలువురు ప్రముఖులు ప్రసంగిస్తు బిఎల్‌ఎస్ఎ చట్టం సమర్థవంతమైన అమలు, బాధిత కేంద్రిత నివారణ, రక్షణ, పునరావాసం, న్యాయం, అందించడంలో ప్రభుత్వం విద్యాసంస్థలు, పౌరసమాజ సంస్థల సమన్వయం అత్యంత కీలకమని ప్రముఖులు వ్యాఖ్యానించారు. అనంతరం బంధిత కార్మిక అవగాహన గీతంను ఆవిష్కరించారు. ఈ గీతం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ గీతాన్ని తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక పర్యాటక శాఖ సలహా కమిటి సభ్యుడు, గాయకుడు పల్లె నర్సింహా ఆలపించారు. బిఎల్‌ఎస్ఎ చట్టం 50 సంవత్సరాలు పేరుతో రూపొందించిన స్మారక పుస్తకాన్ని అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించేందుకు బంధిత కార్మిక హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐజెఎం జాతీయ కార్యక్రమాల డైరక్టర్ మెర్లిన్ ఫ్రీడా, అమరగిరి గ్రామపంచాయతి అధ్యక్షురాలు లింగమ్మ, బంధిత కార్మికులు, నల్సార్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## చిరుధాన్యాల రంగంలో అనురాగ్ విద్యార్థులు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్** : చిరుధాన్యాల ప్రాసెసింగ్ ఆహార సాంకేతికతలు వ్యవసాయ ఆధారిత స్టార్టప్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అనురాగ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఎంబీఏ బిజినెస్ అనలిటిక్స్ ద్వితీయ సంవత్సరం బీబీఏ తృతీయ సంవత్సరం విద్యార్థులకు జూలై 27న హైదరాబాద్‌లోని



భారతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ (ఐసీఏఆర్, ఐఐఎంఆర్)లో పారిశ్రామిక పర్యటనలో నిర్వహించారు.ఈ పర్యటనలో 85మంది విద్యార్థులు ముగ్గురు అధ్యాపకుల పర్యవేక్షణలో పాల్గొన్నారు. విద్యార్థులు చిరుధాన్యాల ప్రాసెసింగ్ విధానాలు ఆధునిక యంత్రాలు, విలువ ఆధారిత ఆహార ఉత్పత్తుల తయారీ న్యూట్రిహబ్ ఇంక్యుబేషన్ కేంద్రం,ఆహార ప్రాసెసింగ్ స్టార్టప్ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్భంగా చిరుధాన్యాల పోషక విలువలు ఆధునిక ఆహార ప్రాసెసింగ్ సాంకేతికతలు వ్యవసాయ ఆధారిత స్టార్టప్‌లకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు ఆహార ప్రాసెసింగ్ రంగంలోని వ్యాపార అవకాశాలపై విద్యార్థులకు అవగాహన పెరిగిందని అనురాగ్ విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు.



## మున్సిపల్ దుకాణాల అక్రమాలపై విచారణ చేపట్టాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** కుషాయిగూడ కూరగాయల మార్కెట్‌లోని మున్సిపల్ దుకాణాలను లీజుకు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న దుకాణదారులపై విజిలెన్స్ అధికారులతో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధులు చక్రపాణి గౌడ్, ప్రభాకర్, యాదయ్య, వెంకటేశ్వర్లు, గణేష్, దయానంద్, పిట్లల రాజు తదితరులు గురువారం ఎంఎంసి కాప్రా డిప్యూటి కమిషనర్‌ను కల్సి పూర్తి వివరాలతో వినతిపత్రం సమర్పించారు. మార్కెట్‌లో ఉన్న 213 దుకాణాలలో 149 కూరగాయలు, 59 పూజా సామగ్రి, 11 నాన్ వెజ్ వ్యాపారాలు కొనసాగుతున్నాయన్నారు. కాగా ఈ దుకాణాలు పొందిన దుకాణదార్లలో 30 మంది మినహా మిగిలిన వారంతా వేరొకరికి అనధికారికంగా నిబంధనలకు విరుద్ధంగా సబ్ లీజ్ ఇచ్చి అధిక మొత్తాల్లో డబ్బులు తీసుకొంటున్నారన్నారు. మరో పక్క అలాట్‌మెంట్ అయిన కొంత మంది దుకాణదార్లు ఇతరులకు రూ. 25 నుండి 30 లక్షల వరకు సైతం అమ్మి సొమ్ము చేసుకోవటం సైతం జరిగిందన్నారు. కొన్ని దుకాణాల్లో నిబంధనల ప్రకారం చేయాల్సిన వ్యాపారాలకు భిన్నంగా రియల్ ఎస్టేట్, ఫైనాన్స్, సెటిల్‌మెంట్ల అడ్డాలుగా వినియోగిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టే విధంగా కొనసాగుతున్న ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు.

## అర్హత కలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు

**ప్రజాపక్షం/వికారాబాద్:** జిల్లావ్యాప్తంగా అర్హత గలిగిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యే విధంగా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర దీపక్‌తివారి తెలిపారు. గురువారం ప్రత్యేక సమగ్ర ప్రక్రియలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని నాలుగు నియోజకవర్గంలోని 10,17,671 ఓటర్లకు గాను ఇప్పటివరకు7,96,005 డిజిటలైజేషన్ చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 83 శాతం ఓటర్ల డిజిటలైజేషన్ చేపట్టడం జరిగిందని ఇందులో భాగంగా 1,13,092ఏఎస్‌డి ఓటర్లుగా గుర్తించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఆగస్టు 3వ తేదీలోపు ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిచేయాలని భారత ఎన్నికల కమిషన్ అదేశాల మేరకు 100 శాతం డిజిటలైజేషన్ చేసేవిధంగా అధికారులు శాతం డిజిటలైషన్ చేసే విధంగా అధికారులు పనిచేస్తున్నారని ఆయన అన్నారు.

## నిరుపయోగంగా ‘ఉపాధి కల్పన’ భవనం



**ప్రజాపక్షం/నవాబ్ పేట్** : నవాబ్‌పేట్ మండల కేంద్రంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణ లోపంతో ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఒకప్పుడు స్థానిక ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ఉపయోగం లేకుండా ఈ దుకాణాలను నామమాత్రపు అద్దెకు ఇచ్చి ప్రోత్సహించాలని అధికారులు సంకల్పించారు. అయితే కొన్ని ఏళ్లుగా నిర్వహణ లేకపోవడం వల్ల భవనం క్రమంగా శిథిలావస్థకు చేరింది,దీనిని కనీసం ఎలా ఉందని సంబంధిత అధికారులు పరిశీలన పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానిక మండల ప్రజలు విమర్శలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన నిధులు కేటాయించి మరమ్మతులు చేపట్టి షాపింగ్ కాంప్లెక్స్‌ను తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు. దీంతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ ఆస్తి కూడా పరిరక్షించబడుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

## భార్య అనుమానాస్పద మృతి.. భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష

**ప్రజాపక్షం/చర్లపల్లి:** భార్య మృతికి కారణమైన వ్యక్తికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షను కోర్టు విధించింది. సిఐ ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం రాజ్‌సుఖ్ నగర్‌కు చెందిన కుంచాల రామాంజనేయులు(32) 08 ఆగష్టు 2019లో అదనపు కట్నం కోసం భార్య శ్రావణిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడంతో ఆమె అనుమానాస్పద మృతి చెందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సేకరించిన సాక్ష్యాధారాలను సమర్పించగా కేసు విచారించి గురువారం మేడ్చల్ మాల్కాజ్‌గిరి జిల్లా కోర్టు సెషన్స్ న్యాయమూర్తి నిందితుడికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు 10 వేల రూపాయల జరిమానా విధించారు.



## ఘనంగా సీత్లా పండగ

### ఆడిపాడిన మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** అలియాబాద్ మున్సిపాలిటిలోని తుర్కపల్లి తాండలో గిరిజనులు సీత్లా పండగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు విచ్చేసిన అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సీత్లా పండగలో పాల్గొని గిరిజన యువతులు, మహిళలతో కలిసి నృత్యాలు చేశారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆచారాలను, సంప్రదాయాలను కాపాడుకోవాలని గిరిజనుల ఆరాధ్య దైవమైన భవాని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం గ్రామంలో ఊరేగింపుగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. పండగకు విచ్చేసిన నాయకులను గిరిజనులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలతి మాధవరెడ్డి, తుర్కపల్లి తండా వార్డు కౌన్సిలర్ వెంకటేష్ నాయక్, కౌన్సిలర్‌లు, మాజీ సర్పంచ్ కమటం కృష్ణారెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

## చెట్లు నాటి భవిష్యత్ కాపాడండి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్** : పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఘట్‌కేసర్ సర్కిల్ 6వ డివిజన్‌లో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.గాంధీ నగర్ స్మశానవాటిక పరిసరాల్లో నందం గణేష్ బాబు ఆధ్వర్యంలో చేపట్టిన మొక్కల నాటే కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ముల్లి పావనిజంగయ్య యాదవ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం



కనీసం ఒక మొక్కను నాటి దానిని చెట్టుగా పెంచాలని పిలుపునిచ్చారు.చెట్లు భావితరాలకు అమూల్యమైన సంపద అని స్వచ్ఛమైన గాలి ఆక్సిజన్ సమద్ధిగా వర్షాలు కురవడానికి చెట్లే ఆధారమని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కదుపోల్ల మల్లేష్, కాంగ్రెస్ నాయకులు ముల్లి జంగయ్య యాదవ్, మాజీ వార్డు సభ్యులు బర్ల దేవేందర్ ముదిరాజ్, మున్సిపల్ అధికారి శ్రావణ్, నందం సేతు,నందం బిందు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్‌కె పురం వివాద స్థలం పార్కుదే

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి నియోజకవర్గంలోని ఆర్‌కె పురంలోని పార్కు స్థలానికి సంబంధించి గత దశాబ్ద కాలంగా కొనసాగుతున్న కేసులో హైకోర్టు పిటిషన్‌దార్లైన స్థానిక ప్రతినిధులకు అనుకూలంగా పాత ప్లాన్ ప్రకారమే వివాద స్థలం పార్కుకు చెందుతుందంటూ తీర్పు వచ్చింది. 1968 నాటి ఒరిజినల్ కన్వెన్షన్ ప్లాన్ ఆధారంగా సీనియర్ న్యాయవాది దీపక్ భట్టాచార్య సాక్ష్యాధారాలతో చేసిన వాదనల ఫలితంగానే ఈ తీర్పు వచ్చిందని కాలనీ అధ్యక్షుడు ఆర్ఆర్ మహాపాత్ర తెలిపారు.

## కూతురుపై తండ్రి లైంగిక దాడి

### అరెస్టు చేసి జైలుకు తరలించిన పోలీసులు

**ప్రజాపక్షం/వికారాబాద్:**14ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి అరెస్టు చేసి జైలుకు పంపిన సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. సుమారు 20 సంవత్సరాల క్రితం వికారాబాద్‌కువచ్చి ఆటో డ్రైవర్‌గా జగన్నాథ్(44) నారాయణఖేడ్ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి ఇద్దరు భార్యలు ఉన్నారు. మొదటి భార్యకు ఒక కుమారుడు, ఒక కుమార్తె కాగా , రెండవభార్యకు ముగ్గురు కుమార్తెలు,ఒక కుమారుడు ఉన్నారు.



రెండవ భార్య మరణించడంతో హాస్టల్‌లో ఉన్న పిల్లలను ఇంటికి తీసుకొచ్చిన సమయంలో మూడో కుమార్తెను మాయమాటలు చెప్పి పలుమార్లు బలవంతంగా అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందని సిఐ రాఘుకుమార్ తెలిపారు. బాలిక ఈ నెల 27వ తేదీన కడుపునొప్పి రావడంతో పాఠశాల ఉపాధ్యాయురాలికి విషయం తెలియజేసింది. ఉపాధ్యాయురాలు ఈ విషయాన్ని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ దృష్టికి తీసుకెళ్లడంతో బాలికను విచారించిన సందర్భగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. బాలిక తన తండ్రి అయిన నిందితుడు తనకు మొబైల్‌లో అశ్లీల చిత్రాలు చూపిస్తూ, పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించి బాలికకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, బాలికను భరోసా సెంటర్‌లో ఉంచి అవసరమైన రక్షణ సహాయాన్నిఅందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ రోజు ఇంటికి వచ్చినట్లు సమాచారం అందడంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

## నూతన పైప్‌లైన్ ప్రారంభం



ప్రజాపక్షం/ముషీరాబాద్: ప్రజా సౌకర్యార్థం అభివృద్ధిలో భాగంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్‌లో రూ.ఏడు లక్షల వ్యాయంతో నూతన డ్రైనేజ్ పైప్‌లైన్ ప్రారంభోత్సవం ఆయన చేతుల మీదుగా జరిగింది. కార్యక్రమంలో బిజెపి నేత వినయ్ కుమార్, బిఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, డివిజన్ అధ్యక్షుడు రాకేష్ కుమార్, మీడియా ఇంచార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, పోతుల శ్రీకాంత్, బస్తీ ప్రెసిడెంట్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, మలికిరెడ్డి ముకుంద రెడ్డి,కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్, మారిశెట్టి నరసింగరావు, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కును కాపాడుకోవాలి



ప్రజాపక్షం/చార్మినార్: ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కు మూల స్తంభమని.. ప్రతి పౌరుడు తన ఓటు హక్కును పరిరక్షించుకోవడంతో పాటు ఓటర్ల జాబితాలో తన పేరు సక్రమంగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జి కె.వెంకటేష్ పిలుపునిచ్చారు. చార్మినార్ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను గురువారం వెంకటేష్ సందర్శించి సర్ ప్రక్రియను పరిశీలించారు.

## సెల్‌ఫోన్ నేరస్థులకు కౌన్సెలింగ్



ప్రజాపక్షం/బహదూర్‌పురా: సెల్‌ఫోన్ నేరస్థులకు కౌన్సెలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ మేరకు ఏడు జోన్లకు చెందిన 288 మంది సెల్‌ఫోన్ నేరస్థులకు ప్రవర్తన మార్పు కోసం నగర పోలీసు విభాగం ఆధ్వర్యంలో సమగ్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. నేరస్థులపై కఠిన చర్యలు తప్పవని, మార్పు కోరుకునే వారికి పునరావాసం, నైపుణ్యాభివృద్ధికి సహకారం అందిస్తామని అదనపు సీపీ(క్రైమ్స్ అండ్ ఎస్ఐటీ) ఎమ్.శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ మేరకు గురువారం పెట్లబురుజులోని సీటీసీలో జరిగిన ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమంలో డిసిపిలు రమణారెడ్డి, రక్షిత, కిరణ్ ప్రభాకర్ తదితరులు పాల్గొని ప్రవర్తన మార్చుకోవాలని హితవు పలికారు.

## రెనాఫ్లెక్స్ ఫైబర్ బోర్డుల విక్రయాలు

ప్రజాపక్షం/బంజారాహిల్స్: తెలుగు రాష్ట్రాలలో అత్యుత్తమ నాణ్యత కలిగిన బిల్డింగ్ సొల్యూషన్స్ అందించడమే లక్ష్యంగా రెనాకాన్ 'రెనాఫ్లెక్స్' ఫైబర్ సిమెంట్ బోర్డుల విక్రయాలను అధికారికంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా రెనాటస్ గ్రూప్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్పీ సెల్వసుందరం మాట్లాడుతూ, పరిపూర్ణ బిల్డింగ్ సొల్యూషన్స్ అందించే సంస్థగా ఎదిగే మా ప్రయాణంలో రెనాఫ్లెక్స్ ప్రారంభం మైలురాయి అన్నారు.

## జంట జలాశయాలకు వరద

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: గడచిన రెండు రోజులుగా కరుస్తున్న వర్షాల కారణంగా జంటజలాశయాల్లోకి వరద నీరు చేరుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న మోస్తరు వర్షాల కారణంగా గురువారం ఉదయం నుంచి హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలకు తాజా వరద నీటి ప్రవాహాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం హిమాయత్‌సాగర్ జలాశయానికి 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. జలాశయంలో నీటిమట్టం 1760.80 అడుగులు కాగా, ప్రస్తుతం 2.138 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి 1763.50 అడుగులు, మొత్తం నిల్వ సామర్థ్యం 2.521 టీఎంసీలు. అలాగే ఉస్మాన్‌సాగర్ జలాశయానికి 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం 1783.35 అడుగులు, 2.241 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పూర్తి స్థాయి 1790.00 అడుగులు, మొత్తం నిల్వ సామర్థ్యం 3.518 టీఎంసీలు. ప్రస్తుతం రెండు జలాశయాల గేట్లను ఎత్తివేయలేదు. జలమండలి అధికారులు జలాశయాల్లో నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## బోనాల ఉత్సవాలకు ఆహ్వానం



ప్రజాపక్షం/చార్మినార్: చారిత్రక లాల్‌దర్వాజా 118వ వార్షిక బోనాల ఉత్సవాల ప్రారంభోత్సవానికి రావాలని కోత్వాల్ సజ్జనార్‌ను ఆలయ కమిటీ చైర్మన్ అరవింద్ కుమార్‌గౌడ్ ఆహ్వానించారు. అనంతరం సింహవాహిని మహంకాళి ఉత్సవాల్లో పాల్గొనాలని బల్దియా బాస్ కర్ణన్‌ను కూడా కలిసి ఆహ్వానించడం జరిగింది. ఆహ్వాన పత్రాలు అందించిన వారిలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.వెంకటేష్, కోశాధికారి ఎ.భరత్ కుమార్ తదితరులు ఉన్నారు.

## ఆలయ అభివృద్ధికి తోడ్పాటు



ప్రజాపక్షం/కంటోన్మెంట్: ఆలయం అభివృద్ధి లక్ష్యంగా తమవంతు సహకారం అందించినట్లు ఎన్ఆర్ఐలు పేర్కొన్నారు. ఈ మేరకు న్యూ బోయిన్‌పల్లి న్యూసిటీ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్వామివారి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ దాతల నుంచి అమ్మవారి కిరీటాన్ని స్వీకరించి ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో బానుక నర్మద, కల్పనారెడ్డి, సుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అధికారుల అలసత్వం.. నగరవాసులకు మరణ మృదంగం

- హఫీజ్‌పేట్ నాలాలో పడి వృద్ధుడు బాలయ్య గల్లంతు
- రెండు రోజులైనా లభించని ఆచూకీ
- బారికేడ్‌లు, సూచికలు లేకుండానే తవ్వకాలు
- వర్షాకాలంలో పనులేమిటని స్థానికుల ఆగ్రహం



ప్రజాపక్షం/హైదరాబాద్: అంతర్జాతీయ నగరంగా వెలుగొందుతోందని అధికారులు, ప్రభుత్వ పెద్దలు ప్రగల్భాలు పలుకుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం చిన్నపాటి వర్షానికే పౌరుల ప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయి. సివిఎంసి, వాటర్ బోర్డు ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం మరో నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని లింగంపల్లి హఫీజ్‌పేట్ ఆర్‌యుబి (రైల్వే అండర్ బ్రిడ్జి) వద్ద వరద నీటి పైపులైన్‌ల కోసం తవ్విన గుంతలో పడి బాలయ్య అనే వృద్ధుడు గల్లంతైన ఘోర ఉదంతం నగరవాసులను దిగ్భ్రాంతికి గురిచేసింది. ప్రమాదం జరిగి రెండు రోజులు దాటుతున్నా ఆయన ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ముందస్తు జాగ్రత్తలు సున్నా..!**

హఫీజ్‌పేట్ నుంచి వైశాలినగర్ వద్ద ఉన్న చెరువులోకి వరద నీరు వెళ్లేలా రూ.70 లక్షల వ్యయంతో 100 మీటర్ల మేర నిర్మాణ పనులు చేపట్టారు. ఇందులో భాగంగా 8 నుంచి 10 అడుగుల మేర లోతైన గుంతలు తవ్వారు. అయితే, వర్షం పడి నీరు నిలిచిన సమయంలో ప్రమాదాలు జరగకుండా ఇండియన్ రోడ్ కాంగ్రెస్ (ఐఆర్‌సి) నిబంధనల ప్రకారం ఎలాంటి బారికేడ్లు కానీ, హెచ్చరిక బోర్డులు కానీ ఏర్పాటు చేయలేదు. నీటితో నిండిన గుంత కనిపించకపోవడంతో మంగళవారం రాత్రి వెళ్తున్న బాలయ్య అందులో పడి కొట్టుకుపోయారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత పనులు మొదలుపెట్టడమేంటని, కనీసం సెక్యూరిటీ సిబ్బందిని కూడా నియమించకపోవడం అధికారుల దుర్మార్గ వైఖరికి నిదర్శనమని స్థానికులు మండిపడుతున్నారు.

**ప్రచారానికే పరిమితమైన డిఆర్ఎఫ్, పోలీస్ విభాగాలు**

అదునాతన పరికరాలు, శిక్షణ పొందిన సిబ్బంది ఉన్నారంటూ గొప్పలు చెప్పుకునే డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్), పోలీస్ విభాగాలు గాలింపు చర్యల్లో విఫలమయ్యాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వృద్ధుడు నాలాలో పడిన ప్రాంతం నుంచి చెరువు వరకు కేవలం 800 మీటర్ల దూరమే ఉన్నప్పటికీ, గంటల నుంచి రోజులకు గడిచినా ఆచూకీ కనిపెట్టలేకపోవడం గమనార్హం.

**సిఎం ఆదేశాలూ బేఖాతరు..!**

'వర్షం పడితే ప్రజలు ఇబ్బందులు పడొద్దు.., ఒక్కరి ప్రాణం కూడా పోవద్దు' అని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఉన్నత స్థాయి సమీక్షల్లో పదేపదే ఆదేశిస్తున్నా అధికారులు మాత్రం తమ అలవాటైన నిర్లక్ష్యాన్నే ప్రదర్శిస్తున్నారనే సర్వత్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. క్షేత్రస్థాయిలో ఏఈఈ స్థాయి అధికారి తప్ప డిఈఈ, ఈఈ, ఎస్ఈలు పనులను పర్యవేక్షించడం లేదని, కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు తీసుకోవడంలోనే శ్రద్ధ చూపుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు అధికారులు ఏడేళ్లుగా ఒకే చోట తిష్ట వేయడం కూడా ఈ నిర్లక్ష్యానికి కారణమని సమాచారం.

**సిఎంగా చర్యలు తీసుకోవాలి కుటుంబానికి న్యాయం చేయాలి**

గతంలో సికింద్రాబాద్, మణికొండ, నల్లకుంట, కూకట్‌పల్లి, ముషీరాబాద్, దీప్తిశ్రీనగర్‌లలోనూ ఇలాంటి ఘటనలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. మళ్లీ అదే తరహా ఘటన పునరావృతం కావడంపై నగరవాసుల్లో మాన్సూన్ టెన్షన్ మొదలైంది. బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై ముఖ్యమంత్రి వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, గల్లంతైన బాలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుని, తగిన న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

## పెద్ది సుదర్శన్‌రెడ్డిని పరామర్శించిన : మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/హైదరాబాద్ : తీవ్ర అస్వస్థతో సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆరోగ్యపరిస్థితిపై డాక్టర్లను ఆరా తీసిన మంత్రి తుమ్మల మరింత మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం ఆయన సుదర్శరెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు.

## బిసి ఉద్యోగులను వేధిస్తే ఊరుకోం

మలక్‌పేట సిఐ నర్సింహ్మాగౌడ్‌పై సస్పెన్షన్ ఎత్తేయాలి

ప్రభుత్వానికి బిసి సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాపక్షం / హిమాయత్‌నగర్ : కొందరు పనిగట్టుకొని బిసి ఉద్యోగులను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారని, ఇదే పరిస్థితి ముున్ముందు కొనసాగితే చూస్తూ ఊరుకోబోమని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. బిసి ఉద్యోగులపై అకారణంగా నిరాధార ఆరోపణలతో అక్రమ కేసులు బనాయిస్తున్న వ్యక్తుల పట్ల చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిసి విద్యార్థి సంఘం



జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్‌గౌడ్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్ మలక్‌పేట సిఐ నరసింహగౌడ్ ఓ మహిళా కానిస్టేబుల్‌ను వేధిస్తున్నారని తప్పుడు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఆయనను సస్పెండ్ చేయడం బాధాకరమన్నారు. అసలు విషయానికొస్తే ఓ మహిళా అడ్వకేట్ అతనిపై ఫిర్యాదు చేసి కావాలనే రాద్ధాంతం చేస్తూ సిఐ సస్పెన్షన్‌కు కారణమైందని ఆరోపించారు. ఈ విషయంపై సిపి సజ్జనార్ లోతైన కోణంలో పరిశీలించి సిఐపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని కోరారు. విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ సదరు మహిళా అడ్వకేట్ వివిధ డిపార్టుమెంట్‌లలో పనిచేస్తున్న 50 మంది అధికారులపై కేసులు వేసి మానసిక వేధింపులకు గురిచేయడమే కాకుండా బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. ఇలాంటి మహిళా అడ్వకేట్‌పై పోలీసులు విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గుజ్జ కృష్ణ మాట్లాడుతూ బిసి ఉద్యోగులపై దాడులు, అక్రమ కేసులు ఆపకపోతే ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమన్నారు. బిసి ఉద్యోగుల పక్షాన బిసి సంక్షేమ సంఘం పోరాడుతుందని, వారికి అండగా ఉంటుదని స్పష్టంచేశారు. సమావేశంలో బిసి సంఘం నేతలు ఈడిగ శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రం రజక, సత్యంగౌడ్, మహేశ్, గారి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపంపిణీ వ్యవస్థ పటిష్టంగా అమలు కావాలి

త్వరితగతిన కార్డులను జారీ చేయాలి

విజిలెన్స్ కమిటీ సభ్యులు

ప్రజాపక్షం / హైదరాబాద్ సిటీ: ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టంగా అమలు కావాలని హైదరాబాద్ జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్యరేషనింగ్ అధికారి కార్యాలయంలో గురువారం హైదరాబాద్ జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీలు కోదండరాం, మీర్జారహమత్ బేగ్, దాసోజు శ్రవణ్ కుమార్‌లతో పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్యేలు జుల్ఫేకర్ అలీ, కౌసర్ మహినొద్దీన్, మాజిద్ హుస్సేన్,



ముఠాగోపాల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఆహార భద్రతా కార్డులను అర్హులైన లబ్దిదారులకు త్వరితగతిన జారీచేయాలని చెప్పారు. ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాలను భర్తీ చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో స్వయం సంఘాలకు చౌకధరల దుకాణాల కేటాయింపును పరిశీలించాలన్నారు. చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం, గోధుమలతో పాటు ఇతర నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలని చెప్పారు. కేటాయించిన సరకులు నిరంతరం లభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. చౌక ధరల దుకాణాలను నిత్యావసర వస్తువులు లభించే కేంద్రాలుగా అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. రేషన్ కార్డుల ఈకెవైసి ప్రక్రియను పూర్తి చేసేందుకు గడువు పెంచాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ నారాయణ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తం

ప్రజాపక్షం/హైదరాబాద్‌సిటీ: వర్షాల నేపథ్యంలో జలమండలి జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ గోల్కొండ జోన్ పరిధిలోని గోషామహల్ సర్కిల్, ఓ అండ్ ఎమ్ డివిజన్13 పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరా, డ్రైనేజీ నిర్వహణ సంబంధించిన పనులను పరిశీలించారు.ఎంజే మార్కెట్ క్రాస్‌రోడ్డు సమీపంలోని లాసా లాంసా టీ లేన్‌లో కలుషిత నీటి ఫిర్యాదును పరిశీలించిన జేఎండీ, నీటి సరఫరా బ్రాంచ్ లైన్‌తో పాటు గృహ కనెక్షన్లను సమగ్రంగా తనిఖీ చేసి, కలుషితానికి కారణాన్ని వెంటనే గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో మ్యాన్ హోళ్లలో పూడికతీత పనులను పరిశీలించారు. నిరంతర వర్షాల నేపథ్యంలో అధికారులు,



సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి మురుగునీటి ఓవర్‌ఫ్లోలు, హాట్ స్పాట్స్ ప్రాంతాలను పర్యవేక్షించాలని సూచించారు. సిబ్బంది తప్పనిసరిగా పీపీఈ కిట్లు ధరించాలని, లోతైన మ్యాన్‌హోల్స్ వద్ద అవసరమైన చోట భద్రతా గ్రిల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యటనలో డైరెక్టర్ (ఆపరేషన్స్) ప్రభు, జీఎం, డీజీఎం, మేనేజర్లు హైడ్రా బృందం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు



ప్రజాపక్షం/నల్లకుంట: వర్షాల కారణంగా పాడైపోయిన రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. ఈ మేరకు అంబర్‌పేట్ మహంకాళి దేవాలయం ఎదురుగా ప్రధాన రహదారి పూర్తిగా గోతులమయంగా మారి వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారడంతో బాగ్ అంబర్‌పేట్ డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు మోర శ్రీరాములు ముదిరాజ్ గురువారం తన స్నేహితులతో కలిసి శ్రమదానం చేసి పాడైపోయిన రోడ్డుకు మరమ్మతులు చేశారు. తన సొంత డబ్బులతో ఆయన మట్టిని, డస్ట్‌ను తెప్పించి శ్రమదానంతో గోతులను పూడ్చి వాహనాల రాకపోకలు సవ్యంగా సాగేలా చర్యలు తీసుకున్నారు. అదే సమయంలో అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు అంబర్‌పేట్ మీదుగా వెళ్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గమనించి కాన్వాయ్‌ని ఆపి శ్రీరాములు బృందాన్ని చూసి వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా రోడ్డు దుస్థితి గురించి శ్రీరాముల ముదిరాజ్ మంత్రికి వివరించారు. జిహెచ్ఎంసి కమిషనర్‌తో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన రోడ్డుకు మరమ్మతులు చేయిస్తానని మంత్రి వారికి హామీ ఇచ్చారు. సొంత ఖర్చుతో శ్రమదానం ద్వారా రోడ్డుకు మరమ్మతులు చేసిన శ్రీరాములు బృందాన్ని మంత్రి అభినందించారు.

## రచయిత శ్రీపాద శ్రీనివాస్‌కు ' సినారె సాహితీ పురస్కారం'



ప్రజాపక్షం/హైదరాబాద్ : జ్ఞానపీఠ్ పురస్కర గ్రహీత, ప్రముఖ కవి ' సి.నారాయణరెడ్డి (సినారె)' జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సాహితీ కళా సేవా సమితి వారు పలువురు ప్రముఖ రచయితలు, కళాకారులకు పురస్కరారాలు అందజేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాజమండ్రికి చెందిన రచయిత శ్రీపాద శ్రీనివాస్ కు 'సినారె సాహితీ పురస్కారాన్ని' అందజేశారు. పలు పుస్తకాల రచయితగా, రేడియో కళాకారునిగా రాణిస్తున్న శ్రీపాద శ్రీనివాస్ ఇటీవల సాహిత్య సంస్థల నుండి వరుసగా అనేక పురస్కారలను అందుకున్నారు.

## తిరంగా ర్యాలీ-2026 పరేడ్ గ్రౌండ్స్ టూ కరీంనగర్

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ ఐక్యత, దేశభక్తి చాటేందుకు ఆగస్టు 15న ప్రతిష్ఠాత్మక 'తిరంగా ర్యాలీ2026' నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కాసుల కృష్ణ తెలిపారు. ర్యాలీకి సంబంధించిన అధికారిక ప్రచార పోస్టర్‌ను బిజెపి రాష్ట్రఅధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆవిష్కరించినట్లు కృష్ణ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ...దేశంలో జాతీయ భావాన్ని మరింత బలోపేతం చేయడం, యువతలో దేశభక్తి ప్రేరణ నింపడం, స్వాతంత్ర్య ఫలాలను స్మరించుకోవడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమని వివరించారు. గతాన్ని గౌరవిస్తూ, వర్తమానాన్ని జరుపుకుంటూ, భవిష్యత్తుకు ప్రేరణగా నిలిచేలా ఈ మహత్తర





కార్యక్రమాన్ని రూపొందించామని..కలిసి ప్రయాణిద్దాం కలిసి ఎదుగుదాం అనే స్ఫూర్తితో యాత్ర సాగుతుందన్నారు. ఆగస్టు 15న ఉదయం 7 గంటలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి భారీ వాహన ర్యాలీ ప్రారంభమై కరీంనగర్‌లో ముగుస్తుందన్నారు. సమాచారం కోసం సెల్:72860 99245, 70367 99245 ద్వారా సంప్రదించాలని ఆయన కోరారు.

## వైశ్య కార్పొరేషన్ నిధులకు 3న సాధన దీక్ష

వైశ్య వికాస వేదిక వ్యవస్థాపకులు కాచం సత్యనారాయణ

ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ : తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్‌కు రూ.500 కోట్ల నిధులు సాధించడమే లక్ష్యంగా ఆగస్టు 3న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్ వద్ద వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో సాధన దీక్ష చేపట్టనున్నట్టు వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ తెలిపారు. గురువారం హైదరబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వేదిక ప్రతినిధులతో కలిసి సాధన దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. వైశ్య కార్పొరేషన్‌కు రెండేండ్లుగా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా



ఇవ్వలేదని విమర్శించారు. వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం 25 మంది వైశ్యులకు కార్పొరేటర్ సీట్లివ్వాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వైశ్యులు పనిచేస్తారని స్పష్టం చేశారు. సమావేశంలో వేదిక రాష్ట్ర ప్రధానకార్యదర్శి నంగునూరి శేఖర్, నేతలు సాంబశివరావు, కొంత రవికుమార్, సత్యనారాయణ, చుక్క మనోహర్, సాయి పాల్గొన్నారు.

## మెరుగైన విద్యుత్ సరఫరా

ప్రజాపక్షం/హైదరాబాద్ సిటీ: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, విశ్వసనీయ విద్యుత్ సరఫరా అందించేందుకు ఎస్‌పిడిసిఎల్ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నది. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా పంపిణీ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచే చర్యల్లో భాగంగా రంగారెడ్డి జోన్ పరిధిలోని కందుకూరు డివిజన్, రాజేంద్రనగర్ సర్కిల్లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతన 16 ఎంబిఎ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విజయవంతంగా ఏర్పాటు రూ.2.50 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ ప వర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను జూలై 30న సాయంత్రం అధికారులు విజయవంతంగా ఛార్జ్



చేశారు.సామర్థ్యాన్ని పెంచడం ద్వారా వాడిఎముస్తఫా, గౌస్‌నగ ర్, అలీనగర్, నూరీనగర్, ఇస్మాయిల్‌నగర్, బా బానగర్, ఎర్రకుంట, ఖుబా కాలనీ తదితర పరిస ర ప్రాంతాల్లోని సుమారు 12,000 మంది విద్యు త్ వినియోగదారులకు ప్రయోజనం చేకూరనుంది.

## 'సర్' ప్రక్రియకు నాలుగు రోజులే

ప్రజాపక్షం/నల్లకుంట: సర్ ప్రక్రియకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉందని, అర్హులైన ఓటర్లందరూ ఆగస్టు 3 తేదీ లోపు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని నల్లకుంట డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకురాలు గంగిశెట్టి లిఖిత గౌడ్ విజ్ఞప్తి చేశారు. నల్లకుంట డివిజన్ పరిధిలో ఇంటింటికి తిరిగి బిఎల్ఓలు అందజేసిన ఎన్యుమరేషన్ ఫామ్‌లలో ఓటర్లు తమ వివరాలు రాసి గడువు లోపల తిరిగి వారికి అందజేయాలని ఆమె సూచించారు.

## బిఎల్ఒలతో సమీక్ష

ప్రజాపక్షం/కంటోన్మెంట్: ఎస్ఐఆర్ గడువు సమీపిస్తున్నందున బిఎల్ఓలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. గురువారం కంటోన్మెంట్ పరిధిలోని బిఎల్ఒలతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో పలువురు బిఎల్ఓలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కృత్రిమ మేధకు ఇంటర్న్‌షిప్

ప్రజాపక్షం/సుల్తాన్‌బజార్: కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్‌ను అందించే పెగాసిస్టమ్స్ తన ప్రతిష్ఠాత్మక ఈవెంట్ పెగాఇన్నోవేట్ వేదికగా మొట్టమొదటి నేషనల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. నేషనల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్, స్మార్ట్ బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ సహకారంతో అందిస్తుంది. ఈ సందర్భంగా పెగా ఇండియా అప్లికేషన్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ పర్చా మాట్లాడుతూ, ఐదు వారాల వ్యవధి ఉన్న ప్రోగ్రామ్ ఎవరికీ ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ గురించి ప్రతీ ఒక్క విషయాన్ని నేర్పించలేదన్నారు. మేము చేయగలిగింది మార్పు తీసుకురావడమేనన్నారు.

## పార్టీ పటిష్టతకు కృషి చేస్తా

ప్రజాపక్షం/బహదూర్‌పుర: పార్టీ పటిష్టతకు తనవంతు కృషి చేస్తానని తెలంగాణా రక్షణ సేన బహదూర్‌పుర నియోజకవర్గం ఇంచార్జ్ తిరుపతి పరమేశ్వరి తెలిపారు. ఈ మేరకు టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బహదూర్‌పుర టిఆర్ఎస్ ఇంచార్జిగా పరమేశ్వరిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.

విద్యార్థుల నిరసనలు అణచివేతపై

# అమిత్ షా ప్రకటన చేయాలి

- పార్లమెంట్ ఉభయసభల్లో ప్రతిపక్ష ఎంపిల నినాదాలు
- రాజ్యసభ నుంచి విపక్ష సభ్యులు వాకౌట్



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ ఉభయసభలను గురువారం కూడా ప్రతిపతిపక్ష సభ్యులు స్తంభింపజేశారు. నీట్ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా ఈనెల 20న సిజెపి నేతృత్వంలో విద్యార్థులు, యువత 'పార్లమెంట్ మార్చ్' నిర్వహించగా, వారిపై పోలీసుల అకృత్యాలపై హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో ఉభయసభల్లో గందరగోళం నెలకొంది. అయితే రాజ్యసభలో విపక్ష సభ్యులు చేసిన డిమాండ్‌ను చైర్మన్ తిరస్కరించడంతో కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్ష పార్టీలు గురువారం రాజ్యసభ నుండి వాకౌట్ చేశాయి. ఉదయం సభ ప్రారంభమై వెంటనే సభలో చర్చనీయాంశాల జాబితాలోని పత్రాలను ప్రవేశపెట్టిన తురవాత ఈనెల 20న జరిగిన పోలీసుల చర్యపై వివరణ ఇవ్వడానికి షా సభకు రావాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకుడు ప్రమోద్ తివారీ నిబంధనల క్రమాన్ని ప్రస్తావిస్తూ, రాజ్యాంగం ప్రకారం మంత్రి మండలి పార్లమెంటుకు జవాబుదారీగా, బాధ్యురాలిగా ఉంటుందని అన్నారు. విద్యార్థులపై లాఠీఛార్జ్, కాల్పులు జరిగినప్పుడు, హోం మంత్రి సభకు వచ్చి దీనిపై ప్రకటన ఇవ్వాలన్న నిజమైన డిమాండ్ ఉంది అని ఆయన అన్నారు. రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ నిబంధనల క్రమాన్ని తిరస్కరించి, జాబితాలోని జీరో అవర్ ప్రస్తావనలను కొనసాగించారు. సభ్యులను మాట్లాడమని సభాధ్యక్షుడు పిలిచినప్పటికీ, ప్రతిపక్ష ఎంపిలు 'హోం మంత్రి సభకు రావాలి', 'హోం మంత్రిని తొలగించండి' వంటి నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఇతరులకు అంతరాయం కలిగించడం ప్రతిపక్ష సభ్యులకు సరికాదని సభాధ్యక్షుడు అన్నారు. ప్రధానమంత్రి, మంత్రులు పార్లమెంటుకు జవాబుదారీగా ఉంటారని తివారీ మళ్లీ చెప్పే వరకు దాదాపు అరగంట పాటు నినాదాలు కొనసాగాయి. హోం మంత్రిని సభకు రమ్మంటున్నాము, మా ఇళ్లకు కాదు అని ఆయన అన్నారు. లాఠీలు ఎక్కుపెడుతున్నప్పుడు, తూటాలు పేలుతున్నప్పుడు హోం మంత్రి స్పందించాలన్నారు. తమ డిమాండ్ నెరవేరకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు వాకౌట్ చేశాయి. వాకౌట్ అనంతరం, సభా నాయకుడు, కేంద్ర మంత్రి జె.పి. నడ్డా మాట్లాడుతూ, వర్షాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ప్రతిపక్షాల ప్రవర్తన ప్రతికూలంగా ఉందన్నారు. సభకు అంతరాయం కలిగిగిస్తున్నారని, ప్రతిపక్షానికి స్పష్టమైన లక్ష్యం లేదని, వారు లక్ష్యాలను మారుస్తూనే ఉంటారన్నారు. కాగా, ప్రతిపక్షాలు వాకౌట్ చేసిన అనంతరం, సభ జాబితాలో ఉన్న కార్యకలాపాలను కొనసాగించింది. మరోవైపు లోక్‌సభలో కూడా ఇవే పరిస్థితులు కనిపించాయి. సభ పలుమార్లు వాయిదా పడింది. ప్రతిపక్షాల ఆందోళన కొనసాగుతున్న నేపథ్యంలో సభను మధ్యాహ్నం 3.30 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ సమావేశమైన వెంటనే ప్రతిపక్షాలు నినాదాలు చేయడం ప్రారంభించాయి. సభ అధ్యక్షురాలు సంధ్యా రే, ప్రతిపక్ష ఎంపిలను తమ తమ స్థానాల్లో కూర్చోమని కోరారు. అయితే, నినాదాలు కొనసాగుతుండటంతో ఆమె సభను వాయిదా వేశారు. బుధవారం కూడా ప్రశ్నోత్తరాల సమయం జరగలేదు. అయితే, పేపర్ లీక్‌ల నిరోధక చట్టానికి సవరణలు చేసి, కఠినమైన శిక్షలు విధించే బిల్లు మూజివాణి ద్వారా ఆమోదం పొందింది.

పేపర్ లీక్ నియంత్రణ చట్టసవరణ

# విద్యార్థులను శాంతింపజేసేందుకే...

- సమస్య పరిష్కారానికి కాదు...
- రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున ఖర్గే మండిపాటు
- పేపర్ లీక్‌లను నివారించేలా పరీక్షలను ఎలా నిర్వహిస్తుందో ప్రభుత్వం వివరించలేదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ సర్కార్‌పై రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆందోళన చేస్తున్న యువతను శాంతింపజేయడానికే పేపర్ లీక్ నిరోధక చట్టానికి సవరణను ప్రభుత్వం తీసుకువస్తోందని ఆరోపించారు. సమస్యను పరిష్కరించడానికి కాదని విమర్శించారు. గురువారం 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్, 2026'పై ఖర్గే మాట్లాడుతూ పేపర్ లీక్‌లను నివారించేలా పరీక్షలను ఎలా నిర్వహిస్తుందో ప్రభుత్వం వివరించలేదని ఖర్గే అన్నారు. పేపర్ లీక్‌ల కేసులలో అధిక జరిమానాలు, కఠినమైన శిక్షలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల వంటి నిబంధనలు ఎలాంటి మార్పు తీసుకురావని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ పరీక్షలను ఎలా నిర్వహిస్తుందనే దానిపైనే తేడా ఉంటుందన్నారు. సంస్థలు, పరీక్షా విధానంలో సంస్కరణలు తీసుకువచ్చి, జవాబుదారీతనాన్ని నిర్ధారించే వరకు పేపర్ లీక్‌లు కొనసాగుతాయని, ఈ సభల్లో మళ్లీ ఇదే విషయంపై చర్చిస్తామని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. పేపర్ లీక్‌లు అమాయక విద్యార్థులను, వారి తల్లిదండ్రులను బాధిస్తాయన్నారు. రాహుల్ గాంధీ తన భారత్ జోడో యాత్ర సందర్భంగా పేపర్ లీక్‌ల విషయాన్ని లేవనెత్తారని, అలాగే 2024లో ఈ బిల్లును తొలి సారి ఆమోదించినప్పుడు ప్రతిపక్షాలు కూడా కఠినమైన చట్టాన్ని డిమాండ్ చేశాయని ఆయన గుర్తుచేశారు. అయితే, ప్రభుత్వం రాజకీయ కారణాలతో హడావిడిగా ఈ చట్టాన్ని తీసుకువచ్చిందని ఆరోపించారు. రెండేళ్ల లోపే ఈ బిల్లుకు సవరణలు చేయాల్సి ఉండేదని, కాని ఇది ఇంకా అసంపూర్ణంగానే ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను విద్యాశాఖ మంత్రి పదవి నుంచి తొలగించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన యువతను అభినందిస్తూ, వారి ఐక్యగళం, పార్లమెంటులో ప్రతిపక్షాల నిరసనల కారణంగానే ప్రభుత్వం చివరకు వారి డిమాండ్లకు తలొగ్గిందని ఆయన అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన కుర్చీని కాపాడుకోవడానికి ప్రధాన్‌ను తొలగించాల్సి వచ్చిందని ఆయన ఆరోపించారు. చర్చలకు సిద్ధంగా లేని ప్రభుత్వ వైఖరిని ఖర్గే విమర్శిస్తూ, చర్చలు కోరుతున్న యువతపై దేశద్రోహులుగా ముద్రవేసి, లాఠీఛార్జ్ చేసి, బాష్ప వాయువు ప్రయోగించారని, పెల్లెట్ గన్‌లతో తీవ్రంగా గాయపరచడంతో చాలా మందికి ఐసియులో చేర్చాల్సి వచ్చిందని మండిపడ్డారు. అశాంతి నెలకొన్నప్పటికీ ప్రధానమంత్రి, హోంమంత్రి ఇద్దరూ మాట్లాడకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. వారికి మాత్రం సిగ్గుగా ఉందో లేదో తెలియడం లేదన్నారు. విద్యార్థులపై జరిగిన అఘాయిత్యాలకు ఎవరు బాధ్యులు అని ఆయన ప్రశ్నించారు. ప్రజాశక్తే వారిని బయటకు ఈడ్చుకొస్తుందన్నారు. విద్యార్థులపై లాఠీచార్జీ బాష్పవాయువు ప్రయోగానికి ఎవరు ఆదేశాలు ఇచ్చారని, అలాగే విద్యార్థులను కొట్టిన సాధారణ దుస్తుల్లో ఉన్న వ్యక్తులు ఎవరు అనే ప్రశ్నలకు హోం మంత్రి సమాధానం చెప్పలేకపోతే, ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్, బిహార్ వంటి రాష్ట్రాల్లో పోలీసుల చర్యల గురించి కూడా ఖర్గే ప్రస్తావించారు. అక్కడ విద్యార్థులపై ఎకె47 రైఫిల్స్‌తో కాల్పులు జరిపారని ఆయన ఆరోపించారు. మోదీ ప్రభుత్వ హయాంలో దేశవ్యాప్తంగా అనేకసార్లు పరీక్షా పత్రాల లీకేజీలు జరిగినప్పటికీ, ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని ఆయన ఆరోపించారు. 2024 నీట్ పరీక్షా పత్రం లీకేజీ కేసులో ప్రధాన నిందితుడికి 'క్లీన్ చిట్' ఇచ్చారని కూడా ఖర్గే దుయ్యబట్టారు.

# సభకు షా గైర్హాజరు... దోషపూరిత చర్య

- విద్యార్థులపై పోలీసుల అమానుషదాడికి సంబంధించి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాల్సిందే
- దాడిని వివరించేందుకు హోంమంత్రి ఎందుకు భయపడుతున్నారు? : రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ :** నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల అమానుషదాడికి సంబంధించి సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యార్తు జరపాలని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించారు. హోం మంత్రి అమిత్ షా పార్లమెంటుకు గైర్హాజరు కావడం దోషపూరిత చర్యనే సూచిస్తోందన్నారు. విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేస్తున్న వీడియో క్లిప్‌ను కూడా రాహుల్‌గాంధీ గురువారం ఎక్స్‌లో షేర్ చేశారు. ఈనెల 20న పార్లమెంటు వరకు 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శన సందర్భంగా, దేశంలోని ఇతర ప్రాంతాల్లో విద్యార్థి ప్రదర్శనకారులపై భద్రతా దళాలు జరిపిన అణచివేతను ప్రస్తావిస్తూ, 'విద్యార్థులకు న్యాయం జరగాలి. మన విద్యార్థులపై జరిగిన అఘాయిత్యాలపై దర్యాప్తు జరిపేందుకు సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఒక స్వతంత్ర ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయాలి' అని ఆయన ఆ సోషల్ మీడియా సైట్‌లో పేర్కొన్నారు. మరో పోస్ట్‌లో పార్లమెంటుకు వచ్చి విద్యార్థులపై జరిగిన క్రూరమైన హింస గురించి వివరించడానికి షా ఎందుకు అంతగా భయపడుతున్నారని ప్రశ్నించారు. ఇది దోషపూరిత చర్యనే సూచిస్తోందన్నారు. నిరసన చేస్తున్న విద్యార్థులపై 'క్రూరమైన దాడి' జరిగిందని, వారిపై పెల్లెట్ గన్‌లను ఉపయోగించారని ఆరోపిస్తూ, షాను పదవి నుంచి తొలగించాలని, ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని రాహుల్‌గాంధీ బుధవారం కూడా డిమాండ్ చేశారు. విద్యార్థులపై 'క్రూరత్వానికి' ఆదేశించడం ద్వారా షా దోషి అని, అందువల్ల ఆయనను తొలగించాలని మాజీ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. నిరసనకారులపై పెల్లెట్ గన్‌ల వాడకం గురించి మంత్రికి తెలియకపోతే, ఆయన అసమర్థుడని అన్నారు.

# అమిత్ షా రాజీనామా చేయాలి

- విద్యార్థులపై అకృత్యాలకు హోంమంత్రే ఆదేశించి ఉంటారు
- 'కాక్రోచ్ జనతా పార్టీ' అధ్యక్షుడు దీప్కే ఆరోపణ



**ఛత్రపతి సంభాజీనగర్ :** విద్యార్థులపై పోలీసుల చర్యకు బాధ్యత వహిస్తూ హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే డిమాండ్ చేశారు. ఈనెల 20న జరిగిన 'సంసద్ చలో' (పార్లమెంట్ మార్చ్) సందర్భంగా విద్యార్థులపై బలప్రయోగం చేయాలన్న ఆదేశాలు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచే వచ్చి ఉంటాయని 'కాక్రోచ్ జనతా పార్టీ' అధ్యక్షుడు ఆరోపించారు. మధ్య మహారాష్ట్రలోని తన స్వస్థలమైన ఛత్రపతి సంభాజీనగర్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, రాజకీయ పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగిస్తుండటంతో పాటు న్యాయవ్యవస్థపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఆయన అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడం అనేది ఇప్పుడు కేవలం ప్రతిపక్షానికి సంబంధించిన సమస్య మాత్రమే కాదు, దేశ ప్రజలందరూ ఏకం కావాలని దీప్కే సూచించారు. న్యాయవ్యవస్థపై కూడా ప్రశ్నార్థకం నెలకొందని, శివసేన, ఎన్‌సిపి (ఎస్‌పి) వంటి పార్టీలను విచ్ఛిన్నం చేయడానికి ఇడి, సిబిఐలను ఎలా ఉపయోగించారో మనమందరం చూశామని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచడం దేశంలోని కీలక సంస్థల బాధ్యత అని, అంతే తప్ప ఒక వ్యక్తి నియంతృత్వాన్ని సృష్టించడం కాదన్నారు. కానీ బిజెపి సర్కార్‌ను రాజ్యాంగబద్ధ సంస్థలను తమ ఆధీనంలోకి తీసుకుని దీనిని అడ్డుకోవడానికి ప్రతిపక్షం మాత్రమే కాదు, ప్రజలు కూడా ఏకం కావాలని దీప్కే స్పష్టం చేశారు. కొత్త విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషి నియమించడాన్ని అభిజీత్ విమర్శించారు. ఆయనను ఒక విచిత్రమైన వ్యక్తిగా అభివర్ణించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించి మరో వింత మనిషిని తీసుకువచ్చారని, ఆయన అత్యాచారాలకు పాల్పడిన వారిని ప్రశంసించారని ఆరోపించారు. ఈ ప్రభుత్వం గూండాలకు, అత్యాచారాలకు పాల్పడిన వారికి మద్దతు ఇస్తుందని మండిపడ్డారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనకు నాయకత్వం వహించిన జెన్ జీ భారతదేశ సంస్కృతిని అపఖ్యాతి పాలు చేసిందన్న యోగా గురు, పారిశ్రామికవేత్త రామ్‌దేవ్ వ్యాఖ్యల గురించి అడగ్గా, దీప్కే ఆయనపై వ్యంగ్యంగా విమర్శలు చేసి, తన పతంజలి ఆయుర్వేద్ కంపెనీ వ్యాపారాన్ని చూసుకోమని సలహా ఇచ్చారు. 'మేము పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా మా హక్కుల కోసం రాజ్యాంగబద్ధంగా పోరాడాము. మహాత్మా గాంధీ, బి.ఆర్.అంబేద్కర్ ఫోటోలతో చట్టబద్ధంగా ఆందోళన చేయడం సంస్కృతిని అపఖ్యాతి పాలు చేయడమే అయితే, మేము అది చేశాము. గతంలో సుప్రీంకోర్టు ప్రతికూల వ్యాఖ్యలు చేసిన పతంజలిపై బాబా రామ్‌దేవ్ దృష్టి సారించాలి' అని ఆయన అన్నారు. 'రైతులు కూడా తమ పిల్లలు విజయవంతమైన కెరీర్‌లను కలిగి ఉండాలని కోరుకుంటారు. మా ఆందోళనలో మాకు అండగా నిలిచారు. రైతు నాయకులకు మా మద్దతు అవసరమైతే, మేము వారికి అండగా ఉంటాము. రైతులకు ఎక్కడ అవసరమైనా, మేము వారికి అండగా నిలుస్తాము. నేను కూడా ఒక రైతు కుటుంబానికి చెందినవాడినే. మాలో చాలా మంది రైతు కుటుంబాల నుండే వచ్చారు' అని ఆయన పేర్కొన్నారు. ఆందోళన జరుగుతున్న ప్రదేశం (జంతర్ మంతర్) దగ్గరకు ఢిల్లీ పోలీసులు రాళ్లతో నిండిన ట్రక్కులను తీసుకువచ్చారని, ఆ తర్వాత అవి నిర్మాణ స్థలం నుండి వచ్చిన వ్యర్థాలని తప్పుడు వాదన చేశారని దీప్కే ఆరోపించారు. 'ఆందోళన చేస్తున్న విద్యార్థులు రాళ్లు రువ్వారని చూపించడానికి పోలీసులు పన్నిన పథకంలో ఇది ఒక భాగం. దీనిపై నేను ఆ ప్రాంత డిసిపిని కూడా కలిశాను, ఆ ట్రక్కులో నిర్మాణ స్థలం నుండి వచ్చిన వ్యర్థాలు ఉన్నాయని నాకు చెప్పారు. ఇదంతా బిజెపి గుండాలు, ఢిల్లీ పోలీసులు కలిసి పన్నిన కుట్రలో భాగం కావచ్చు'అని ఆయన ఆరోపించారు.

ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయబోమన్న

# హామీని నిలబెట్టుకోవాలి

పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్



**న్యూఢిల్లీ :** నీట్ యుజి ప్రశ్నాపత్రం లీక్ అంశంపై ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన విద్యార్థుల ఉద్యమం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ కోరారు. ముఖ్యంగా ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేయబోమని ఇచ్చిన హామీని తప్పకుండా నిలబెట్టుకోవాలని అన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు చేశారు. 'భారతీయ రైల్వేపై నాకు ఎంతో గర్వంగా ఉంది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అదే స్థాయిలో నిలబెట్టుకుంటే మరింత సంతోషిస్తాను' అంటూ వాంగ్‌చుక్ వ్యాఖ్యానించారు. ఢిల్లీ నుంచి లఢాఖ్ తిరుగు ప్రయాణంలో వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణించిన ఆయన, తన అనుభవాన్ని పంచుకున్నారు. లఢాఖ్‌కు వెళ్లే మార్గంలో ఢిల్లీ శ్రీనగర్ వందే భారత్‌లో ప్రయాణించిన వాంగ్‌చుక్, చినాబ్ రైల్వే వంతెనపై ప్రయాణం అద్భుతంగా ఉందని పేర్కొన్నారు. 'రైలు ప్రయాణం నాకు ఎప్పటినుంచో ఇష్టమైనది. ఆ ప్రయాణం చాలా ఆహ్లాదకరంగా అనిపించింది. భారతీయ రైల్వే సాధించిన అభివృద్ధి నిజంగా ప్రశంసనీయం' అని ఆయన వీడియో సందేశంలో తెలిపారు. 'యువతతో నమ్మకమైన సంబంధాన్ని ఏర్పరచుకోవడం ఏ ప్రభుత్వానికైనా చాలా ముఖ్యం. విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చింది. ఆ మాటను నిలబెట్టుకోవాలి. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది' అని అన్నారు. కాగా, పార్లమెంట్‌లో ప్రజా పరీక్షల సవరణ బిల్లును ప్రవేశపెట్టడాన్ని ఆయన స్వాగతించారు. ఈ బిల్లు కేవలం పరీక్షల వ్యవస్థలోనే కాకుండా దేశ విద్యా వ్యవస్థలోనూ సమగ్ర మార్పులకు దారి తీయాలని ఆకాంక్షించారు. గత నెలలో నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు నిరసనగా కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో విద్యార్థులు చేపట్టిన 36 రోజుల ఉద్యమానికి సోనం వాంగ్‌చుక్ మద్దతు తెలిపారు. జూన్ 28 నుంచి ఆయన నిరాహార దీక్ష చేపట్టగా, ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేంద్రం ప్రధాన డిమాండ్లను అంగీకరించడంతో ఆయన తన దీక్షను విరమించారు.

## లోక్‌సభలో మూజువాణి ఓటుతో వందేమాతరం బిల్లుకు ఆమోదం

**న్యూఢిల్లీ :** కేంద్రం ప్రవేశపెట్టిన వందేమాతరం బిల్లును పార్లమెంట్ ఆమోదించింది. గురువారం లోక్‌సభలో ఈ బిల్లు మూజువాణి ఓటుతో ఆమోదం పొందింది. రాజ్యసభలో బుధవారమే ఈ బిల్లు ఆమోదం పొందగా.. గురువారం లోక్‌సభలో ఆమోదం లభించింది. ఇప్పుడు ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇందుకోసం ఈ బిల్లును రాష్ట్రపతి ముందుకు పంపనుంది కేంద్రం. 'ద ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సలట్స్ టు నేషనల్ ఆనర్ (అమెండ్‌మెంట్) బిల్, 2026 పేరుతో రూపొందిన ఈ బిల్లును జూలై 24న కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో ప్రవేశపెట్టింది. దీనికి జూలై 29న రాజ్యసభ ఆమోదం తెలిపింది. అనంతరం జూలై 30, గురువారం లోక్‌సభలో బిల్లు నెగ్గింది. ప్రతిపక్షాల నిరసనలు, ఆందోళనల మధ్యే ఈ బిల్లు మూజువాణి ఓటుతో సభలో ఆమోదం పొందడం విశేషం. నీట్ పేపర్ లీకేజీ, విద్యార్థులపై దాడి వంటి అంశాలపై లోక్‌సభలో వాడివేడి చర్చ జరుగుతుండగానే ఈ బిల్లును కేంద్రం పాస్ చేయించుకుంది. ఉభయ సభల ఆమోదం పొందిన ఈ బిల్లు చట్టంగా మారాలంటే దీనికి రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇప్పటికే ఉన్న 'ద ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సలట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్, 1971కి ఇది సవరణ బిల్లు. దీని ప్రకారం జాతీయ గీతమైన జనగణమనలాగే, జాతీయ గేయమైన వందేమాతరాన్ని కూడా గౌరవించాల్సి ఉంటుంది. ఈ గేయాన్ని అవమానపరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.

# రైతుల ఆందోళనకు దిగొచ్చిన ఎంపి సర్కార్

- 60 శాతం పెసర పంట సేకరణకు, గడువు పొడిగింపునకు ఓకే
- ఎరువుల పంపిణీకి సంబంధించిన 'ఇ-టోకెన్' విధానం నిలిపివేయడానికి అంగీకారం



**భోపాల్ :** రైతుల ఆందోళనలకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం దిగొచ్చింది. అర్హులైన రైతుల నుండి 60 శాతం పెసర పంటను సేకరించడానికి, సేకరణ గడువును పొడిగించడానికి, ఎరువుల పంపిణీకి సంబంధించిన 'ఇ–టోకెన్' విధానాన్ని నిలిపివేయడానికి రాష్ట్ర సర్కార్ అంగీకరించింది. దీంతో భోపాల్‌లో ఆందోళన చేస్తున్న రైతులు తమ నిరసనను విరమించారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్ నివాసం వద్ద నిరసన తెలిపిన తర్వాత, వేలాది మంది ఆందోళనకారులు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ నివాసానికి సుమారు ఒక కిలోమీటర్ దూరం వరకు ర్యాలీగా వెళ్లిన కొద్ది గంటలకే ఈ ప్రకటన వెలువడింది. అనంతరం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రతినిధులు, రైతు నాయకుల మధ్య జరిగిన చర్చల తర్వాత బుధవారం రాత్రి ఈ నిర్ణయం తీసుకున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, అర్హులైన ప్రతి రైతు నుండి సేకరించే పెసర పంట పరిమాణాన్ని ప్రస్తుతం ఉన్న 25 శాతం నుండి 60 శాతానికి పెంచాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. నర్మదాపురం, సిహోర్, హర్దా వంటి జిల్లాల్లో ఎకరాకు సుమారు మూడు క్వింటాళ్ల పెసర పంటను పండించే రైతులకు ఈ నిర్ణయం తక్షణమే వర్తిస్తుందని, గరిష్ట సంఖ్యలో సాగుదారులకు ఈ ప్రయోజనం కల్పించేందుకు కృషి చేస్తామని ప్రభుత్వం పేర్కొంది. అలాగే, పంట సేకరణకు సంబంధించిన చివరి తేదీని ఆగస్టు 10 నుండి 20కి, స్లాట్‌బుకింగ్ గడువును ఈనెల 30 నుండి ఆగస్టు 10 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఎరువుల పంపిణీకి సంబంధించిన ఇ–టోకెన్ విధానంపై ఉన్న ఫిర్యాదులు, ఆచరణాత్మక ఇబ్బందులను పరిశీలించి, మెరుగుదలలను సూచించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఐదల్ సింగ్ కన్సానా తెలిపారు. ఆ కమిటీ తన సిఫార్సులను సమర్పించి, అవసరమైన మార్పులు అమలు చేసే వరకు, ఇ–టోకెన్ ఆధారిత ఎరువుల పంపిణీ విధానం తక్షణమే నిలిపివేయబడుతుందని ఆయన చెప్పారు. కాగా, నిరసన తెలుపుతున్న రైతులు ప్రభుత్వ ప్రకటనలను అంగీకరించి తమ ఇళ్లకు తిరిగి వెళ్తున్నారని అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ శైలేంద్ర సింగ్ చౌహాన్ పిటిఐకి తెలిపారు. రోషన్‌పురా స్క్వేర్ నుండి వారు సురక్షితంగా తిరిగి వెళ్లేందుకు బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. గురువారం ఉదయం, సంయుక్త కిసాన్ మోర్చా, మరో 18 సంస్థల ఆధ్వర్యంలో వేలాది మంది రైతులు పలు బారికేడ్లను ఛేదించుకుని, చౌహాన్ నివాసం వెలుపల ప్రదర్శన నిర్వహించి, రోషన్‌పురా స్క్వేర్ వద్ద శిబిరం ఏర్పాటు చేశారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు ప్రారంభించింది. మొత్తం వేసవి పెసర పంటను కనీస మద్దతు ధరకు సేకరించాలని, ఎరువుల పంపిణీకి ఇ–టోకెన్ విధానాన్ని రద్దు చేయాలని, వచ్చే సాగు సీజన్‌కు తగినంత ఎరువులను సకాలంలో అందుబాటులో ఉంచాలని రైతులు డిమాండ్ చేశారు.

సిజెపి నిరసనకారులపై

## ప్రతికూల చర్యలు ఉండవ్

ఢిల్లీ ప్రభుత్వం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తులపై ఢిల్లీ పోలీసు ఎలాంటి ప్రతికూల చర్యలు తీసుకోరని ఢిల్లీ ప్రభుత్వం గురువారం స్పష్టం చేసింది. అయితే, నిరసనలో పాల్గొన్న నేర చరిత్ర కలిగిన వ్యక్తులు మాత్రం పోలీసులు తీసుకునే చర్యను తప్పనిసరిగా ఎదుర్కోవాల్సి ఉంటుందని ఢిల్లీ ప్రభుత్వం జారీ చేసిన ఒక ఉత్తర్వులో పేర్కొంది. ఇప్పటికే నిర్బంధాలు జరిగిఉంటే, ఆ అరెస్టులను సమీక్షించి, అరెస్ట్ అయిన వారిని విడుదల చేసే ప్రక్రియను వేగవంతం చేస్తామని హోం శాఖ తన ఉత్తర్వులో వెల్లడించింది. సిజెపి జులై 20న నిర్వహించిన 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా ఢిల్లీ పోలీసులు 13 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్న నేరచరిత్ర కలిగిన 2,800మందికి పైగా వ్యక్తులను పోలీసులు ఇప్పటికే గుర్తించారు. ఈ నిరసనలో పాల్గొన్న వ్యక్తులపై దేశ రాజధాని ఢిల్లీ ప్రభుత్వం ఎలాంటి ప్రతికూల చర్యలు తీసుకోవడంలేదని, ఈ విషయాన్ని ఎలాంటి భవిష్యత్తు విచారణ లేకుండా ముగిసినట్లుగా పరిగణించాలని హోం శాఖ తన ఉత్తర్వులో పేర్కొంది. జులై 20న న్యూఢిల్లీ జిల్లాలో జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వరకు జరిగిన యాత్ర సందర్భంగా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. నిరసనకు ముందు ఢిల్లీ పోలీసులు న్యూఢిల్లీ జిల్లా వ్యాప్తంగా, ఇతర సున్నితమైన ప్రదేశాలలో భద్రతను గణనీయంగా పెంచారు. అంతేకాకుండా పెద్ద సంఖ్యలో సిబ్బందిని, పారామిలిటరీ బలగాలను, బారికేడ్లను, అల్లర్ల నిరోధక పరికరాలను, నెట్‌వర్క్ జామర్లను మోహరించారు. పార్లమెంట్ వైపు మార్చ్‌కు ఎలాంటి అనుమతిని ఇవ్వలేదని పోలీసులు స్పష్టం చేశారు. నిరసన సందర్భంగా 15కు పైగా వాహనాలు ధ్వంసమయ్యాయని పోలీసులు తెలిపారు. ప్రధానమంత్రిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై కొన్ని సోషల్ మీడియా నిర్వహకులకు వ్యతిరేకంగా ఢిల్లీ పోలీసులు స్పెషల్ సెల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్‌లు నమోదుచేశారు. ఘర్షణల అనంతరం ఢిల్లీ పోలీసులు కొంతమంది నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం, వారిని విడుదల చేసినట్లు సీనియర్ అధికారులు వెల్లడించారు.

# సౌరవ్ దాస్, ఎఐఎస్‌ఎఫ్ నేతలకు సిపిఐ సన్మానం







**న్యూఢిల్లీ :** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేలా ఒత్తిడి తెచ్చిన యువత, విద్యార్థుల దృఢ సంకల్ప ఉద్యమానికి, వారి అసాధారణ ధైర్యానికి, పట్టుదలకు, పోరాట స్ఫూర్తిని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అభినందించారు. ప్రజలు దృఢ విశ్వాసంతో ఏకమైనప్పుడు, వారు చరిత్ర గమనాన్ని మార్చగలరని మరోసారి రుజువైందన్నారు. ఇటీవల జంతర్ మంతర్‌లో జెన్ జీ ఉద్యమంలో పాల్గొన్న నాయకులకు ఢిల్లీలోని అజయ్‌భవన్‌లో గురువారం సన్మానించారు. డి. రాజా అధ్యక్షత జరిగిన సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సిజెపి ప్రధాన అధికార ప్రతినిధి సౌరవ్ దాస్, దేశవ్యాప్త యువవిద్యార్థి ఉద్యమాన్ని ముందుకు నడిపించడంలో ఏఐఎస్‌ఎఫ్, ఇతర వామపక్ష విద్యార్థి సంఘాలు పోషించిన పాత్రను ప్రశంసించారు. ఏఐఎస్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శి దినేష్ సి.రంగరాజ్ స్వాగతోపన్యాసం చేయగా, ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ వందన సమర్పణ చేశారు. వందలాది మంది యువ సహచరుల ధైర్యసాహసాలకు, త్యాగాలకు, అచంచల నిబద్ధతకు గుర్తింపుగా సిపిఐ నాయకత్వం వారిని గులాబీలు, పుస్తకాలతో సన్మానించింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జాతీయ కార్యదర్శి సభ్యులు డాక్టర్ బాలచంద్ర కాంగో, రామ కృష్ణ పాండా, డాక్టర్ గిరీష్, అనీ రాజాలతో పాటు జాతీయ కార్యవర్గ సభ్యులు రావుల వెంకయ్య, ప్రొఫెసర్ దినేష్ వర్ష్నే, నిషా సిద్ధూ హాజరయ్యారు.

# ఇరాన్ నగరాలపై విరుచుకుపడిన అమెరికా

ఎర్ర సముద్రంలో సుంకాల వసూళ్లకు హౌతీల ప్రణాళిక

ప్రతీకారం తీర్చుకుంటాం పిఎంఎఫ్ ఉగ్రవాదుల ప్రతిజ్ఞ



**దుబాయ్ :** ఇరాన్‌లోని పలు నగరాలపై అమెరికా వైమానిక దళాలు విరుచుకుపడ్డాయి. దీంతో అనేక ప్రాంతాలలో పేలుళ్లు సంభవించాయి. ముఖ్యంగా ఖేష్మ్‌ద్వీపం చుట్టూ దాడులు జరిగాయి. అబదాన్ నగరం, ఖుజెస్తాన్ రాష్ట్రంలోని అహ్వాజ్, కజెరున్ పారిశ్రామిక నగరంపైన,ఫార్స్‌రాష్ట్రం కాజెరూన్ కౌంటీ ప్రధాన నగరంపైన సెంట్‌కామ్ తీవ్రస్థాయిలో గగనతల దాడులు చేయడంతో ఇరాన్‌కు అపారనష్టం వాటిల్లింది. అనేక ప్రాంతాలలో పేలుళ్లు సంభవించాయి. ఖేష్మ్‌ద్వీపం అబదాన్ పరిసరాల్లో దాడులవల్ల ముగ్గురు ఇరాన్ పౌరులు మరణించారు. శిథిలాల నుండి మరో ముగ్గురు ఇరాన్ నియులను సురక్షితంగా బయటకు తీశారని ఫార్స్‌న్యూస్ ప్రకటించింది. శిథిలాల్లో ఇంకా ఎంతమంది ఉన్నారో అని సహాయ బృందాలు తీవ్ర గాలింపు చేస్తున్నాయి. ఇరాన్ ప్రయోగించిన ఐదు క్షిపణులను కూల్చివేసినట్లు జోర్డాన్ ప్రకటించింది. రెండు గంటల సేపు ఇరాన్‌పై చేసిన ఈ దాడుల్లో డజన్లకొద్దీ లక్ష్యాలను దెబ్బతీసి ధ్వంసం చేశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. "వారిపై ప్రతీకారం తీర్చుకుంటాం, వారిని ఇంకా గట్టి దెబ్బ కొట్టబోతున్నాం" అన్నారు. "బుధవారం తెల్లవారకముందే ఇరాన్ ఆకస్మికంగా జోర్డాన్‌లోని అమెరికా వైమానిక స్థావరంపై దాడులు చేసింది. ఇప్పుడు మా వంతు వచ్చింది, మేం ఊహించనిపనికుండా శక్తివంతమైన ప్రతి దాడులు చేశాం'' అని ట్రంప్ చెప్పారు. అమెరికా బలగాపై ఇరాన్ ప్రయోగించిన అనేక బాలిస్టిక్ క్షిపణులను కూల్చివేసినట్లు సెంట్‌కామ్ ప్రకటించింది. రాన్ సైనిక కమాండ్ కేంద్రాలు,డ్రోన్,క్షిపణి సౌకర్యాలు,తీర ప్రాంత నిఘా కేంద్రాలు,రక్షణ స్థావరాలు,సముద్ర దాడులకు ఉపయోగించే సాధనాలు,ఐఆర్‌జిసి లక్ష్యాలపై దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) ప్రకటించింది. ఇరాక్‌లో ఉన్న ఇరాన్ అనుకూల పిఎంఎఫ్ ఉగ్రవాద దళాలపై సౌదీ అరేబియా దాడి చేసినప్పుడు అక్కడ ఉన్న నలుగురు ఐఆర్‌జిసి సలహాదారులు కూడా హతులయ్యారని ఇరాన్ ధృవీకరించింది.అమెరికా–సౌదీ అరేబియా దాడులకు ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ అనుకూల పిఎంఎఫ్ సైనికుల ప్రతిజ్ఞ చేశారు.ఎలాంటి విరామం లేకుండా జోర్డాన్ (హాషెమైట్ రాజ్యం)పై పదే పదే ఇరాన్ దాడులు చేయడాన్ని సౌదీ అరేబియా విదేశీమంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. ఈ ప్రాంత ప్రజల భద్రత,స్థిరత్వ సాధనకు గంభీరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొంది. మరోవైపు ఇరాన్ కూడా గల్ఫ్‌లో అమెరికాకు ఆశ్రయం ఇస్తున్న దేశాల్లో ఉన్న గగనతల స్థావరాలపై దాడులు చేసింది. ఈ ప్రయత్నంలో కువైట్‌లో ఉన్న చైనా కంపెనీ భవనం ధ్వంసం కావడంతోపాటు అందులో పనిచేస్తున్న ఒక కార్మికుడు మరణించాడు. కువైట్ రక్షణ మంత్రిత్వశాఖ ప్రతినిధి గురువారం ఈ విషయం చెప్పారు. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటినుండి జోర్డాన్‌తోపాటు కువైట్ తదితర దేశాలన్నీ ఇరాన్ డ్రోన్లు, క్షిపణి దాడులకు లక్ష్యాలుగా మారాయి.

**విస్తరించిన యుద్ధం :** యుద్ధం హోర్ముజ్ జలసంధి నుండి ఎర్ర సముద్రం వరకు విస్తరించింది. యెమెన్‌లో హౌతీ తిరుగుబాటు సైన్యాలు ఎర్ర సముద్రంలో సౌదీ అరేబియా నౌకపై దాడులు చేస్తున్నాయి. హోర్ముజ్ జలసంధిలో ఐఆర్‌జిసి దళాలు ఎలాంటి యుద్ధ వ్యూహాలు అమలు చేస్తున్నాయో, అదే వ్యూహాన్ని ఎర్ర సముద్రంలో తాము అమలు చేస్తామని హౌతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు. ఎర్ర సముద్రంలో నౌకల నుండి సుంకాలు వసూలు చేసేందుకు హౌతీలు ప్రణాళిక చేస్తున్నారు.మరోవైపు ఇరాక్ సైన్యంలో అంతర్భాగంగా ఉన్న 67 షియా తెగలతో కూడిన పిఎంఎఫ్ సైన్యాలు కూడా ఇరాన్ ఆదేశంతో సౌదీ అరేబియాపై డ్రోన్ దాడులు ప్రారంభించాయి. ఇదిలా ఉండగా ఇరాన్‌తోపాటు దానికి అనుబంధంగా యెమెన్,ఇరాక్‌ల నుండి యుద్ధం చేస్తున్న ఉగ్రవాద తిరుగుబాటు సైన్యాలకు సౌదీఅరేబియా రక్షణ మంత్రి ప్రిన్స్ ఖలీద్ బిన్ సల్మాన్, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఖండించారు. సల్మాన్ అమెరికా పర్యటన సందర్భంగా వైట్‌హౌస్‌లో బుధవారం జె.డి.వాన్స్‌తో సమావేశమయ్యారు. ఉత్తర ఇరాన్‌లో సెంట్‌కామ్–సౌదీ కూటమి దళాలు పిఎంఎఫ్‌పై ఉమ్మడి దాడిచేసిన తర్వాత వారి ప్రకటన వెలువడింది. ప్రాంతీయ ఉద్రిక్తతలు తగ్గించి స్థిరత్వాన్ని కాపాడాలన్న సౌదీ వైఖరిని ఆయన పునరుద్ఘాటించారు.ఉద్రిక్తతలను తాము కోరుకోవడంలేదని, అదే సమయంలో దాడులను తిప్పికొడతామని అన్నారు.

## పోరాటం విస్తరించినా చర్చలు జరుగుతున్నాయ్

యుద్ధం ఆపేందుకు కృషి

పాకిస్థాన్ ప్రకటన




**ఇస్లామాబాద్ :** అమెరికా–ఇరాన్ ప్రతినిధులను ఒక అవగాహన ఒప్పందానికి చేరువచేయడానికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు అధికారిక మధ్యవర్తిదేశం పాకిస్థాన్ ప్రకటించింది. యుద్ధం ఆపడమే తక్షణ లక్ష్యంగా తాము కృషి చేస్తున్నామని పాకిస్థాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ గురువారం పత్రికాగోష్ఠిలో చెప్పారు. పశ్చిమాసియాలో యుద్ధం విస్తరిస్తున్నప్పటికీ, విశ్వసనీయత లేకపోయినాగానీ మరోవైపు చర్చలు కొనసాగుతున్నాయని, ఒక అవగాహన ఒప్పందం తెచ్చేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నామన్నారు. ఒప్పందం ప్రకారం సానుకూల చర్యలు ముందుకు తీసుకువెళ్ళేందుకు సంబంధిత నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిందిగా ఇరుపక్షాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు."ఇరు పక్షాల మధ్య చర్చలు జరుగుతున్నాయి,ముఖ్యంగా హోర్ముజ్ జలసంధిలో దాడులు,ఉద్రిక్తతలు అధికమైనప్పటికీ ఈ చర్చలు జరుగుతున్నాయి" అని చెప్పారు."ఇరాన్‌పై తాజా దాడుల పరంపరను పూర్తిచేసినట్లు అమెరికా గురువారం ప్రకటించిన నేపథ్యంలోనే పాకిస్థాన్ నుండి కూడా ఈ ప్రకటన వచ్చింది. 13 రోజులపాటు అవిశ్రాంతంగా దాడులు జరిగిన తర్వాత నాలుగు రోజులు అమెరికా చొరవతో దాడులకు విరామం వచ్చింది. కానీ జులై 29వ తేదీ తెల్లవారకముందే జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ఆకస్మిక దాడులు చేయడంతో మళ్ళీ దాడులు మొదలయ్యాయి. అమెరికా–ఇరాన్ మధ్య ఒక తాత్కాలిక ఎంఒయుపై జూన్ 17,18 తేదీలలో సంతకాలు జరిగిన తర్వాత యుద్ధ సమస్య పరిష్కారమైందని యావత్ ప్రపంచ దేశాలు సంతోషించాయి. హోర్ముజ్‌జలసంధి పాక్షికంగా తిరిగి తెరుచుకుంటుందని, యథాతథంగా నౌకల రాకపోకలు కొనసాగుతాయని, అంతర్జాతీయంగా దెబ్బతిన్న వాణిజ్య కార్యకలాపాలు పుంజుకుంటాయని మార్కెట్లు కూడా ఎంతో విశ్వాసంతో ముందుకు అడుగువేశాయి. కానీ తర్వాత 15 రోజులకే పరిస్థితి తల్లకిందులైంది. హోర్ముజ్ జలసంధిలో సుంకాల వసూళ్ళు, జలమార్గాల విషయంలో తలెత్తిన వివాదం అతిపెద్ద సమస్యగా మారి యుద్ధం ముగిసిపోకపోగా కొత్త ప్రాంతాలకు విస్తరించింది. అమెరికా–ఇరాన్ మధ్య పరస్పర క్షిపణి దాడులు ప్రవాహంలా కొనసాగుతూ ఉండటంతో చర్చలపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. సమస్య సత్వరం పరిష్కారానికి అవకాశాలు కనిపించలేదు. పాకిస్థాన్ చొరవతో ఆ రెండు దేశాలమధ్య ఎంఒయు కుదిరిన తర్వాత మళ్ళీ ఘర్షణలు ప్రారంభమయ్యాయి.

## ఉక్రేన్ వ్యాప్తంగా రష్యా క్షిపణి–డ్రోన్ దాడులు

ఎనిమిదిమంది మృతి

అనేక ఇళ్ళు ధ్వంసం

పోలెండ్ గగనతలంలోకి రష్యన్ క్షిపణి

**కీవ్:** ఉక్రేన్‌వ్యాప్తంగా రష్యా క్షిపణి, డ్రోన్ దాడులు చేసింది. గురువారం తెల్లవారకముందుగానే జరిగిన ఈ దాడుల్లో ఎనిమిది మంది మరణించారు. అనేక డజన్లమంది గాయపడ్డారు. మృతుల్లో పిల్లలు కూడా ఉన్నారని అధికారులు చెప్పారు. దాదాపు రోజువారీ దాడులుగా మారిన ఈ యుద్ధంలో ఉక్రేన్ రష్యాలోని సుదూర ప్రాంతాలకు బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించి ఆ దేశ మౌలిక సదుపాయాలకు నష్టం కలిగిస్తోంది. ఉక్రేన్‌లోని పది ప్రాంతాలపై రష్యా దాడులు చేసిందని ఆ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ చెప్పారు. డజన్లకొద్దీ ఇళ్ళు,వ్యాపార కేంద్రాలు,మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయని చెప్పారు. 70 క్షిపణులు, 280 డ్రోన్లతో రష్యా దాడి చేసిందని, వీటిల్లో 28 బాలిస్టిక్ క్షిపణులు ఉన్నాయని, 260 డ్రోన్లను తమ సైన్యాలు కూల్చివేవాయని చెప్పారు. వైమానికస్థావరాలు,ఆయుధ కర్మాగారాలు,సైనిక టెలికమ్యూనికేషన్లు,లాజిస్టిక్ కేంద్రాలు లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని చెప్పారు. బాలిస్టిక్ క్షిపణి దాడుల్లో ఒక సాధారణవ్యక్తి ఇల్లు ముక్కలైపోయిందని చెప్పారు. ఇదిలా ఉండగా తమ గగనతలంలోకి రష్యా క్రూయిజ్ క్షిపణి ఎహెచ్–101ప్రవేశించిందని పోలెండ్ ఆరోపించింది. ఉక్రేన్ విదేశీమంత్రి సిహాబీ ఈ సమాచారం తమకు చెప్పారని పోలెండ్ పేర్కొంది. రాడార్ స్క్రీన్‌పై ఒక గుర్తుతెలియని వస్తువు కనిపించిందని, వెంటనే అది రాడార్ స్క్రీన్ నుండి మాయమైపోయిందని, ఈ విషయంపై తమ అధికారులు ముమ్మరంగా గాలింపు చర్యలతోపాటు దర్యాప్తు కూడా ప్రారంభించారని పోలెండ్ ప్రభుత్వం గురువారం ప్రకటించింది. పోలెండ్ దేశం నాటో కూటమిలో సభ్యురాలుగా ఉంది. తమ గగనతలాన్ని రష్యా ఉల్లంఘిస్తోందని తరచు ఆ దేశం ఆరోపణలు చేస్తోంది. ఈ యుద్ధ దాడుల ప్రదేశాలకు పోలెండ్ గగతల సరిహద్దులు దగ్గరగా ఉన్నాయి.యుద్ధ దాడులకు దూరంగా పోలెండ్ సరిహద్దుల్లో ఉక్రేన్ తన ఆయుధాలను నిల్వచేసి ఉంచడంతో ఇటువైపు ఎక్కువగా దాడులు జరుగుతున్నాయి. నాలుగు సంవత్సరాలుగా ఉక్రేన్–రష్యా మధ్య యుద్ధం జరుగుతోంది. రష్యా క్షిపణి దాడులను అడ్డుకోవడానికి పేట్రియాటిక్ క్షిపణులు తయారు చేసుకోవడానికి అమెరికా నుండి అనుమతి పొందిన మరునాడే భారీస్థాయిలో ఉక్రేన్‌పై రష్యా దాడులు చేసింది.

## సత్తా చాటేందుకే ఈజిప్టు ఓడరేవుపై దాడి : ఇరాన్



**టెహ్రాన్:** ఇరాన్‌పై దాడులు ఉద్ధృతం చేస్తే, ప్రపంచవ్యాప్తంగా చమురు రవాణాకు,వాణిజ్యానికి మరిన్ని ఎక్కువ కష్టాలు వస్తాయని చెప్పడానికి వీలుగా తమ సత్తా ఏమిటో తెలియజేయడానికే ఈజిప్టులోని డమియెట్టా ఓడరేవుపై దాడిచేసినట్లు ఇరాన్ ప్రకటించింది. తమ ఓడరేవుపై బుధవారం జరిగిన పేలుడు,అగ్ని ప్రమాదం డ్రోన్ దాడివల్లనే జరిగిందని గురువారం ఈజిప్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ దాడి ఎవరుచేశారనే విషయంపై ఈజిప్టులో తొలుత అయోమయం ఏర్పడింది. ఈ పేలుడు కీలకమైన ఎన్‌ఎన్‌జి దిగుమతి కేంద్రంలో కార్యకలాపాలకు అంతరాయం కలిగించింది. దీనివల్ల ట్యాంకర్లు దెబ్బతిన్నాయి. ఇరాన్‌లో పరిస్థితులను దిగజార్చి సంక్లిష్టంగా మార్చాలనుకుంటే ప్రపంచ నౌకా రవాణాకు, ఇంధన సరఫరాలకు తీవ్ర అంతరాయాలు కలుగుతాయని చాటి చెప్పడం కోసమే ఈజిప్టు డమియెట్టా ఓడరేవుపై దాడి చేసినట్లు ఇరాన్ వర్గాలను ఉటంకిస్తూ న్యూయార్క్‌టైమ్స్ పత్రిక వార్త ప్రచురించింది. ఈ దాడికి కారణాలపై పూర్తి దర్యాప్తు చేస్తున్నామని, ఈజిప్టు ప్రయోజనాలు,భద్రతా చర్యలపై దృష్టి పెట్టామని ఆ దేశం ప్రకటించింది.

## ఏం కావాలో చెప్పండి

(మొదటి పేజీ తరువాయి)



ఎందుకు వెళ్తున్నారో ఆలోచించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యా వ్యవస్థ ఉండాలనే లక్ష్యంతోనే ఉపాధ్యాయులను విదేశీ పర్యటనలకు పంపుతున్నామన్నారు. ఆస్తులు లేకపోవడం వెనుకబాటుతనం కాదని, విద్య లేకపోవడమే వెనుకబాటుతనమనే విషయాన్ని ప్రభుత్వం ఈ మధ్య నిర్వహించిన 'సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సర్వే'లో స్పష్టమైందన్నారు. ప్రస్తుతం వైట్ కాలర్ ఉదోగాలకు కాలం చెల్లిన నేపథ్యంలో జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా లాంటి దేశాల్లో డిమాండ్ ఉన్న అవసరాలకు తగినట్టుగా నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మానవ సంబంధాలు లేని దేశాలు అభివృద్ధి పథంలో పయనించబోవని, అందుకే విద్యార్థులకు మానవ సంబంధాల ప్రాధాన్యతను ఉపాధ్యాయులు తెలియజేయాలన్నారు.

**విద్యార్థుల సమస్యలపైన తనతో కోట్లాడండి..**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తాను పాటుపడతానని, ఉపాధ్యాయ సంఘాలు మాత్రం విద్యార్థుల సమస్యల విషయంలో తనతో కొట్లాడాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. 12వ తరగతి తర్వాత విద్యార్థికి ప్రపంచంపై సంపూర్ణ అవగాహన ఉండాలని, ఆ అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. వచ్చే అయిదేళ్ల వరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు దీక్షబూనాలన్నారు. ప్రపంచ దేశాలు మన వైపు చూసేలా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దాలని, సమాజం కోసం, తరతరాల భవిష్యత్‌ను మార్చేందుకు అయిదేళ్ల పాటు పాటుపడేందుకు ప్రతిజ్ఞ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**నెహ్రూ,ఇందిరాగాంధీని ఆరోపిస్తున్నారు..**

విద్యా, నీటిపారుదల రంగాలను ప్రాధాన్యాత అంశాలుగా ఎంచుకుని,దేశాన్ని సుభిక్షమైన దేశంగా తీర్చిదిద్దిన నాటి ప్రధాని నెహ్రూపైనా, పాకిస్తాన్‌ను ఓడించి, ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసి, గరిబీ హటావో నినాదంతో పని చేసిన నాటి ప్రధాని ఇందిరా గాంధీపైన కొందరు ఆరోపణలు చేస్తున్నారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి 2014 వరకు ప్రధానమంత్రులుగా చేసిన వారు రూ.51 లక్షల కోట్ల అప్పులు చేస్తే, 2014 నుంచి 2026 సంవత్సరం వరకు ఈ 12 ఏళ్ల కాలంలోనే ప్రధాని నరేంద్ర మోదీ రూ.151లక్షల కోట్లు అప్పులు చేశారని ఆరోపించారు. నాడు నిర్మించిన నాగార్జున సాగర్, ఎస్సారెస్పీ వంటి ప్రాజెక్టుల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం 2 కోట్ల 85 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి సాధ్యమైందన్నారు. 80వేల పుస్తకాలు చదివి కట్టిన కాళేశ్వరంప్రాజెక్టు కూళేశ్వరమైందని ఆరోపించారు.

**ప్రతి ఏటా 10 నుంచి 15 మంది ఉపాధ్యాయులను విదేశీ విద్యకు పంపిస్తాం..**

ఐఎఎస్‌లు, ఐపిఎస్‌ల తరహా ప్రతి ఏటా 10 నుంచి 15 మంది ఉపాధ్యాయులను విదేశీ విద్య కోసం విదేశాలకు పంపిస్తామని సిఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. వారు అక్కడ నేర్చుకున్న జ్ఞానాన్ని ఇక్కడి విద్యార్థులకు పంచాలని సూచించారు. ఆయా దేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయులు అక్కడి అనుభవాలను ఇక్కడ ఆచరణలో తీసుకురావాలన్నారు. ఈ సమావేశానికి తొలుత ఫిన్లాండ్, జర్మనీ దేశాలలో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను సిఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, సిఎం ముఖ్యకార్యదర్శి ఎన్.శ్రీధర్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డి డైరెక్టర్ శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

సంగారెడ్డి, జనగామ, హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, వికారాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, సిద్ధిపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 1 వరకు ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశముందన్నారు. ఆగస్టు 1 నుంచి 6 వరకు రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కొనసాగనున్నాయని, అన్ని జిల్లాల్లో గంటకు 3040 కిలోమీటర్ల వేగంతో బలమైన ఉపరితల గాలులు వీచే అవకాశముందన్నారు. రాజధాని హైదరాబాద్‌లో ఇప్పటికే పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. మరో రెండు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముండటంతో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల నేపథ్యంలో హైడ్రా, జిహెచ్ఎంసి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వాటర్‌లాగింగ్ ప్రాంతాల్లో భారీ మోటార్లు ఏర్పాటు చేసి నీటి నిల్వలను తొలగిస్తున్నారు. ఐటీ కారిడార్‌లోని రాయదుర్గం, బయోడైవర్సిటీ జంక్షన్, ఐకియా జంక్షన్ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరడంతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది.

**కొన్ని జిల్లాల్లో ఇంకా వర్షపాతం లోటే**

ఒకవైపు భారీ వర్షాల హెచ్చరికలు జారీ అవుతుండగా, మరోవైపు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో వర్షపాతం లోటు కొనసాగుతోంది. సూర్యాపేటలో 74 శాతం, నల్లగొండలో 70 శాతం, ఖమ్మంలో 63 శాతం లోటు నమోదైంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి భువనగిరి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, జోగులాంబ గద్వాల తదితర జిల్లాల్లో కూడా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

## ప్రాజెక్టులకు జలకళ

(మొదటి పేజీ తరువాయి)

చేరుతోంది. 9,250 క్యూసెక్కుల వరద వస్తుండటంతో ప్రస్తుత నీటిమట్టం 1,065.7 అడుగులకు చేరింది. మరోవైపు నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 3,935 క్యూసెక్కుల వరద నీరు వస్తుండటంతో ప్రస్తుత నీటిమట్టం 1,395.8 అడుగులకు చేరింది. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులుగా ఉంది. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 17.80 టిఎంసిలకు ప్రస్తుత నీటి నిల్వ సామర్థ్యం 7.46 టిఎంసిలుగా ఉంది. కాళేశ్వరం వద్ద గోదావరి, ప్రాణహిత ఉభయ నదుల ఉద్ధృతి పెరుగుతోంది. సాధారణ పుష్కర ఘాట్, సరస్వతీ పుష్కర ఘాట్ వద్ద జలకళ సంతరించుకుంది. పుష్కర ఘాట్ మెట్ల వద్ద నీటి మట్టం 6.3850 మీటర్లకు చేరింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం పెరుగుతుంది. మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో ప్రవాహం కొనసాగుతోంది.

మేడిగడ్డ బ్యారేజీకి ఎగువ నుంచి 1.1 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా 85 గేట్లు గత మూడేళ్లుగా తెరిచే ఉండటంతో నీరు దిగువకు వెళ్లిపోతుంది. సంగారెడ్డి జిల్లా సింగూరు జలాశయానికి ఇన్‌ఫ్లో 517 క్యూసెక్కులు వరద చేరుతుంది. అవుట్‌ఫ్లోగా 470 క్యూసెక్కుల నీటిని అధికారులు వదులుతున్నారు. సింగూరు జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 29.91 టిఎంసిలు కాగా ప్రస్తుతం 4.24 టీఎంసీలు ఉంది. పెరుగుతోంది. ములుగు జిల్లా టేకులగూడెం వద్ద జాతీయ రహదారి163పైకి గోదావరి వరద నీరు చేరడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పూసూరు గోదావరి వంతెన వద్ద నది ఉధృతంగా ప్రవహిస్తుండగా, పేరూరు వద్ద గోదావరి నీటిమట్టం గురువారం సాయంత్రం 5 గంటల సమయానికి 14 మీటర్లకు చేరుకుంది. భద్రాచలం వద్ద గోదావరి నది ఉరకలేస్తోంది. గత నాలుగురోజుల నుండి కురుస్తున్న వర్షాలకు నదిలోకి కొత్తనీరు వచ్చి చేరడంతో ప్రస్తుతం భద్రాచలం వద్ద 28.5 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది. ప్రస్తుతం అతి నెమ్మదిగా పెరుగుతున్నప్పటికీ శుక్రవారం ఉదయం నుండి వేగంగా పెరిగే అవకాశం ఉన్నట్లు కేంద్ర జలనవరుల సంఘం అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో పడుతున్న వర్షాలకు తెలంగాణలోని చర్ల మండలంలో ఉన్న తాలిపేరు ప్రాజెక్టులోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరుతుండటంతో తాలిపేరు నిండుకుండలా మారింది. ప్రాజెక్టు గరిష్ట సామర్థ్యానికి చేరుకోవడంతో 22 ప్రాజెక్టు గేట్లు ఎత్తి 90వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. దీంతో గోదావరికి మరింత వరద తాకిడి పెరుగుతోంది. ఇంద్రావతి, ప్రాణహిత ఉపనదులు వర్షాల కారణంగా పెద్దఎత్తున ప్రవహిస్తూ గోదావరిలో కలుస్తున్నాయి. మరో నాలుగు రోజుల పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తెలంగాణాల్లో భారీ వర్షా సూచన ఉండటంతో గోదావరినదికి మరింత వరద పెరగనుంది.

**జూరాల గేట్లు ఎత్తివేత :**

భారీ వర్షాలకు జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టులోకి వరద పోటెత్తుతోంది. దీంతో అధికారులు పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఇన్‌ఫ్లో 90,000 క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో 39,080 క్యూసెక్కులు, జలవిద్యుత్ ద్వారా 38,272 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి శ్రీశైలం జలాశయానికి 77,352 క్యూసెక్కుల నీరు వెళుతోంది. జూరాలకు వరద ప్రవాహం పెరిగితే అధికారులు మరిన్ని గేట్లు ఎత్తనున్నారు

## దేశవ్యాప్తంగా కార్మికులు, రైతుల నిరసన

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న అనేక రైతు సంఘాలు,వివిధ రంగాలకు చెందిన సమాఖ్యలు, సంస్థలు జులై 29న న్యూఢిల్లీలోని తల్కటోరా స్టేడియంలో జరిగిన జా తీయ సదస్సులో ఈ మేరకు ఒక తీర్మానం చేశా యి. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక–కర్షక, విద్యార్థి,యువజన విధానాలకు వ్యతిరేకం గా దేశవ్యాప్తంగా ఆందోళన ఉద్ధృతం చేయాలని సదస్సు పిలుపు ఇచ్చింది. జీవనోపాధి,రాజ్యాంగ హక్కుల సాధన, జాతీయ ప్రయోజనాల పరిరక్షణకోసం కార్మికులు, రైతులు, విద్యార్థులు,యువకులతో పాటు సమాజంలోని అన్ని ప్రజాస్వామ్య వర్గాల ఐక్యతను బలోపేతం చేయాలని సదస్సు పిలుపు ఇచ్చింది. ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చకపోతే ఉమ్మడి రాష్ట్రస్థాయి సమావేశాలు, వికేంద్రీకృత మహాపడావ్‌లు (బ్రహ్మాండమైన స మావేశాలు)నిర్వహించాలని, తదుపరి జాతీయస్థాయిలో ప్రత్యక్ష కార్యాచరణలకు సిద్ధపడాలని కోరింది. పునాదిస్థాయిలో ప్రతిచోటా సామూహి క గ్రామ సభలు,కిసాన్ పంచాయత్‌లు నిర్వహిం చి రైతులను సమీకరించాలని, దాంతోపాటే జిల్లాస్థాయిలో ర్యాలీలు,రాష్ట్రాలస్థాయిలో ధర్నాలు నిర్వహించి ప్రభుత్వం కొనసాగిస్తున్న కార్మిక,కర్షక వ్యతిరేక ఎజెండాను ప్రజల దృష్టికి తీసుకురావాలని తద్వారా కార్మికులు–రైతుల ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని తీర్మానించింది. తదుపరి దశలో రైతుల నుండి రుణాలు వసూలు చేసేందుకు దోపిడీ చర్యలకు పాల్పడే ఆర్థికసంస్థలకు వ్యతిరేకంగా శాసనోల్లంఘన ఉద్యమాన్ని చే పడతామని,రైతులకు ప్రభుత్వం ఈ విషయంలో లిఖితపూర్వక హామీ ఇచ్చేవరకు నిరసనలు కొనసాగుతాయని, ఐనప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోతే భారత్ బంద్ కార్యక్రమాన్ని కూడా రైతులు–కార్మికులు చేపడతారని జాతీయ సదస్సు తీర్మానించింది. భారత్ బంద్ తర్వాత కూడా ప్రభుత్వం రైతుల పాలిట దోపిడీదారులుగా మారిన ఆర్థిక సంస్థలను, ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడించే కార్యక్రమాలు అనివార్యంగా నిరంతరం కొనసాగుతాయని కూడా జాతీయ సదస్సు హెచ్చరిక చేసింది. కార్మికుల, రైతుల ఉద్యమాన్ని బలోపేతం చేయడానికి,ప్రజాస్వామ్య ఉద్యమాలకు సంఘీభావం విస్తరించడానికి,సమానత్వం,న్యాయం,లౌకికతత్వం, సామాజిక ప్రగతి ఆధారంగా సామాజిక పోరాటాలను ముందుకు తీసుకువెళ్ళడానికి సదస్సు ప్రతిన పూనింది. కార్మికులు, రైతులు తమ తమ సంఘాలు, సంఘటనల తరపున పోరాటాలు చేయడమే కాకుండా, కార్మికులు,రైతులు,అన్ని ప్రజాస్వామ్యశక్తులతో కూడిన విస్తారమైన ఐక్య ఉద్యమం మాత్రమే దేశ రాజ్యాంగాన్ని, ప్రజల జీవనోపాధిని సమర్థవంతంగా కాపాడగలదని, ఈ ఉద్యమం మాత్రమే భారతదేశ లౌకిక,ప్రజాస్వామ్య మౌలిక స్వరూప స్వభావాలను పరిరక్షించగలవని సదస్సు ఉద్ఘాటించింది.ఈ సదస్సులో ప్రసంగించిన కార్మిక,కర్షక నాయకులు అందరూ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఏకగ్రీవంగా ప్రతిఘటించారు. తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభం, పెరుగుతున్న నిరుద్యోగం,అసాధారణస్థాయిలో ధరల పెరుగుదల, ప్రభుత్వరంగ సంస్థలు,ప్రజాసేవల ప్రైవేటీకరణ,అనుకూలంగా మలచుకున్న కార్మిక చట్టాలను అడ్డం పెట్టుకుని కార్మికవర్గంపై దాడి, రైతుల డిమాండ్లను తీవ్రంగా నిర్లక్ష్యం చేయడం, రైతులు, కార్మికులకు వ్యతిరేకమైన ఒప్పందాలు విదేశాలతో చేసుకోవడం, రోజురోజుకూ సన్నగిల్లిపోతున్న ప్రజాస్వామ్యస్వేచ్ఛ, కుల, మత, వర్గాల ప్రాతిపదికపై ప్రజలను విభజించే ప్రయత్నాలు తీవ్రస్థాయిలో పెరిగిపోవడం వంటి అనేక ప్రధానమైన అంశాలను సదస్సులో ప్రసంగించిన నాయకులు ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ సమస్యల పరిష్కారాలకు పోరాటాలను రాబోయేకాలంలో మరింత ఐక్యంగా ముందుకు తీసుకువెళ్ళాలని పిలుపు ఇచ్చారు.

**డిమాండ్ల పరిష్కారానికి సదస్సు ఏకగ్రీవ తీర్మానం :**

దేశంలో కార్మికులు,రైతులు,విద్యార్థులు,సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సదస్సు తీర్మానం చేసింది. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దుచేయాలని, కార్మిక సంఘాల హక్కులకు పూర్తి భరోసా ఇవ్వాలని, కార్మిక రక్షణలన్నింటినీ పునరుద్ధరించాలని, కరువు భత్యాన్ని జతకలిపిన రూ.42,000 చట్టబద్ధమైన కనీస నెల వేతనాన్ని నిర్ధారించాలని, సి2+50 వద్ద కనీస మద్దతు ధర ఇవ్వాలని, అదేవిధంగా రైతు ఉత్పత్తుల సేకరణకు పూర్తి భరోసా ఇవ్వాలని కోరుతూ, కార్మిక వ్యతిరేక,రైతు వ్యతిరేక విదేశీ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాలను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఈ పది జాతీయ కార్మిక సంఘాల ఐక్యవేదిక, సంయుక్త కిసాన్ మోర్చా ఛత్రఛాయలో దేశవ్యాప్తంగా ఉన్న అనేక రైతు సంఘాలు, రంగావారీ సమాఖ్యలు, సంస్థల ఉమ్మడి సదస్సు తీర్మానం చేసింది. ప్రైవేటీకరణ, కేంద్ర ప్రభుత్వం అమలు చేసేందుకు దృఢనిశ్చయంతో ఉన్న జాతీయ ద్రవ్య విధానం 2.0ను నిలిపివేయాలని,మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేయాలని, సామాజిక భద్రతను విస్తరించాలని,ఉద్యోగితను సృష్టించాలని,ప్రభుత్వ విద్యావ్యవస్థను, ఆరోగ్య భద్రతను పటిష్టం చేసేందుకు వ్యవస్థీకృత చర్యలు తీసుకోవాలని, జాతీయ ప్రభుత్వ పంపిణీ వ్యవస్థను సంరక్షించాలని,కఠిన చట్టాలన్నింటినీ ఉపసంహరించుకోవాలని,రాజ్యాంగ ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షించాలని కోరుతూ చేసిన సమగ్ర ప్రకటనను ఈ జాతీయ సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. పారిశ్రామిక కార్మికులు,ప్రభుత్వరంగ ఉద్యోగులు,రవాణా కార్మికులు,బ్యాంకు,బీమా రంగ ఉద్యోగులు,ఉపాధ్యాయులు,పీస్‌రేట్ కార్మికులు,గిగ్,ఫ్లాట్‌ఫామ్ కార్మికులు సహా అన్ని రంగాలకు చెందిన అసంఘటిత కార్మిక ప్రతినిధులు,మహిళాకార్మికులు,పెన్షనర్లు, వివిధ వర్గాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు దారితీసిన కాక్రోచ్ జనతాపార్టీ నాయకత్వాన విద్యార్థులు, యువకుల ఉద్యమం తర్వాత కొద్దిరోజులకే జరిగిన ఈ జాతీయ సదస్సు ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. కేవలం విద్యార్థులతో మాత్రమే కాకుండా లౌలిక శక్తులతో కూడిన చాలా విస్తారమైన కూటమిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఎక్కువమంది వక్తలు ఆకాంక్షించారు.

**సార్వత్రిక సమ్మెలు చేసినా కార్మికుల అణచివేత ఆగలేదు**

గడచిన ఆరు సంవత్సరాలలో దేశంలో ఆరు సార్వత్రిక సమ్మెలు జరిగినప్పటికీ మోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం కార్మిక అణచివేత చర్యలు మానుకోలేదని, కార్మిక వ్యతిరేక చట్టాలను అమలులోకి తీసుకువచ్చిందని జాతీయ సదస్సు ఆమోదించిన తీర్మానం పేర్కొంది. కార్మికవర్గాన్ని బలహీనపరచి వారిని అణచివేయాలని కేంద్రం నిర్ణయించుకుందని విమర్శించింది. కార్మిక సంఘాలు అధికారికంగా గుర్తింపు పొందడం సంక్లిష్టంగా మారిందని, కార్మిక సంఘాలకు గుర్తింపులను తొలగిస్తున్నారని, తద్వారా యాజమాన్యాలు ఉల్లంఘన చర్యలకు చట్టబద్ధత లభించిందని తీర్మానం పేర్కొంది. దేశం చాలా లోతైన ఆర్థిక,రాజకీయ,సామాజిక, సాంస్కృతిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ప్రస్తుత సంక్లిష్ట తరుణంలో కార్మిక–కర్షక ప్రధాన ఉత్పాదక శక్తులమధ్య పెరుగుతున్న ఐక్యత ఎంతో ముఖ్యమైనది. కేంద్ర ప్రభుత్వం జాతీయ,విదేశీ బడా పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం కలిగించే చర్యలను మానకుండా కొనసాగిస్తూనే ఉంది, మరోవైపు దేశంలో సాధారణ ప్రజలు,ముఖ్యంగా పేదలు,బలహీనవర్గాలలో అసమానతలు మరింతగా పెరిగిపోయాయి అని తీర్మాన పేర్కొంది.

# 10 వేల మీటర్ల రన్‌లో పతకం నెగ్గిన భారత అథ్లెట్

## గుల్వీర్‌కు రజతం
## లాంగ్ జంప్‌లో శ్రీశంకర్‌కు సిల్వర్

ప్రతిష్టాత్మక కామన్వెల్త్ గేమ్స్‌లో భారత్‌కు మరో రెండు రజతాలు లభించాయి. భారత లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్, లాంగ్ జంపర్ మురళీ శ్రీశంకర్ వెండి పతకాలు అందుకున్నారు. ఆసియా గేమ్స్ కాంస్య పతక విజేత అయిన గుల్వీర్ కామన్వెల్త్ గేమ్స్‌లో కొత్త చరిత్ర సృష్టించాడు. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో





రజతం గెలిచి ఈ ఘనత సాధించిన భారత తొలి అథ్లెట్‌గా రికార్డులకెక్కాడు.

**సెమీస్‌కు అనిమేశ్...** పురుషుల 200 మీటర్ల స్ప్రింట్‌లో నేషనల్ రికార్డ్ హోల్డర్ అనిమేశ్ కుజుర్ సెమీఫైనల్ చేరుకున్నాడు. బుధవారం జరిగిన హీట్4లో 23 ఏండ్ల కుజుర్ 20.46 సెకండ్లతో అగ్రస్థానం, ఓవరాల్గా ఏడో స్థానం సాధించి సెమీస్ బెర్తు అందుకున్నాడు.

**పంచ్ అదిరింది...** మెగా ఈవెంట్‌లో భారత బాక్సర్ల జోరు కొనసాగుతోంది. బుధవారం బరిలోకి దిగిన ఆరుగురు బాక్సర్లు క్వార్టర్ ఫైనల్లో గెలిచి సెమీస్ చేరడంతో భారత్‌కు మరో ఐదు పతకాలు ఖాయమయ్యాయి. సాక్షి, సచిన్ సివాచ్, అంకుశ్ యాదవ్, అరుంధతి చౌదరి, నరేందర్ కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నారు. 51 కేజీ క్వార్టర్స్ పోరులో సాక్షి 50తో నార్తర్న్ ఐర్లాండ్కు చెందిన కైట్లిన్ ఫ్రైయర్న్ను చిత్తు చేయగా.. అరుంధతి (70కేజీ) 31తో హెండర్సన్ (న్యూజిలాండ్)పై, జైస్మిన్ లంబోరియా 41తో ఎలీస్ గ్లిన్ (ఇంగ్లండ్)పై కష్టపడి గెలిచారు. మెన్స్ 60 కేజీ బౌట్లో మాజీ వరల్ యూత్ చాంప్ సచిన్ 50తో మొరెమి (బోస్తానా)పై ఏకపక్ష విజయం సాధించగా.. 80 కేజీ బౌట్లో అంకుశ్ కూడా 50తో జేడ్ మికాక్ (సేచెల్స్)ను చిత్తుగా ఓడించాడు. ఇక హోరాహోరీగా సాగిన 90+కేజీ క్వార్టర్స్లో నరేందర్ 32తో సెకో (సమోవా)పై చెమటోడ్చి విజయం సాధించాడు.

**తుదిపోరుకు తజిందర్, సమర్దీప్...** భారత స్టార్ షాట్ పుటర్ తజిందర్ సింగ్ తూర్, సమర్దీప్ సింగ్ ఫైనల్ రౌండ్‌కు క్వాలిఫై అయ్యారు. గోల్ మెడల్



ఫేవరెట్ అయిన తజిందర్ క్వాలిఫికేషన్ రౌండ్ గ్రూప్‌ఎలో గుండును 20.14 మీటర్ల దూరం విసిరి రెండో స్థానంలో నిలిచాడు, షాట్పుట్లో 20 మీటర్ల మార్కును దాటిన వారితో పాటు ఓవరాల్గా టాప్12లో నిలిచిన వారికి ఫైనల్ బెర్త్ లభిస్తుంది.

# హాకీ ప్లేయర్లకు కాషాయం జెర్సీ..

## కలర్ మార్పును సమర్థించుకున్న హాకీ ఇండియా



హాకీ వరల్డ్ కప్ కోసం భారత జట్టు కొత్త జెర్సీలో దర్శనమివ్వనున్నది. నెదర్లాండ్స్, బెల్జియం దేశాల్లో జరగనున్న వరల్డ్‌కప్‌లో.. టీమిండియా ప్లేయర్లు కాషాయం రంగు జెర్సీల్లో ఆడనున్నారు. గతంలో ఉన్న బ్లూ కలర్ జెర్సీలను మార్చేశారు. దీనిపై గురువారం హాకీ ఇండియా ఓ ప్రకటన విడుదల చేసింది. సంప్రదాయ బ్లూ కిట్స్ స్థానంలో.. కాషాయ కిట్స్‌తో భారత మహిళల, పురుషుల హాకీ ప్లేయర్లు కనిపించనున్నట్లు హాకీ ఇండియా పేర్కొన్నది. వచ్చే నెల 15వ తేదీ నుంచి హాకీ వరల్డ్ కప్ టోర్నీ జరగనున్న విషయం తెలిసిందే. జెర్సీ రంగు మార్పు గురించి మాజీ కెప్టెన్ వీరేన్ రస్కినా ప్రశ్నించారు. అయితే సాంకేతిక అవసరాల దృష్ట్యా జెర్సీ కలర్‌ను మార్చినట్లు హాకీ ఇండియా స్పష్టం చేసింది. బ్లూ రంగు సింథటిక్ పిచ్లపై విజిబులిటీ పెంచేందుకు జెర్సీ రంగును కాషాయానికి మార్చినట్లు హాకీఇండియా చెప్పింది. ఇటీవల సోషల్ మీడియాలో హాకీ ఇండియా కొత్త జెర్సీలపై ఓ పోస్టు కూడా పెట్టింది. జెర్సీ కలర్, డిజైన్ వెనుక కథ ఉన్నట్లు పేర్కొన్నది. కొత్త జెర్సీలు భారతదేశ గర్వానికి సంకేతమని చెప్పింది. ప్లేయర్లు, సపోర్ట్ స్టాఫ్తో సంప్రదించిన తర్వాత ఆ రంగును మార్చినట్లు హాకీ ఇండియా వెల్లడించింది. కాషాయం రంగు.. ధైర్యానికి, త్యాగానికి, విజయానికి సంకేతంగా నిలుస్తుందని తన ప్రకటనలో హాకీ ఇండియా తెలిపింది. కాషాయంతో పాటు కొత్త డిజైన్‌తో కూడిన వైట్ కలర్ జెర్సీలు కూడా ప్లేయర్ల వద్ద ఉండనున్నాయి.



# అంతర్జాతీయ క్రికెట్‌కు రహానే వీడ్కోలు

టీమిండియా సీనియర్ క్రికెటర్ అజింక్య రహానే(38) గురువారం అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పారు. ముంబై దేశవాళీ క్రికెట్ నుంచి భారతదేశపు గొప్ప టెస్ట్ విజయాల వరకు తనను తీసుకువెళ్లిన క్రికెట్కు అజింక్య అన్నీ ఫార్మాట్ల క్రికెట్‌కు భారమైన హృదయంతో తప్పుకున్నాడు. రహానే సోషల్ మీడియా వీడియో ద్వారా తన నిర్ణయాన్ని ప్రకటించాడు. భారత దేశం తరపున 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20లు ఆడిన రహానే తన కెరీర్ని ముగించడానికి ఇదే సరైన సమయం అని తెలిపాడు. కాగా, విదేశీ గడ్డపై క్లిష్ట పరిస్థితితుల్లో అతడు ఆడిన ఇన్నింగ్స్ టీమిండియాకు ఎన్నో చిరస్మరణీయమై విజయాలన్నందించాయి. తన కు సహకరించిన ప్రతి ఒక్కరికి రహానే కృత కృతజ్ఞతలు తెలిపాడు.

## పోటీ కోసం జీకె
(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

# భారతదేశంలో అతి పొడవైన కాలువ?

☞ 1993లో మహారాష్ట్రలో ఎక్కడ భూకంపం సంభవించింది :
లాటూర్

☞ రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు మనదేశంలో ఓటు హక్కు పొందడానికి కనీస వయసు ఎంత?
21 సంవత్సరాలు

☞ దామోదర్ వ్యాలీ ప్రాజెక్టుని ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
1948

☞ కమ్యూనల్ అవార్డును ప్రకటించిన బ్రిటిష్ ప్రధాని ఎవరు?
మెక్ డొనాల్డ్

☞ భారత జాతీయ సైన్యాన్ని ఏర్పరచినది?
సుభాష్ చంద్రబోస్

☞ మనదేశంలో శివాలిక్ కొండలను అసోంలో ఏ పేరుతో పిలుస్తారు?
మిష్మికొండలు

☞ బుధ గ్రహానికి గల ఉపగ్రహాలు
0

☞ ఎరుపు + ఆకుపచ్చ నీలం రంగులను కలిపితే దాదాపుగా వచ్చేరంగు
తెలుపు

☞ స్వర్ణముఖి బ్యారేజ్ ఏ జిల్లాలో కలదు
నెల్లూరు

☞ గాంధీ–ఇర్విన్ ఒప్పందంలో భాగంగా శాసనోల్లంఘన ఉద్యమాన్ని నిలిపివేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన వ్యక్తి
సుభాష్ చంద్రబోస్

☞ చెరువుల ద్వారా నీటి పారుదలను అత్యధికంగా ఏ ప్రాంతంలో చూడొచ్చు?
తమిళనాడు

☞ సర్ స్టాఫర్డు క్రిప్సు రాయబారం?
1942

☞ మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన ఇండియన్ లిబరల్ ఫెడరేషన్ నాయకుడు ఎవరు?
తేజ్ బహదూర్ సప్రూ

☞ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రపంచ శాంతి కోసం ఏర్పాటైన సంస్థ ఏది?
ఐక్యరాజ్య సమితి

☞ పట్టణ ప్రాంత పేదరిక నిర్మూలన పథకం
మెప్మా (MEPMA)

☞ కాంగో ప్రాంతాన్ని కనుగొన్నది
కామెరూన్

☞ మన దేశమునకు ఎక్కువగా విదేశీమారక ద్రవ్యాన్ని సంపాదించుచున్న ఖనిజం:
అభ్రకం

☞ ఖుదై ఖిద్మత్ గార్స్ ' దళాన్ని ఏర్పాటు చేసింది ఎవరు?
ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్

☞ తెలంగాణ ఇంజినీర్ల దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
జులై 11

☞ ఈశాన్య రాష్ట్రాల్లో శాసనోల్లంఘన ఉద్యమానికి నాయకత్వం వహించింది ఎవరు?
రాణి గైడిన్ ల్యూ



☞ నీటి ఉపయోగిత వంద శాతం ఉన్న నీటిపారుదల పద్ధతి ఏది?
బిందు సేద్యం

☞ 1935వ చట్టములోని ముఖ్యాంశం?
భారత సమాఖ్య ఏర్పడుట

☞ సముద్రంలో సోడియమ్ క్లోరైడ్ కాక ఎక్కువగా వుండే ఇతర లవణాలు
పైవన్నియూ

☞ రాజస్థాన్ రాజధాని
జైపూర్

☞ కోల్కతా రేవు ఎగుమతులలో ఒకటి
తేయాకు

☞ ప్రపంచ కాన్సర్ రోజు
ఫిబ్రవరి 4

☞ తమిళనాడులో ఉప్పు సత్యాగ్రహానికి నాయకత్వం వహించింది ఎవరు?
సి. రాజగోపాలాచారి

☞ 1. అత్యంత పొడవైన రైలు కమ్ రోడ్ బ్రిడ్జి ఏ ప్రాంతాల మధ్య ఉంది?
రాజమండ్రి–కొవ్వూరు

☞ భారతదేశంలో అతి పొడవైన కాలువ ఏది?
ఇందిరా గాంధీ కాలువ

☞ గాంధీజీ దండి యాత్రను ఏ రోజున ప్రారంభించారు?
1930 మార్చి 12

☞ రౌండ్ టేబుల్ సమావేశాలు ఎక్కడ జరిగాయి?
లండన్

☞ ఇప్ప చెట్ల పూల నుండి......తయారుచేస్తారు.
ఇప్పసారా

☞ నీటిలో ముంచిన కర్ర వంగి కనిపిస్తుంది. కారణం
వక్రీభవనం

☞ వేసవిలో గట్టిగాను, శీతాకాలంలో జిగటగాను ఉండే మృత్తికలు
నల్లరేగడి మృత్తికలు

☞ చైనా టిబెట్ పై దాడి చేసినది
1950

☞ హఠాత్తు వరదలు, వర్షాలకు భూమి పైపొర పొరలు పొరలుగా కొట్టుకొనిపోవుట
పట క్రమక్షయం

☞ ఆల్పైన్ ఉద్భిజ్జాలు ఇచట పెరుగుతాయి
ఎత్తు ఎక్కువగా ఉన్న హిమాలయాలలో

☞ ప్రపంచ జనాభా దినోత్సవం?
జులై 11

☞ 1929లో జరిగిన కాంగ్రెస్ సమావేశానికి ఎవరు అధ్యక్షత వహించారు?
జవహర్ లాల్ నెహ్రూ

☞ భారతదేశంతో అత్యంత ఎక్కువ భూభాగం సరిహద్దుగా ఉన్న దేశం ఏది?
బంగ్లాదేశ్

☞ ఉప్పు సత్యాగ్రహం?
1930

☞ ఆఖరి మొగలాయి చక్రవర్తి
రెండవ బహదూర్ షా

☞ కామన్వెల్తులో సభ్యత్వంగల దేశాల సంఖ్య?
53

☞ తెలివితేటలకు మూలస్థానము
మస్తిష్కము

## మోదీ ప్రభుత్వానికి కార్మికులు శత్రువులు

# కార్పొరేట్ శక్తులు మిత్రులా?

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్
### పెబ్బేర్‌లో ఘనంగా ఎఐటియుసి వనపర్తి జిల్లా నాలుగవ మహాసభలు



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి కార్మికులు శత్రువులుగా, కార్మికులు శ్రమను దోచి సంపదను లూటీ చేసే కార్పొరేట్ శక్తులు మిత్రులుగా మారారని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్ ధ్వజమెత్తారు. ఎఐటియుసి వనపర్తి జిల్లా నాలుగో మహాసభలు పెబ్బేరు మండల కేంద్రంలో గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పెబ్బేరు మార్కెట్ యార్డ్ నుండి సయిరాం ఫంక్షన్ హాల్ వరకు వందలాదిమంది కార్మికులతో పట్టణంలో భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించారు. మహాసభల ప్రారంభంగా ఎఐటియుసి జెండాను సంఘం రాష్ట్ర కార్యదర్శి బాలరాజ్ ఆవిష్కరించి మాట్లాడుతూ పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిరంకుశంగా కార్మికులు సంక్షేమానికి సమాధి కట్టే విధంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడులుగా తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లు కేవలం కార్పొరేట్ శక్తులు, దోపిడి యాజమాన్యాలకు అనుకూలంగా కార్మికులను కట్టు బానిసలుగా మార్చేందుకు తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం బిజెపి విధానాలను నిరసిస్తున్నామని బయటకు చెబుతున్న అంతర్గతంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రాష్ట్రంలో దశలవారీగా అమలు చేసేందుకు కుట్రలు చేసిందని అందులో భాగంగానే ఇండ్రస్టియల్ పాలసీలో 12 గంటల పని విధానం తప్పుడు జిఒను రేవంత్‌రెడ్డి సర్కార్ దొడ్డిదారిన తీసుకొచ్చిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, అధ్యక్షులు శ్రీహరి, ప్రధాన కార్యదర్శి మోష, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గోపాలకృష్ణ, నాయకులు గాంధీ, పెద్ద మొగులయ్య, రాములు, శ్యాంసుందర్, భాస్కర్, భారత్, రమేష్, చిన్న కురమయ్య, పి.కళావతమ్మ, కృష్ణవేణి, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి,పి.సురేష్, రవీందర్, శ్రీను, నరసింహ, నరేంద్, అంజి, ఇజ్రాయిల్, గోపాల్, చందు తదితరులు పాల్గొన్నారు.

## మోదీ పాలన తీరుతో

# దేశంలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు

### సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/బోనకల్ :** మోదీ పాలన తీరుతో దేశంలో ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని, ఈ పరిణామం దేశ భవిష్యత్‌పై తీవ్ర పరిణామం చూపుతుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. కార్పోరేట్ శక్తులు, దేశ సంపదను తమ గుప్పిట పడుతున్నారని ఆయన ఆరోపించారు. సిపిఐ ఖమ్మం జిల్లా మధిర, బోనకల్, చింతకాని మండలాల శిక్షణా తరగతులు గురువారం స్థానిక ఎస్ఆర్ కళ్యాణ మండపంలో జరిగాయి. ప్రారంభ సూచికంగా పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు ఆవిష్కరించారు. బత్తినేని నీరజ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ శిక్షణా తరగతుల్లో హేమంతరావు మాట్లాడుతూ మోదీ పాలన ప్రజలను విస్మరించి సాగుతుందని, ప్రైవేట్ రంగం విరాజిల్లుతుందని, ప్రధానంగావ్యవసాయ రంగం, సంక్షోభంలో కూరుకుపోతుందని, నిరుద్యోగం పెరిగి, అల్పాదాయ వర్గాల సంఖ్య గణనీయంగా పెరిగి ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోను పాలకులు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని, హామీలు అమలు కాక ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. ప్రస్తుత పరిస్థితిలో కమ్యూనిస్టుల అవసరం పెరుగుతుందని, ఇందుకు అనుగుణంగా పార్టీ శ్రేణులు ప్రజలను చైతన్యవంతం చేయడం ద్వారా ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడేందుకు సంసిద్ధులను చేయాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఐ ''దేశ వ్యాప్తంగా బద్లావ్ జరూరీ''(మార్పు అవసరం) పేరుతో విస్తృత రాజకీయ ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆగస్టు 6 నుంచి 14 వరకు జిల్లావ్యాప్తంగా పాదయాత్రలు నిర్వహించి, సెప్టెంబరు 1న ''ఛలో ఢిల్లీ'' మహా ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ తరగతులలో పార్టీ కర్తవ్యాలు, ప్రచారం అంశంపై సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, భారత జాతీయ ఉద్యమం, కమ్యూనిస్టు పార్టీ పాత్రపై జమ్ముల జితేందర్‌రెడ్డి కులం, మతం, వర్గ పోరాటం అనే అంశాన్ని సింగు నరసింహారావు ప్రపంచీకరణ, దాని ప్రభావంపై ఏనుగు వెంకటేశ్వరరావు భోధించారు. శిక్షణ తరగతులలో కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, తోట రామాంజనేయులు, బెజవాడ రవి బాబు, ఏనుగు గాంధీ, పావులూరి మల్లికార్జున్ రావు, ఎంఏ రహీం, యంగల ఆనందరావు, దూసరి గోపాలరావు, తూము రోషన్‌కుమార్, జక్కుల రామారావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర యువజన విధానం అమలు చేయాలి : గోద శ్రీరాములు



**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** పనిహక్కును ప్రాథమికహక్కుగా గుర్తించి, సమగ్ర యువజన విధానాన్ని అమలు చేయాలని, విద్య, వైద్య రంగాల వ్యాపారీకరణను అరికట్టాలని, అవినీతికి వ్యతిరేకంగా యువత పోరాడాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులుడు గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. గురువారం యాదగిరిగుట్ట వేదికగా సెప్టెంబర్ 8,9,10 తేదీలలో నిర్వహించనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర మూడో మహాసభ, బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక విధానాలపై పోరాడాలని కోరారు. సెప్టెంబర్ 8న విద్యా, వైద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే యువజన ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, ఎఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు రాఘవపురం వినయ్, కంబాల వెంకటేష్, పేరబోయిన పెంటయ్య, బంగారు, గోపగాని రాజు, మాటూరు మల్లయ్య, గుండు వెంకటేష్, ముక్కెర్ల పెంటయ్య, అనంతుల నరసింహ, పాకలపాటి రాజు, పేరబోయిన సత్యనారాయణ, రావుల శ్రీను, ఒంటెద్దు సంజీవ, శెట్టి నరసింహ, కంబాల సత్యం, సంఘీ అరవింద్, రాజేష్ నరసింహ తదితరులు పాల్గొన్నారు

# కార్మిక చట్టాలు, హక్కులు హరిస్తున్న కేంద్రం

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/కరీంనగర్:** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి కార్మిక చట్టాలు, హక్కులు హరిస్తూ, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని, పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను, 4 లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ఆరోపించారు. పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాల రక్షణకు కార్మికలోకం పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 6నుంచి వరకు కరీంనగర్‌లో జరగనున్న ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభల విజయవంతం కోసం కరీంనగర్‌లోని రైల్వేస్టేషన్ వద్ద గల కార్మికుల విశ్రాంతి కార్యాలయం ఆవరణలో గురువారం హమాలీ కార్మికుల సమావేశం ఎఐటియుసి అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో కార్మికులకు అండగా ఎఐటియుసి అనేక పోరాటాలు చేసిందన్నారు. కార్మిక ఉద్యమాలకు నిలయమైన కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగే ఎఐటియుసి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్మికుడిపై ఉందని, అందుకు మహాసభలకు కార్మికులు అండగా ఉండాలన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి పోరాటాలు అండగా ఉంటాయని వెంకట్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సమ్మయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, రైల్వే హమాలీ సంఘం అధ్యక్షుడు కాశెట్టి లక్ష్మయ్య, గాండ్ల రమేష్ ఉపాధ్యక్షులు, నాయకులు జంగ శంకర్, రఘుపతి, నగేష్ , హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



# కేంద్రం పాలన ఎండగట్టేందుకు పాదయాత్రలు



### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతు విధానాలను ఎండగట్టేందుకు ఆగస్టు 6 నుంచి 14 వరకు పాదయాత్రలు నిర్వహిస్తున్నట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్ నరసింహ పేర్కొన్నారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో శుక్రవారం కొల్లాపూర్ నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం టి. నరసింహ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి బాల్‌నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్‌నరసింహ మాట్లాడుతూ సిపిఐ జాతీయ సమితి పిలుపుమేరకు ప్రజా సమస్యలపై ఆగస్టు 6 నుండి 14వరకు కొల్లాపూర్ నియోజకవర్గం అంతా పాదయాత్రలు చేయనున్నట్లు పేర్కొన్నారు. పాదయాత్రలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను, యువతను ఉచిత హామీలు సంక్షేమ పథకాల పేరుతో ఏ విధంగా మోసం చేస్తున్నాయో ప్రజలకు వివరిస్తూ గ్రామాలలో ఉన్న సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం ప్రజలను చైతన్యం చేసి ప్రభుత్వాలపై తిరుగుబాటు చేసే విధంగా ఈ పాదయాత్రల కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో తుమ్మల శివుడు, బండి లక్ష్మి పతి, బిజ్జ శ్రీనివాసులు, కురుమయ్య, తన్నీరు మల్లయ్య, స్వామి, లక్ష్మి నారాయణ, సాయిలు, వెంకటస్వామి, రాధాకృష్ణ, రామకృష్ణ, లక్ష్మ ణస్వామి, బండి కృష్ణయ్య, పటేల్ రాముడు, మాషన్న, ఆంజనేయులు, సుదర్శన్‌రెడ్డి, గలెన్న పాల్గొన్నారు.

# అధికారులే కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారు

## హైడ్రాపై సింగిల్ జడ్జి ఉత్తర్వులు సమర్థనీయమే : హైకోర్టు మరో న్యాయమూర్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆధారాల్లేని ఆరోపణలతో కక్షిదారులు కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని తరచూ చెబుతున్నప్పటికీ, వాస్తవానికి కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నది ప్రభుత్వ అధికారులు, ప్రభుత్వ శాఖలేనని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రెవెన్యూ, హైడ్రా తదితర శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్లే ప్రైవేటు వ్యక్తుల ఆస్తులు కూల్చివేతలకు గురవుతున్నాయని పేర్కొంది. ఎలాంటి నిర్దిష్ట ఆదేశాలు లేకుండానే హైడ్రా అత్యుత్సాహంతో కూల్చివేతలు చేపడుతోందని, కోర్టు ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘించడం చట్టబద్ధ పరిపాలన వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించింది. ఇటీవల హైడ్రా వ్యవహారంలో సింగిల్ జడ్జి చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన ఉత్తర్వులు సమర్థనీయమేనని స్పష్టం చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ సర్వే నెం.60లోని 350 చదరపు గజాల ప్లాటులో కాంపౌండ్ వాల్, వాచ్‌మన్ గదిని హైడ్రా కూల్చివేయడాన్ని సవాలు చేస్తూ పెమ్మసాని సుధారాణి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎన్.వి.శ్రవణ్‌కుమార్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపున న్యాయవాది ఎస్.శ్రీధర్ వాదిస్తూ, సర్వే నెం.59లోని ప్రభుత్వ భూమి రక్షణకు సంబంధించి తహసిల్దార్ కలెక్టర్‌కు లేఖ రాశారని, ఆ మేరకు పోలీసు కమిషనర్‌కు రక్షణ కల్పించాలని కలెక్టర్ లేఖ రాశారని తెలిపారు. ఆ లేఖ ప్రతిని మాత్రమే హైడ్రాకు పంపారని, కూల్చివేతలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వివరించారు. అయినప్పటికీ ఎలాంటి నోటీసు ఇవ్వకుండా హైడ్రా కూల్చివేతలు చేపట్టిందన్నారు. ఇదే భూవివాదానికి సంబంధించి 2022లో హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా పట్టించుకోలేదని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. విచారణ సందర్భంగా హాజరైన తహసిల్దార్ తాను రాసిన లేఖ ప్రభుత్వ భూమి రక్షణ గురించేనని, కూల్చివేతలకు ఆదేశాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ న్యాయవాది కూడా అదే విషయాన్ని కోర్టుకు వివరించారు. హైడ్రా తరపు న్యాయవాది రెవెన్యూ అధికారుల సమాచారం మేరకే చర్యలు తీసుకున్నామని తెలిపారు. వాదనలు పరిశీలించిన న్యాయమూర్తి, కూల్చివేతల విషయంలో రెవెన్యూ శాఖకు, హైడ్రాకు మధ్య సమన్వయం లేదని రికార్డులే వెల్లడిస్తున్నాయని పేర్కొన్నారు. సర్వే నెం.59లో ప్రభుత్వ భూమి రక్షణకు సంబంధించి మాత్రమే హైడ్రాకు సమాచారం పంపారని, కూల్చివేతలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని స్పష్టం చేశారు. పిటిషనర్ స్థలం సర్వే నెం.60లో ఉండగా దానిపై అధికారులు ఎలాంటి వివరణ ఇవ్వలేదన్నారు. కాంపౌండ్ వాల్ ప్రభుత్వ భూమిలోనే ఉందని ఎలాంటి సర్వే లేకుండా ఎలా నిర్ధారించారని హైడ్రాను ప్రశ్నించారు. అక్టోబరు 3న లేఖ రాస్తే అక్టోబరు 4నే కూల్చివేతలు చేపట్టాల్సిన అత్యవసరం ఏమిటని నిలదీశారు. గతంలో ఇదే హైకోర్టు నోటీసులు ఇచ్చిన తర్వాతే చర్యలు తీసుకోవాలని చెప్పినా అమలు చేయలేదన్నారు. ఒకవేళ ఆక్రమణే అయినా చట్ట ప్రక్రియను అనుసరించడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. అధికారులు ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టేస్తూ కోర్టు ఉత్తర్వులను పట్టించుకోవడం లేదని, ఇది పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. తేదీల వారీగా పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ విచారణను ఆగస్టు 6కు వాయిదా వేశారు. తదుపరి విచారణలన్నింటికీ తహసిల్దార్ వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించారు.



### హైడ్రాకు జరిమానా రూ.10 వేలకు తగ్గింపు

ఇదిలా ఉండగా, హైదరాబాద్ వెంగళరావునగర్ సర్వే నెం.45లోని వివాదాస్పద భూమి వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేయాలన్న ఆదేశాలను ఏడాదికిపైగా అమలు చేయకపోవడంతో హైడ్రా కమిషనర్‌పై సింగిల్ జడ్జి విధించిన రూ.50 వేల జరిమానాను డివిజన్ బెంచ్ రూ.10 వేలకు తగ్గించింది. వెంగళరావునగర్‌లో యథాతథ స్థితి కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ కాంపౌండ్‌ను కూల్చివేసి బోర్డులు ఏర్పాటు చేయడాన్ని సవాలు చేస్తూ మహమ్మద్ షఫహతుల్లా దాఖలు చేసిన పిటిషన్‌లో కౌంటర్ దాఖలు చేయడంలో తీవ్ర జాప్యం జరగడంతో సింగిల్ జడ్జి రూ.50 వేల జరిమానా విధించారు. దీనిని సవాలు చేస్తూ హైడ్రా దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం.మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. జరిమానాను రూ.10 వేలకు తగ్గించింది.

# నిబంధనలకు విరుద్ధంగా నిథమ్ డైరెక్టర్ నియామకం

## నియామక జీవోను రద్దు చేసిన హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) డైరెక్టర్‌గా ప్రొఫెసర్ వి. వెంకటరమణ నియామకం నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని హైకోర్టు తేల్చిచెప్పింది. ఆయన నియామకానికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.206ను రద్దు చేస్తూ జస్టిస్ రేణుక యారా తీర్పు వెలువరించారు. తగిన అర్హతలు లేకుండానే వెంకటరమణను డైరెక్టర్‌గా నియమిస్తూ 2025 జులై 15న ప్రభుత్వం జారీ చేసిన జీవోను సవాలు చేస్తూ సెంటర్ ఫర్ బెటర్ గవర్నెన్స్ సంస్థ కోవారంటో పిటిషన్ దాఖలు చేసింది. పిటిషనర్ తరపు న్యాయవాది, నిథమ్‌లో గరిష్ఠ వేతనం రూ.85 వేల వరకు ఉండగా వెంకటరమణకు రూ.4 నుంచి 5 లక్షల వరకు చెల్లిస్తున్నారని, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి ప్రత్యేక సెలవు ఇప్పించి ఈ పదవిలో నియమించారని వాదించారు. ప్రభుత్వ తరపు న్యాయవాది మాత్రం ప్రభుత్వం ఆయన అర్హతలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని నియామకం చేపట్టిందని, గవర్నింగ్ కౌన్సిల్ కూడా ఆమోదించిందని వాదించారు.వాదనలు పరిశీలించిన న్యాయమూర్తి, నిథమ్ మెమొరాండం ఆఫ్ అసోసియేషన్‌కు విరుద్ధంగానే మొత్తం నియామక ప్రక్రియ సాగిందని పేర్కొన్నారు. డైరెక్టర్ నియామకానికి సంబంధించి గవర్నింగ్ కౌన్సిల్ నుంచి ఎలాంటి ప్రతిపాదన వచ్చినట్లు ఆధారాలు లేవని, అభ్యర్థి అర్హతలు, అనుభవానికి సంబంధించిన వివరాలు కూడా జీవోలో పొందుపరచలేదన్నారు. దీంతో గవర్నింగ్ కౌన్సిల్‌కు చెందిన అధికారాలను ప్రభుత్వం ఏకపక్షంగా తన చేతుల్లోకి తీసుకుందని వ్యాఖ్యానించారు. నియామకం జరిగిన తర్వాత గవర్నింగ్ కౌన్సిల్ ఆమోదం తెలిపినంత మాత్రాన చట్టవిరుద్ధమైన ప్రక్రియకు చెల్లుబాటు రాదని స్పష్టం చేశారు. నియామకమే నిబంధనలకు విరుద్ధమని తేలిన నేపథ్యంలో పిటిషనర్ చేసిన ఇతర ఆరోపణలను పరిశీలించాల్సిన అవసరం లేదన్నారు. జీవో నెం.206ను రద్దు చేస్తూ తీర్పు చెప్పారు.

# రిజర్వేషన్లు ఎత్తివేసేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రలు

## వి. హనుమంతరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దేశంలో బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను ఎత్తివేసేందుకు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు కుట్ర చేస్తున్నాయని ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆరోపించారు. బిసిల హక్కులు, రిజర్వేషన్లకు భంగం కలిగిస్తే రాష్ట్రవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. రాజ్యాంగ విలువలు, సామాజిక న్యాయం, రిజర్వేషన్ల పరిరక్షణ కోసం ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకమవాలని పిలుపునిచ్చారు.గురువారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ విద్యార్థుల ఆందోళన సమయంలో సామాజిక మాధ్యమాల్లో రిజర్వేషన్ల వ్యతిరేక ప్రచారం జరిగిందని, దాని వెనుక బీజేపీ మద్దతు ఉందని మర్శించారు. తెలంగాణ తరహాలో దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన నిర్వహించి జనాభా ప్రాతిపదికన సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, నిధుల కేటాయింపు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.వి. హనుమంతరావు, అయోధ్యలో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాల అంశం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే బిజెపి రిజర్వేషన్ల ఈ వివాదాన్ని తెరపైకి తీసుకొస్తున్నారని విమర్శించారు. తిరుమలలో హుండీ ఆదాయం, ఖర్చుల లెక్కలు పారదర్శకంగా నిర్వహిస్తారని, అదే పారదర్శకత అయోధ్యలో ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. అయోధ్యలో హుండీ ఆదాయం, విరాళాలు, వ్యయాల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాముడు దేశ ప్రజలందరి దేవుడని, అలాంటి దేవుడిని రాజకీయాల కోసం బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ఉపయోగించడం సరికాదని అన్నారు.

# హైదరాబాద్ మురుగునీటి అభివృద్ధికి కేంద్రం ఆర్థికసాయం అందజేయాలి

## ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మురుగునీటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి అమృత్ 2.0 కింద కేంద్ర సహాయం అందించాలని పార్లమెంట్ గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల స్థాయి కమిటికి భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం పార్లమెంట్ గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల స్థాయి కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షత వహించగా,22వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అటల్ మిషన్ ఫర్ రీజువెనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ ( అమృత్, అమృత్ 2.0) కింద నగరాల్లో మురుగునీటి ,సెప్టేజ్ నిర్వహణ సమీక్ష అంశంపై రూపొందించిన ముసాయిదా నివేదికను కమిటీ ఆమోదించింది. ఈ సమావేశానికి హాజరైన కమిటీ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి హైదరాబాద్ నగర మురుగునీటి వ్యవస్థ బలోపేతానికి సంబంధించిన కీలక ప్రతిపాదనలను కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. హైదరాబాద్‌లోని మూసీ నది వెంబడి 55 కిలోమీటర్ల పొడవున శుద్ధి చేయని మురుగునీరు నదిలో కలవకుండా అడ్డుకునే ట్రంక్ సీవర్ మెయిన్ ప్రాజెక్టును హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు ప్రతిపాదించిందని, సుమారు రూ.4,000 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టును అమృత్ 2.0 పథకం కింద చేర్చి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అలాగే, హైదరాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న 27 పట్టణ స్థానిక సంస్థలు ,ఔటర్ రింగ్ రోడ్ వరకు మురుగునీటి సదుపాయాలను విస్తరించే లక్ష్యంతో సమగ్ర సీవరేజ్ మాస్టర్ ప్లాన్ ను అమలు చేయాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. ఈ ప్రణాళికలో 7,444 కిలోమీటర్ల ట్రంక్ మెయిన్లు, లేటరల్ సీవర్ నెట్‌వర్క్ నిర్మాణం ప్రతిపాదించబడిందని తెలిపారు.ఈ సమగ్ర సీవరేజ్ మాస్టర్ ప్లాన్ అమలుకు రూ.17,212.69 కోట్ల కేంద్ర ఆర్థిక సహాయం మంజూరు చేయాలని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ప్రతిపాదించిందని, ఈ ప్రాజెక్టును అమృత్ 2.0 కింద లేదా ప్రత్యేక కేంద్ర ప్రాజెక్టుగా పరిగణించి ఆమోదించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# డిటిసిపి డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి సర్వీసు మరో ఏడాది పొడిగింపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డిటిసిపి) డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్. దేవేందర్ రెడ్డి పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించింది. పాలనాపరమైన అవసరాల దృష్ట్యా ఆయన సేవలను పునర్ నియమిస్తున్నట్లు మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వుల ప్రకారం దేవేందర్ రెడ్డి పదవీకాలం 2026 ఆగస్టు 1 నుంచి 2027 జూలై 31 వరకు మరో ఏడాది పాటు కొనసాగనుంది. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ఆదేశాలు, డిటిసిపి నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా గవర్నర్ పేరిట ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ ఉత్తర్వుల అమలుకు అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ కార్యాలయాన్ని ప్రభుత్వం ఆదేశించింది.

# యువ ఇంజినీర్లను అవమానించే హక్కు సిఎంకు ఎవరిచ్చారు? : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువ ఇంజినీర్లను అవమానించే హక్కు సిఎం రేవంత్ రెడ్డికి ఎవరిచ్చారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు ప్రశ్నించారు. ఈ మేరకు కెటిఆర్ తన ట్విటర్ 'ఎక్స్' వేదికలో పోస్ట్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి తన జీవితంలో ఎప్పుడైనా ఒక పోటీ పరీక్ష రాశారా? ఏదైనా ఉద్యోగానికి ఇంటర్వ్యూకు హాజరయ్యారా? ఏదైనా వృత్తిపరమైన సంస్థలో పని చేసిన అనుభవం ఉందా? అని ప్రశ్నించారు. దేశానికి సాంకేతిక నిపుణులు, ఇంజినీర్లను అందిస్తున్న తెలంగాణ యువతను అవమానించడం అత్యంత దురదృష్టకరమన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, రాష్ట్ర యువతకు క్షమాపణ చెప్పాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.



# ఆటో డ్రైవర్ల పొట్టకొట్టేందుకు ప్రభుత్వం యత్నం : కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'లాస్ట్ మైల్ కనెక్టవిటీ' పేరుతో ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పొట్టకొట్టేందుకు ప్రయత్నిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో కవితతో ఆటో డ్రైవర్లు గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ ఆర్టీసీ బస్సులో ఎక్కిన ప్రయాణికులు తాము దిగాల్సిన స్టేజీకి చేరుకున్న తర్వాత ఆటో బుక్ చేసుకుంటే సరిపోతుందని, కానీ ఆ ఆటోలను కూడా ప్రభుత్వమే నడిపేందుకు ప్రయత్నిస్తోందన్నారు. ఉచిత బస్సు వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి లేకుండా పోయిందని, పైగా ఈవీ ఆటోల పేరుతో భారీగా ఆటోలను తీసుకొచ్చి ప్రభుత్వమే వాటిని నడిపి ఆటో డ్రైవర్లను ఇబ్బంది పెడుతోందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆటోడ్రైవర్లు కనీసం ఈఎంఐ కూడా కట్టుకోలేని పరిస్థితిలో ఉన్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్లకు ఏటా రూ.12 వేలు ఇస్తామన్న మాటను విస్మరించారని ఆరోపించారు. ఉల్లంఘనల పేరుతో అటోలపై చలాన్ల మీద చలాన్లు వేస్తూ వాళ్లపైన అదనపు భారం మోపుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఆటో యూనియన్లతో ప్రభుత్వం చర్చించాలని, వారికి మేలు జరిగేలా నిర్ణయాలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు.

## ఎగుమతిదారుల సమస్యల పరిష్కారానికి

# సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

## అధికారులకు సిఎస్ ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఎగుమతులకు అనుకూలమైన విధానాలు, ఎగుమతిదారులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, కొత్త మార్కెట్ల అన్వేషణ తదితర అంశాలపైన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు.హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంజయ్‌జాజు అధ్యక్షతన 'రాష్ట్ర ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ' సమావేశం గురువారం జరిగింది. గత ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం నుంచి రూ.1,22,655 కోట్ల విలువైన ఎగుమతులు నమోదయ్యాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా వ్యవసాయ ఉత్పత్తులు, ఉద్యానవన పంటలు (హార్టికల్చర్), పౌల్ట్రీ ఉత్పత్తులు, వెజిటేబు సీడ్స్, రెడ్ చిల్లీ తదితర రంగాల్లో ఎగుమతులను గణనీయంగా పెంచే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్లకు మరింతగా ఎగుమతి చేసేందుకు రాష్ట్రంలో అనుకూల వాతావరణం ఉందన్నారు. అనంతరం సంజయ్‌జాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ అధికారులతో సమన్వయంతో వ్యవహరిస్తూ రాష్ట్ర ఎగుమతుల వృద్ధికి మరింత కృషి చేయాలని సూచించారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో పరిశ్రమలు, తయారీ యూనిట్లు, వ్యవసాయం, ఆహార ప్రాసెసింగ్, ఫార్మాస్యూటికల్స్, హస్తకళలు, ఐటీ ఆధారిత సేవలు తదితర రంగాల ఎగుమతులను మరింత ప్రోత్సహించేందుకు సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎగుమతుల ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి మరింత ఊతమివ్వడంతో పాటు తెలంగాణను దేశంలోని ప్రముఖ ఎగుమతి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో పర్యాటక, సంస్కృతి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, రవాణ శాఖ కమిషనర్ ఇల్లంబర్తి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ డా.జి.ముకుంద రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ఎగుమతుల ప్రోత్సాహక సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# దేశంలో 4 వేల ఇ-బస్సులను ప్రవేశపెట్టిన ఒలెక్ట్రా




**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో ఎలక్ట్రిక్ ప్రజా రవాణా రంగంలో ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. భారత రహదారులపై 4 వేల ఎలక్ట్రిక్ బస్సులను విజయవంతంగా ప్రవేశపెట్టిన తొలి సంస్థగా ఒలెక్ట్రా నిలిచింది. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్విందర్ సింగ్ సుఖు, ఉప ముఖ్యమంత్రి ముఖేశ్ అగ్నిహోత్రి సమక్షంలో ఒలెక్ట్రా మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ బాబు 4 వేలవ ఈబస్సును హిమాచల్ ఆర్‌టిసికి అందజేశారు. అదే కార్యక్రమంలో హిమాచల్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ కోసం కొనుగోలు చేసిన 297 ఎలక్ట్రిక్ బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలోని పలు రాష్ట్రాలు, నగరాల్లో ఒలెక్ట్రా ఈబస్సులు సేవలందిస్తున్నాయి. ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తూ, తక్కువ నిర్వహణ వ్యయం, అధిక సామర్థ్యంతో రాష్ట్ర రవాణా సంస్థల విశ్వాసాన్ని పొందుతున్నాయి. ఇప్పటివరకు ఒలెక్ట్రా ఈబస్సులు 73 కోట్ల (730 మిలియన్) గ్రీన్ కిలోమీటర్లకు పైగా ప్రయాణించాయి. దీనివల్ల 6.5 లక్షల టన్నులకు పైగా కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గి పర్యావరణ పరిరక్షణకు విశేషంగా దోహదపడినట్లు సంస్థ వెల్లడించింది. ఈ సందర్భంగా ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ మేనేజింగ్ డైరెక్టర్ మహేష్ బాబు మాట్లాడుతూ దేశంలో 4 వేల ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టిన తొలి సంస్థగా నిలవడం తమకే కాకుండా భారత విద్యుత్ వాహన రంగానికే గర్వకారణమన్నారు. ప్రజా రవాణా సంస్థలు తమపై ఉంచిన విశ్వాసానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

# టెలికాం ఆధారిత సైబర్ నేరాలపై ఉక్కుపాదం : శిఖా గోయెల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సాంకేతికతను సమర్థవంతంగా వినియోగిస్తూ, ప్రజల భద్రత కోసం టెలికాం ఆధారిత సైబర్ నేరాల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టేందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కట్టుబడి ఉందని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయెల్ స్పష్టం చేశారు. టెలికాం ఆధారిత సైబర్ నేరాల పెరుగుతున్న ధోరణులను అరికట్టేందుకు టిజిసిఎస్‌బి ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (డాట్)తో గురువారం ఉన్నతస్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. సైబర్ నేరాల నివారణ, దర్యాప్తు, బాధితుల రక్షణకు సంబంధించి వివిధ సంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. శిఖా గోయెల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (టెక్నాలజీ) కె. రాజశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (సెక్యూరిటీ) హేమంత్ రాఘ్వే, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) సీనియర్ అధికారులు, టెలికాం సేవల సంస్థల ప్రతినిధులు, టిజిసిఎస్‌బి అధికారులు పాల్గొన్నారు. సైబర్ మోసాల్లో వినియోగిస్తున్న సిమ్ బాక్స్‌లు, అక్రమ టెలికాం మౌలిక సదుపాయాల వినియోగాన్ని గుర్తించి అరికట్టేందుకు చర్యలను మరింత కఠినతరం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. బహుళ సిమ్ కార్డుల దుర్వినియోగాన్ని నిరోధించేందుకు టెలికాం సంస్థలుచట్ట అమలు సంస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని సూచించారు. అంతర్జాతీయ స్పూఫ్ కాల్స్, వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్ ఆధారిత మోసాలు, కాలర్ గుర్తింపును దాచిపెట్టే విధానాలను అడ్డుకునేందుకు నిపుణుల సంస్థలతో కలిసి సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

# 'దోస్త్' స్పెషల్ ఫేస్‌లో 53,967 సీట్లు కేటాయింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'డిగ్రీ ఆన్‌లైన్ సేవలు, తెలంగాణ (దోస్త్ ) 2026–27'విద్యా సంవత్సరానికి సంబంధించిన స్పెషల్ ఫేస్‌లో 53,967 సీట్లను కేటాయించింది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్, దోస్త్ కన్వీనర్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి, కళాశాల విద్య కమిషనర్ ఎ.దేవసేన దోస్త్ వివరాలను గురువారం ప్రకటించారు. మొత్తం 57,690 మంది అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోగా ఇందులో 53,967 ప్రవేశాలు పొందారు. 44,179 మందికి వారు కోరుకున్న మొదటి ప్రాధాన్యత కోర్సుల్లోనే సీట్లు దక్కగా, 9,788 మందికి ఆ తర్వాతి ప్రాధాన్యతల ఆధారంగా సీట్లు కేటాయించారు. చాలా తక్కువ సంఖ్యలో వెబ్ ఆప్షన్లు ఎంచుకోవడంతో 3,723 మంది విద్యార్థులకు ఏ సీటూ దక్కలేదు. ఫ్యాకల్టీల వారీగా పరిశీలిస్తే అత్యధికంగా కామర్స్ విభాగంలో 23,516 సీట్లు కేటాయించగా,ఫిజికల్ సైన్స్‌లో 10,988, లైఫ్ సైన్స్‌లో 10,316, ఆర్ట్స్ విభాగంలో 9,116 సీట్లు కేటాయించారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 30 నుండి ఆగస్టు 1వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ ఇవ్వాలని దోస్త్ సూచించింది. సాధారణ విద్యార్థులు రూ.500 లేదా రూ.1,000 చెల్లించాల్సి ఉండగా, ఈపాస్ ఫీజు రీయింబర్స్‌మెంట్ అర్హత పొందిన ప్రభుత్వ,యూనివర్సిటీ కళాశాలల విద్యార్థులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. ఆగస్టు 1వ తేదీలోపు కేటాయించిన కళాశాలల్లో నేరుగా రిపోర్ట్ చేసి ప్రవేశ ప్రక్రియను ముగించాలి. గడువులోగా కళాశాలల్లో రిపోర్ట్ చేయని విద్యార్థుల సీట్లు రద్దవుతాయని ఉన్నత విద్యా మండలి స్పష్టం చేసింది.

# ప్రమాణాలు పాటించని జూనియర్ కాలేజీల గుర్తింపు నిలిపివేత


**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో కనీస మౌలిక వసతులు, అగ్నిమాపక భద్రత, విద్యా ప్రమాణాలు పాటించని ప్రైవేటు జూనియర్ కళాశాలలకు '2026–27' విద్యాసంవత్సరానికి సంబంధించి గుర్తింపును నిలిపివేసినట్టు 'తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి' వెల్లడించింది. ప్రైవేట్ జూనియర్ కళాశాల యాజమాన్యాలన్నీ తప్పనిసరిగా నియమ నిబంధనలను పాటించాలని సూచించింది. టాస్క్‌ఫోర్స్ బృందాల తనఖీల్లో నిబంధనలు పాటించలేదని గుర్తించిన పలు కళాశాలలకు రూ.1 లక్ష నుంచి రూ.10 లక్షల వరకు భారీ జరిమానాలు విధించినట్లు స్పష్టం చేసింది. జూనియర్ కళాశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించే విధంగా భవిష్యత్తులోనూ టాస్క్‌ఫోర్స్ బృందాల తనిఖీలు కొనసాగుతాయని తెలిపింది.విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు తాము కట్టుబడి ఉన్నామని, నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని హామీ ఇచ్చింది. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠినమైన క్రమశిక్షణతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రవేశాలు పొందే ముందే సదరు కళాశాలకు ఇంటర్ బోర్డు గుర్తింపు ఉందా? లేదా? సరిచూసుకోవాలని ఇప్పటికే పలుమార్లు విస్తృతంగా ప్రచారం చేసినట్లు బోర్డు పేర్కొంది. ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యాలన్నీ తప్పనిసరిగా నియమనిబంధనలను పాటించాలని ఇంటర్ బోర్డ్ కార్యదర్శి అభిలాష అభినవ్ స్పష్టం చేశారు.

# ఆగస్టు 17 వరకు ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓపెన్ స్కూల్ అక్టోబర్ లో నిర్వహించబోయే ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ పరీక్షల ఫీజులను ఆగస్టు 17 వరకు చెల్లించాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ సూచించింది. రూ.25 ఆలస్య రుసుంతో ఆగస్టు 24 వరకు, రూ.50 ఆలస్య రుసుంతో ఆగస్టు 29 వరకు, తత్కాల్ లో సెప్టెంబర్ 2 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సొసైటీ డైరెక్టర్ కె.లింగయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం

## ఎల్.విజయకృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో బోధనేతర ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎల్ విజయకృష్ణా రెడ్డి అన్నారు. 'తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల బోధనేతర సంఘం (తుంటియా) డా.బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ బోధనేతర ఉద్యోగుల సంఘం అధ్వర్యంలో మొదటి కార్యనిర్వాహక సమావేశం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో గురువారం జరిగింది. ఈ సమావేశానికి విజయకృష్ణా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన పరిపాలనా సేవలను అందించడంలో బోధనేతర ఉద్యోగుల సేవలు కీలకమన్నారు. ఉద్యోగులు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేస్తూ విశ్వవిద్యాలయాల అభివృద్ధికి తోడ్పడాలని విజయకృష్ణా రెడ్డి సూచించారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల బోధనేతర ఉద్యోగుల సమస్యల పరిష్కారం, సంక్షేమం, సేవా అంశాలపై ఉమ్మడి వేదికగా ఈ సంఘం పనిచేయాలని ఆకాంక్షించారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణతో పాటు బాధ్యతాయుతమైన సేవా దృక్పథంతో విధులు నిర్వహించడం ద్వారా ఉన్నత విద్యా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల బోధనేతర సంఘం అధ్యక్షులు అబ్దుల్ ఖదీర్ ఖాన్, సెక్రటరీ జనరల్ కె. ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి జయరాం; గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, ఆ సంఘం మాజీ అధ్యక్షులు జైపాల్ రెడ్డితో పాటు వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన నాన్‌టీచింగ్ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఐసెట్ కౌన్సెలింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఐ సెట్2026 కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. కౌన్సిలింగ్‌కు ఆగస్టు 5వ తేదీ వరకు ఫీజు చెల్లించి స్లాట్‌ను బుక్ చేసుకోవాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీటు పొందిన విద్యార్థులు ఆగస్టు 11 నుంచి 14 వరకు కాలేజీల్లో చేరాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలో 202627 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం తుది దశ ఫేజ్ కౌన్సెలింగ్‌ను శుక్రవారం నుంచి ప్రారంభించనున్నారు. శనివారం సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహిస్తారు.

# రైతులపై ప్రభుత్వం ఆంక్షలు

## మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ఆరోపణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నదుల నీళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మూర్ఖత్వంతో వ్యవహరిస్తోందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి ఆరోపించారు. వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయాల్సివస్తుందనే ఉద్దేశంతోనే ప్రస్తుతం పంటలు పండించొద్దంటూ రైతులపై ప్రభుత్వం ఆంక్షలు విధిస్తోందని మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీష్ రెడ్డి మాట్లాడుతూ .కాళేశ్వరం విషయంలో మూర్ఖంగా మాట్లాడుతున్నారన్నారు. యాసంగి పంట కొనుగోలులో విఫలమయ్యారన్నారు. వడ్లకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే వరిని పండించకూడదని చెబుతన్నారని ఆయన ఆరోపించారు. కర్నాటకు నుంచి వరద వస్తున్నప్పటికీ జూరాల నుంచి నీళ్లు పూర్తి స్థాయిలో లిఫ్ట్ చేయడం లేదన్నారు. రాష్ట్రంలో 12 గంటలకు మించి కరెంటు సరఫరా కావడం లేదని, కరెంటు సరఫరా చేస్తే పంటలు పండుతాయని అన్నారు. కొత్త గూడెం లో 500 మెగావాట్ల కేంద్రాన్ని బంద్ పెట్టారని, థర్మల్ కేంద్రాలకు బొగ్గును కూడా సక్రమంగా సరఫరా చేయడం లేదని జగదీష్‌రెడ్డి ఆరోపించారు. కన్నెపల్లి లో లిఫ్ట్‌లు మొదలు పెట్టి అన్ని రిజర్వాయర్ల ను నింపాలని, సూర్యపేట వరకు నీళ్లు ఇవ్వాలంటే కన్నెపల్లి ఆన్ కావాల్సిందేనని తెలిపారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు ,బిఆర్‌ఎస్ నేతలు చింతల వెంకటేశ్వర్ రెడ్డి ,ధర్మేందర్ ,పల్లా ప్రవీణ్ ,తుంగ బాలు ,పడాల సతీష్ ,రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు నాణ్యమైన విద్య బంగారు భవిష్యత్తు ముఖ్యం

### అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** విద్యార్థులకు నాణ్యమైన విద్య బంగారు భవిష్యత్తు ముఖ్యమని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. గురువారం పోచంపల్లి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న విద్యార్థుల యూనిఫామ్ కుట్టు పనులను పరిశీలించేందుకు ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజన పథకం అమలును పరిశీలించారు. ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందిస్తున్నారా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారీ విధానం, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, తాగు నీటి సౌకర్యం, వంటగది నిర్వహణను పరిశీలించి అవసరమైన సూచనలు చేశారు.విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న ఆహారం నాణ్యత, రుచి, మెనూ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పథకం లో విద్యార్థులకు రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌లు త్వరగా అందించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి అధికారులు ఆయన వెంట ఉన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

### సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రాణాపాయం



**ప్రజాపక్షం/మునుగోడు:** తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం మునుగోడులో చోటుచేసుకుంది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన జాల అంజమ్మ పేరుపై ఉన్న భూమిని ఆమె తన కుమార్తె పద్మ పేరుపై పట్టా చేయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. అయితే అంజమ్మ పెద్ద కుమారుడు మల్లేష్ భార్య భాగ్యలక్ష్మి అందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పంచాయితీ పెట్టుకుంది.ఈక్రమంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చిన భాగ్యలక్ష్మి తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించింది.దీనిని గమనించిన కార్యాలయ సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆమెను అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు,పోలీసులు 108 అంబులెన్స్‌ను రప్పించి భాగ్యలక్ష్మిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

## బ్యాంకును తిరుగులేని ఆర్థిక శక్తిగా మారుస్తాం

### పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** మార్కెట్ సవాళ్లను ఎదుర్కొని పోచంపల్లి బ్యాంకును తిరుగులేని ఆర్థిక శక్తిగా మారుస్తామని ఆ బ్యాంకు చైర్మన్ తడక రమేష్ పేర్కొన్నారు. గురువారం ఆయన అధ్యక్షతన 53వ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి సమీకరించిన వాటా దినం రూ.16.89కోట్లు, డిపాజిట్లు రూ.327.26 కోట్లు మంజూరు చేసిన రుణాలు రూ.247.40 కోట్లు,జూన్ చివరి నాటికి సమీకరించిన వాటా దినం రూ.19.33కోట్లు డిపాజిట్లు రూ.358.17కోట్లు, మంజూరు చేసిన రుణాలు రూ.272.79 కోట్లు అని వివరాలు వెల్లడించారు. అత్యంత విశ్వసనీయతతో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తూ బ్యాంక్ దినదిన అభివృద్ధి చెందుతూ కార్పొరేట్ ప్రైవేట్ బ్యాంకులకు ధీటుగా ప్రథమ స్థానంలో నిలిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేస్తున్నారని బ్యాంక్ సీఈవో సీత శ్రీనివాస్ స్పష్టం చేశారు.2526 సంవత్సరంలో 42 శాతం వృద్ధి సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరానికి వాటాదారులకు 16% డివిడెంట్ చెల్లించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్ చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రమణ్యం, ఏలే హరిశంకర్, సూరేపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, బిట్టు భాస్కర్, మక్తాల నరసింహ, నూతలపాటి కృష్ణ, కిషోర్, అనంత రాములు, కొల్లి రామ్ గోపాల్ రావు, సీత సత్యనారాయణ, భోగ సిద్ధిరాములు, కొండ శంకరయ్య పాల్గొన్నారు.

## గిరిజన సంప్రదాయ, సంస్కృతికి నిలువెత్తు నిదర్శనం తీజ్ పండుగ

### తీజ్ వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** గిరిజన సాంప్రదాయానికి సంస్కృతి ఉట్టిపడేలా గిరిజన యువతులు తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నవధాన్యాలను పూజలు చేయడమే తీజ్ ముఖ్య ఉద్దేశమని గిరిజన సంప్రదాయ సంస్కృతి నిలువెత్తు నిదర్శనం తీజ్ పండుగ అని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండలంలోని బోయినిపల్లి తండాలో అంగరంగ వైభవంగా జరిగిన తీజ్ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజనులు ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం పలికారు అనంతరం గిరిజనులతో కలిసి గిరిజన నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్, పైలెట్ సింగల్ విండో చైర్మన్ మల్లేశం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుసత్యానారాయణ, సర్పంచ్ భూక్య రజిత రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# లిప్టుల రక్షణ రైతు బాధ్యత

### దొంగతనాలకు చెక్ పెడదాం

### సూర్యాపేట జిల్లా పోలీస్‌ల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** వ్యవసాయానికి ప్రాణదారమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల నిర్వహణ భద్రతతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల దొంగతనాల నివారణే ధ్యేయంగా సూర్యాపేట జిల్లా పోలీస్ యంత్రాంగం ముందడుగు వేసింది. హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పరిధిలోని రైతులు, ఇరిగేషన్, విద్యుత్, వ్యవసాయ అధికారులతో కలిసి హుజూర్‌నగర్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**రైతు కమిటీలు వేసి పర్యవేక్షించాలి**
**కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్**

కోట్ల రూపాయల వ్యయంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్లు, వైర్లు, అయిల్ దొంగతనానికి గురైతే చివరకు తీవ్రంగా నష్టపోయేది రైతాంగమేనని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. దొంగతనాలు జరిగాక పోలీసులు, ఇతర రాష్ట్రాలకు వెళ్లి నిందితులను పట్టుకుని సొత్తు రికవరి చేస్తున్నారని, అయితే దొంగతనాలు జరగకుండా ముందస్తుగా అడ్డుకోవడమే ముఖ్యమని స్పష్టం చేశారు. లిఫ్టల వద్ద తప్పనిసరిగా సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశమున్నందున రైతులు నీటిని ఆదా చేస్తూ తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు.

**రైతులకు పోలీసుల అండ... జిల్లా ఎస్‌పి కె.నర్సింహా**

దేశానికి వెన్నుముకైన రైతన్నలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా స్పష్టం చేశారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న లిఫ్ట్ పథకాలనే లక్ష్యంగా చేసుకుని దొంగలు వైర్లు, ఆయిల్ , ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తుకెళ్తున్నారని తెలిపారు. రైతుల మధ్య ఐక్యమత్యం, సామాజిక బాధ్యత పెరిగినప్పుడే దొంగతనాలకు చెక్ పెట్టవచ్చన్నారు. పోలీస్ శాఖ తరుపున లిఫ్టుల వద్ద పాయింట్ బుక్స్ ఏర్పాటు చేసి, నిరంతరం పెట్రోలింగ్ నిర్వహిస్తామని ఎస్‌పి హామీ ఇచ్చారు.

**లిఫ్టలను సొంత ఆస్తిగా భావించాలి**
**ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి**

ప్రభుత్వం రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేస్తున్న లిఫ్ట్ ఇరిగేషన్లను రైతులు తమ సొంత అస్తిగా భావించి రక్షించుకోవాలని కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి కోరారు. లిఫ్టలలో దొంగతనాలు జరిగితే సాగు నీరు అందక రైతులే నష్టపోతున్నారని అన్నారు. వ్యవసాయ రంగానికి నిరంతరం నీరందించేందుకు ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అనుక్షణం కృషి చేస్తున్నారని తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం, దొంగతనాల నివారణే ధ్యేయంగా ఇన్ని శాఖలను ఒకే వేదికపై తెచ్చి భారీ అవగాహన సదస్సు నిర్వహించిన జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని, ఎస్‌పి కె.నర్సింహాను ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజన్ అధికారి సూర్యనారాయణ, ఇరిగేషన్ సిఈ నాగభూషణం, విద్యుత్ డిఈ రామ్మోహన్‌రెడ్డి, డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, తహసిల్దార్ కవిత, ఇరిగేషన్, వ్యవసాయశాఖల అధికారులు, హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల పోలీసులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



## ‘సర్’ ప్రక్రియ చివరి మూడు రోజులు కీలకం

### ఒక్క ఓటూ తొలగిపోకుండా చూడాలి

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో చివరి మూడు రోజులు కీలకమని, ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్తపై ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, నల్గొండ పార్లమెంట్ సర్ ఇన్చార్జి బల్మూరి వెంకట్ అన్నారు. గురువారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సర్ కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువు ఆగస్టు 3తో ముగియనుండటంతో మిగిలిన సమయంలో క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి బల్మూరి వెంకట్ పాల్గొన్నారు. వారితో పాటు కె. శ్రీనివాస్, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య, మిర్యాలగూడ నియోజకవర్గ సర్ ఇన్చార్జి షబ్బీర్ అలీ, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పున్నా కైలాష్ నేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో సర్ ప్రక్రియపై అత్యధిక సమీక్షలు నిర్వహిస్తూ, నిత్యం పర్యవేక్షణ చేస్తున్న ఏకైక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అని అభినందించారు. సర్ విజయవంతంలో ఎమ్మెల్యే పర్యవేక్షణ కీలకమని అన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో వలస ఓటర్లు అధికంగా ఉన్నప్పటికీ ఇప్పటికే 86 శాతం నమోదు పూర్తి చేసి జిల్లాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నామని, మిగిలిన అర్హులందరినీ గుర్తించి వంద శాతం పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, సర్పంచ్ లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, ఇంచార్జులు, బిఎల్ఎ లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు ఉద్యోగం ప్రజాసేవకు అంకితం




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పోలీసు ఉద్యోగం కేవలం వృత్తి మాత్రమే కాకుండా ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణకు అంకితమైన గొప్ప బాధ్యత అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. జిల్లా పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పాటు నిబద్ధత,నిజాయితీ,క్రమశిక్షణతో సేవలందించి పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు ఎఎస్ఐ ఎన్.ప్రభాకర్,ఎఆర్‌హెడ్ కానిస్టేబుల్ బి. మోహన్ రావు,హెడ్ కానిస్టేబుల్ ఎం.డి. హిదాయత్ అలీ లకు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ ఘనంగా సన్మానించారు.జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందుతున్న అధికారులకు శాలువా కప్పి,జ్ఞాపిక అందజేసి, పుష్పగుచ్ఛాలతో సత్కరించి వారి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ సుదీర్ఘకాలం పాటు ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజలకు సేవలందించిన ఈ అధికారులు యువ పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎఎస్‌పి రమేష్, ఎఓ శివ ప్రసాద్,ఆర్ఐ సంతోష్, ఆర్ఎస్ఐ జంగయ్య, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు జయరాజు, సిబ్బంది, పదవీ విరమణ పొందిన అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# వచ్చే సంక్రాంతి నాటికి ఆయిల్‌పామ్ కంపెనీ సిద్ధమవ్వాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

### నాణ్యతలో ఎలాంటి రాజీ పడొద్దు



**ప్రజాపక్షం/హాలియా:** వచ్చే ఏడాది సంక్రాంతి నాటికి పతంజలి పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ కంపెనీ నిర్మాణాన్ని పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తేవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు.గురువారం అనుముల మండలంలోని యాచారం గ్రామంలో 39 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న పతంజలి పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ కంపెనీ నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నల్గొండ జిల్లా రైతులకు ఎంతగానో ఉపయోగపడే ఈపామ్ ఆయిల్ ప్రాసెసింగ్ కంపెనీ నిర్మాణాన్ని వేగవంతం చేసి సంక్రాంతి నాటికి అందుబాటులోకి తేవాలని ఆదేశించారు.నిర్మాణ యంత్రాల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు, విద్యుత్ ఏర్పాటు, ప్రాసెసింగ్ విభాగాలు, పార్కింగ్, ప్రధాన ప్రవేశ ద్వారం తదితర అంశాలను పరిశీలించి కంపెనీ ప్రతినిధులతో ముచ్చటించారు. జిల్లాలో పామాయిల్ పండించే రైతులకు మార్కెట్ సమస్య లేకుండా ఈప్రాసెసింగ్ యూనిట్ కీలకంగా ఉపయోగపడుతుందని చెప్పారు. జిల్లాలో ఈ కంపెనీ ఏర్పాటు వలన రైతులు పామాయిల్ సాగుపై మొగ్గు చూపే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు ఇప్పటికే కంపెనీకి సంబంధించిన పనులు 90 పూర్తయ్యాయని సివిల్ పనులు మరింత వేగంగా చేపడుతున్నామని తెలిపారు.నిర్మాణ పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా త్వరగా పనులు పూర్తి చేసి రైతులకు సంక్రాంతి నాటికి ఈ కంపెనీని అందుబాటులోకి తేవాలని కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ వెంట జిల్లా హార్టికల్చర్ అధికారి టి.శేఖర్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్,శాస్త్రవేత్త రాములమ్మ,పతంజలి ప్రతినిధులు సంఘం కుమార్, యాదగిరి, బొబ్బిలి వినాయక ఉన్నారు.



# దోపిడీ ఉన్నంతకాలం కమ్యూనిస్టుల పోరాటాలు ఉంటాయి

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** సమాజంలో పేదలు, కార్మికులు మరియు రైతులపై దోపిడీ, అసమానతలు కొనసాగుతున్నంత కాలం కమ్యూనిస్టుల పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి అన్నారు. గురువారం సంస్థాన్ నారాయణపురం మండలంలోని చిల్లాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సిపిఐ సీనియర్ నాయకులు మేకల రాములు సంస్మరణ సభకు పల్లా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నేటి పరిస్థితులలో దేశంలో కమ్యూనిస్టుల ఆవశ్యకత పెరిగిందని,. ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారన్నారు. అమర వీరుల స్ఫూర్తితో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పల్లా పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో రాజకీయపొత్తులు ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమాలకు వెనకాడబోమన్నారు. సిపిఐ సీనియర్ నాయకులు మేకల రాములు పార్టీలో క్రియాశీలక నాయకుడిగా పనిచేసే రాచకొండ ప్రాంతంలో దొరల భూస్వాముల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడాడని కొనియాడారు. గిరిజన తండాలో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పాలకుల దృష్టికి తీసుకువచ్చి సమస్యలను పరిష్కరించేవారన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మేకల రాములు సిపిఐ ఇచ్చిన పోరాట పిలుపుల్లో ముందుండేవారని, పాలకులు తనపై మోపిన అక్రమ కేసులకు భయపడకుండా జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. పార్టీ అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడేవారన్నారు. ఆయన పోరాటస్ఫూర్తితో జిల్లాలో కమ్యూనిస్ట్ కార్యకర్తలు ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాలా దామోదర్‌రెడ్డి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు సిపిఐలో చేరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్దె శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్‌రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సర్పంచ్ ముత్యాల ఆంజయ్య, చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు బి.జగన్, పాండు రంగారావు, ప్రవీణ్, పరమేష్‌తో పాటు రాములు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డిండి పేరును దేశవ్యాప్తం చేసిన అథ్లెటిక్ ప్రవళిక

**ప్రజాపక్షం/డిండి:** ఇటీవల కాలంలో చైనాలో నిర్వహించిన మొదటి ఏసియు అండర్ 23 అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో 4400 రిలేలో భారత దేశం తరుపున స్వర్ణ పతాకం సాధించిన డిండి పరుగుల రాణి నారిమళ్ళ ప్రవళికను గురువారం స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు సభ్యులు నారిమల్ల ప్రవళిక, కోచ్ పరశురాములు లను శాలువాతో సన్మానించారు. డిండి గ్రామం పేరును దేశవ్యాప్తంగా చాటి చెప్పిన ప్రవళిక వారి తల్లిదండ్రులతో పాటు కోచ్‌కు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందజేశారు.



## కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం నిధులు మంజూరుకు కృషి

### అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు సహకరిస్తా : ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి హామీ

### మర్యాదపూర్వకంగా కలిసిన కోదాడ బార్ అసోసియేషన్ ప్రతినిధులు

**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ పట్టణంలో నిర్మాణంలో ఉన్న నాలుగు కోర్టు కాంప్లెక్స్‌ల భవన నిర్మాణానికి త్వరితగతిన కోర్టు కాంప్లెక్స్‌ల భవన నిర్మాణానికి త్వరితగతిన నిధులు మంజూరు చేయిస్తానని, అలాగే స్థానికంగా అదనపు జిల్లా న్యాయస్థానం (అడిషనల్ డిస్ట్రిక్ కోర్టు) ఏర్పాటుకు కృషి చేస్తానని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతిరెడ్డి స్పష్టం చేశారు. గురువారం కోదాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మినారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ బాడీ ప్రతినిధులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందని హామీ ఇచ్చారు. నిర్మాణంలో ఉన్న కోర్టు భవనాలను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయిస్తామన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు అవసరమని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. అంతేకాకుండా అర్హులైన న్యాయవాదులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు చింతకుంట్ల లక్ష్మినారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు గట్ల నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ జానిపాషా, ట్రెజరర్ కోదూరు వెంకటేశ్వరరావు, కల్చరల్ సెక్రటరీ గాలి శ్రీనివాసనాయుడు, మహిళ ప్రతినిధులు ధనలక్ష్మి, హేమలత, దుర్గ, పెద్దబ్బాయి, శ్రీను, నాగులుపాషా, సీతారామరాజు, హనుమంతరావు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ప్రణాళికలు

### ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు :** మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి భువనగిరి నల్లగొండ జిల్లా వైద్యశాఖ ఉన్నత అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలో అధికార ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా వైద్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఉన్నత అధికారులకు పలు సూచనలు చేశారు.సబ్ సెంటర్లు పీహెచ్‌సిలు సిహెచ్‌లు ఏరియా ఆసుపత్రులను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలు, సిబ్బంది,సాంకేతిక పరికరాలు, కావలసిన నిధులకు సంబంధించిన వివరాలతో ప్రణాళికలు సిద్ధం చేయాలని మునుగోడు, నాంపల్లి, పీహెచ్‌సిల ఆధునీకరణతోపాటు 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడం, మర్రిగూడ సిహెచ్ ని 30 పడకల నుండి 50 పడకలకు పెంచడం సిబ్బంది నియామకం సాంకేతిక పరికరాలకల్పన పోస్టుమార్టం ఎగ్జామిన్ రూమ్ చండూరు రెవిన్యూ కేంద్రంలో వంద పడకలతో ఏరియా ఆసుపత్రి మంజురు నిర్మాణం, గట్టుపల్ పీహెచ్‌సి కి సిబ్బంది నియామకం సాంకేతిక పరికరాల కల్పనకు కావలసిన అంచనాలు రూపొందించాలన్నారు.చౌటుప్పల్ లో జాతీయ రహదారి 65 పై ప్రమాదాలు జరిగినప్పుడు గోల్డెన్ హవర్లో హైదరాబాదు తీసుకెళ్లలేకపోతున్నారని ఈలోపే చాలామంది మరణిస్తున్నారని చౌటుప్పల్ ప్రాంతంలో అత్యవసర చికిత్స కోసం ట్రామా కేర్ సెంటర్‌ని ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ట్రామా కేర్ సెంటర్ తో పాటు చౌటుప్పల్లో వంద పడకల ఏరియా ఆసుపత్రిని త్వరితగతిన పూర్తి చేసి సాంకేతిక పరికరాల కల్పనతో ఆధునికరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమీక్ష సమావేశం లోనల్లగొండ జిల్లా డిఎంహెచ్‌ఓ రాహుల్, డిసిహెచ్ మాత్రు నాయక్,యాదాద్రి భువనగిరి జిల్లా డి ఎంహెచ్‌ఓ మనోహర్,డిసిహెచ్ సూర్య శ్రీలతో పాటు మర్రిగూడ చౌటుప్పల్ ,చండూరు మునుగోడు,నాంపల్లి ,మర్రిగూడ వైద్యాధికారులు పాల్గొన్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

### దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ:** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, దేవరకొండ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతున్నామని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని 1, 2, 3 వార్డుల పరిధిలో ఖిల్లాబజార్, బొడ్రాయి బజార్, పాత పోలీస్టేషన్, మసీద్ ముందు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల పనులను, ముత్యాలమ్మ బజార్‌లో నిర్మిస్తున్న మురికి కాలువల పనులను ఎంఎల్‌ఏ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతపై అధికారులను అడిగి తెలుసుకొని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేష్‌గౌడ్, నజీర్ అహ్మద్, రాంసింగ్, సంబంధిత శాఖల అధికారులు, కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
31-07-2026
www.prajapaksham.in

"శర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ,లక్ష్మి రాధామోహన్ సమర్పిస్తున్న ఈ చిత్రం భారీ స్థాయి అత్యున్నత నిర్మాణ ప్రమాణాలతో అంచనాలను పెంచుతూనే ఉంది."


# రీల్



## 'మార్కండేయ'గా హీరో విక్రాంత్

సంతాన ప్రాప్తిరస్తు సినిమాతో తెలుగు ప్రేక్షకుల్లో తనకుంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు హీరో విక్రాంత్. ఈ సినిమాలో విక్రాంత్ నటనకు మంచి పేరొచ్చింది. సంతాన ప్రాప్తిరస్తు సినిమా థియేట్రికల్ గా మంచి విజయాన్ని సాధించింది. ఒటిటిల్లోనూ ప్రేక్షకుల ఆదరణ పొందింది. డిస్నీ హాట్ స్టార్, ప్రైమ్ వీడియోలో ఈ సినిమా 200 మిలియన్స్ మినిట్స్ వ్యూస్ దక్కించుకుని కొన్ని వారాల పాటు ట్రెండింగ్ లో నిలిచింది. ఈ సినిమా విజయం ఇచ్చిన ప్రోత్సాహంతో హీరో విక్రాంత్ ప్రస్తుతం పలు ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్ చేస్తున్నారు. విక్రాంత్ ప్రస్తుతం ప్రముఖ నిర్మాత దిల్ రాజు నిర్మాణ సంస్థ దిల్ రాజు డ్రీమ్స్ బ్యానర్‌లో మార్కండేయ అనే డివోషనల్ మిస్టికల్ థ్రిల్లర్ మూవీలో నటిస్తున్నారు. దిల్ రాజు డ్రీమ్స్ సంస్థ తొలి సినిమా హీరో విక్రాంత్ కావడం విశేషం. ఈ సినిమా త్వరలో చిత్రీకరణ జరుపుకోనుంది. మార్కండేయ సినిమా హీరో విక్రాంత్ కు మంచి ఫేమ్ తీసుకురానుంది. ఈ సినిమాతో పాటు హీరో విక్రాంత్ మధుర శ్రీధర్ రెడ్డి ప్రొడ్యూసర్ సురేశ్ బాబు కాంబినేషన్ లో ఓ ఇంట్రెస్టింగ్ హారర్ కామెడీ చిత్రంలో నటించబోతున్నారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన వివరాలు మేకర్స్ వెల్లడించనున్నారు. మార్కండేయ, మధుర శ్రీధర్ రెడ్డి సురేశ్ బాబు కాంబో మూవీస్ తో ఒక ప్రామిసింగ్ యంగ్ హీరోగా విక్రాంత్ ఎదుగుతాడనే అంచనాలు ఏర్పడుతున్నాయి. విక్రాంత్ హీరోగా మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటూ ఆయనకు డీల్ రాజు నిర్మాణ సంస్థ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'నన్నే నన్నే' పాట ఆవిష్కరణ



తమిళ, తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్న హీరో శ్రీరామ్ (శ్రీకాంత్) నటిస్తున్న కొత్త సినిమా 'ది మేజ్'. ఈ మూవీలో ప్రియాంక, ప్రితిక శ్రీనివాస్, కమల్ కామరాజు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని డాక్టర్ నైమిష రెడ్డి కసిరెడ్డి సమర్పణలో శ్రౌష కమల ఆర్ట్స్, యూఆర్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై డాక్టర్ ఉదయ్ కె. రెడ్డి పాల్వాయి, డాక్టర్ కేఎస్ఆర్ (కరెడ్డి శ్రీధర్ రెడ్డి), డాక్టర్ భరత్ రెడ్డి గోపు, డాక్టర్ అనిరుధ్ రెడ్డి సోమ నిర్మిస్తున్నారు. 'ది మేజ్' చిత్రాన్ని సరికొత్త సైకలాజికల్ థ్రిల్లర్ కథతో దర్శకుడు డాక్టర్ రవికిరణ్ గడలాయ్ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది. తాజాగా ఈ చిత్రం నుంచి హీరో ఆనంద్ దేవరకొండ చేతుల మీదుగా ఫస్ట్ సింగిల్ 'నన్నే నన్నే..' రిలీజ్ చేశారు. శ్రవణ్ భరద్వాజ్ బ్యూటిఫుల్ గా కంపోజ్ చేసిన ఈ పాటకు విజయ్ కుమార్ ప్లెజెంట్ లిరిక్స్ అందించారు. కపిల్ కపిలన్ రిపీటెడ్ గా వినాలనిపించేలా పాడారు. 'నన్నే నన్నే 'పాట ఎలా ఉందో చూస్తే..'నా ప్రాణం నీవే, నా ధ్యానం నీవే, నా మౌన గానం ఇకపై నీవే, నా స్నేహం నీవే, నా మోహం నీవే, నా తీరని దాహం ఇకపై నీవే, నా లోకం నీవై మనసిచ్చావే, మాలోకం గాన్నే మహా మెచ్చావే, నా గుడి దేవతవై ఒకటయ్యావే, ఏడడుగుల ప్రేమే ప్రకటించావే,నన్నే నన్నే మనిషిగా గుర్తించావే, నన్నే నన్నే మార్చేశావే, మన్ను, మిన్ను కలిపేలా పైవాడే, నన్నూ నిన్నూ కలిపాడే..' అంటూ హీరోయిన్ పట్ల హీరో ప్రేమారాధన చూపిస్తూ ఆకట్టుకునేలా సాగుతుంది . ఈ చిత్రానికి ఆర్ట్ డైరెక్టర్ రాజు అద్దాల, ఎడిటర్ సత్యగిడుతూరి, డిఒపి శివ కృష్ణ, మ్యూజిక్ శ్రావణ్ భరద్వాజ్.

## 'బలగం' నటులు ప్రధాన పాత్రలో 'పళ్ళబురుసు'



వేపపుల్లతో పళ్లు తోముకుంటున్న హీరోను చూసి గ్రామస్థులు 'పళ్ళబురుసు తెలీదా?' అని ప్రశ్నించడంతో టీజర్ ప్రారంభమవుతుంది. ఆ ఒక్క ప్రశ్నే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచింది. టీజర్ ముందుకు సాగే కొద్దీ విచిత్రమైన పాత్రలు, సరదా సంఘటనలు, ఊహించని మలుపులు కనిపిస్తాయి. అయితే 'పళ్ళబురుసు' అంటే ఏమిటన్న మిస్టరీని మాత్రం అలాగే కొనసాగిస్తూ మరింత క్యూరియాసిటీని పెంచుతుంది. ఫోక్ చార్ట్‌బస్టర్ 'కొత్త సోకు' పాటకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన వచ్చిన తర్వాత, 'పళ్ళబురుసు ' చిత్ర బృందం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీజర్‌ను విడుదల చేసింది. యువసామ్రాట్ నాగచైతన్య లాంచ్ చేసిన ఈ టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతూ, ప్రేక్షకులకు వినోదభరితమైన ప్రపంచాన్ని పరిచయం చేసింది.కామెడీ, భావోద్వేగాలు, పల్లెటూరి నేపథ్యాన్ని మేళవించిన 'పళ్ళబురుసు' మంచి విలేజ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. విజువల్స్, ఆకట్టుకునే హాస్యం, ఉత్సాహభరితమైన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌ను మరింత ఆకర్షణను తీసుకొచ్చాయి. ఇప్పటికే 'కొత్త సోకు' పాటతో ఆకట్టుకున్న గ్రామీణ వాతావరణాన్ని ఈ టీజర్ మరింత బలంగా చూపించింది. నాగచైతన్య టీజర్‌ను విడుదల చేయడంతో సినిమాకు మరింత క్రేజ్ ఏర్పడింది. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'పళ్ళబురుసు' చిత్రానికి ఉదయ్ చౌహాన్ దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది.

## 'భోగి' భారీ క్లైమాక్స్ పూర్తి



శర్వానంద్ హీరోగా, సంపత్ నంది దర్శకత్వంలో రూపొందుతున్న పాన్‌ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ,లక్ష్మి రాధామోహన్ సమర్పిస్తున్న ఈ చిత్రం భారీ స్థాయి అత్యున్నత నిర్మాణ ప్రమాణాలతో అంచనాలను పెంచుతూనే ఉంది. తాజాగా చిత్ర యూనిట్ భారీగా రూపొందించిన 22 రోజుల క్లైమాక్స్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసింది.ప్రొడక్షన్ డిజైనర్ కిరణ్ కుమార్ మన్నె రూపొందించిన భారీ సెట్లో ఈ క్లైమాక్స్‌ను చిత్రీకరించారు. ఈ ఒక్క షెడ్యూల్ కోసం దాదాపు మూడు నెలల పాటు ప్రత్యేకంగా ప్రీప్రొడక్షన్ పనులు నిర్వహించడం, మేకర్స్ ఈ సినిమాను ఎంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారో తెలియజేస్తోంది.భారీ యాక్షన్ ఎపిసోడ్లో 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఈ క్లైమాక్స్‌కు ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ ధిలీప్ సుబ్బరాయన్ యాక్షన్ను డిజైన్ చేశారు. థియేటర్లలో ప్రేక్షకులకు గూస్బంప్స్ ఇచ్చే స్థాయిలో ఈ యాక్షన్ సీక్వెన్స్ ఉండబోతుంది. సినిమాలో 'గంగ' అనే పవర్ఫుల్ పాత్రలో కనిపించనున్న శర్వా తన కెరీర్లోనే గుర్తుండిపోయే పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. ఈ పాత్ర కోసం ప్రతిరోజూ రెండున్నర గంటలకు పైగా ప్రత్యేక మేకప్ వేసుకోవడం, షూటింగ్ అనంతరం మరో గంటపాటు మేకప్ తొలగించే టఫ్ ప్రాసెస్ ను ఆయన పూర్తి అంకిత భావంతో చేశారు. అద్భుతమైన విజువల్స్‌తో తెరపై ఆవిష్కరిస్తుండగా, భీమ్స్ సిసిరోలియో తన మాస్ బిజిఎమ్, ఎమోషనల్ స్కోర్‌తో యాక్షన్ సన్నివేశాలను మరింత ఎలివేట్ చేయనున్నారు.అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం 1960 నేపథ్యంలో తెలంగాణమహారాష్ట్ర సరిహద్దులోని ఓ ఫిక్షనల్ విలేజ్ లో సాగుతుంది. గ్రామీణ నేపథ్యం కథగా రూపొంది స్తున్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

## 'నేను నా లల్లీ' ఆడియో విడుదల



దర్శకనిర్మాత, కథానాయకుడు ఎన్.ఎన్.ఆర్. చౌదరి నేతృత్వంలో రూపొందుతున్న సరికొత్త ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నేను నా లల్లీ'. ఇటీవల సెన్సార్ కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ కార్యాలయంలో సినీ ప్రముఖుల సమక్షంలో అత్యంత వైభవంగా 'నేను నా లల్లీ' ఆడియో విడుదల జరిగింది. బిగ్ సీడీని లాంచ్ చేసిన దర్శకుడు రాజవన్నెం రెడ్డి మాట్లాడుతూ 'నేను నా లల్లీ' చిత్రం క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. పాటలు చాలా బావున్నాయి. ట్రైలర్ సినిమాపై ఆసక్తిని కలగజేసింది. హీరో ఎన్.ఎన్.ఆర్. చౌదరి ఈ సినిమా ద్వారా బాలయ్య బాబుని మరోసారి గుర్తు చేస్తారు. చక్కటి నటనతో ఫ్యామిలీ ఆడియన్స్‌ని ఆకట్టుకోవడం ఖాయం అన్నారు. నటుడు అదిరే అభి మాట్లాడుతూ సినిమా ట్రైలర్ చూశాను. అదిరిపోయింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా ఉంది. సినిమాను ప్రేక్షకులు ఆదరించి విజయాన్ని అందించాలని కోరారు. విజన్ వి.వి.కె హౌసింగ్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ సీఎండి వి. విజయకుమార్ మాట్లాడుతూ 'నేను నా లల్లీ' క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. సినిమా చూసిన సెన్సార్ సభ్యులు ఎంతగానో ప్రశంసల వర్షం కురిపించారు. చిత్రం అందర్నీ అలరించే విధంగా రూపుదిద్దుకుంది. హీరో చౌదరి చక్కటి నటనతో అలరించి ప్రేక్షకుల మనసు దోచుకుంటారు. సినిమా తప్పకుండా మంచి విజయాన్ని అందుకుంటుందన్న గట్టి నమ్మకం నాకుంది తెలిపారు. వి. మహాలక్ష్మి మాట్లాడుతూ సినిమా ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే విధంగా తెరకెక్కింది. దర్శకనిర్మాత, కథానాయకుడు ఎన్.ఎన్.ఆర్. చౌదరి నేతృత్వంలో రూపొందుతున్న సరికొత్త ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నేను నా లల్లీ' ఘన విజయాన్ని సాధించాలని యూనిట్ సభ్యులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. హీరోయిన్ తస్లీమ్ మాట్లాడుతూ ఒక మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమాలో నటిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది అన్నారు.

## 'రామాయణ: పార్ట్ –1' ట్రైలర్ వచ్చేసింది



నితీశ్ తివారి దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, విజువల్ ఎఫెక్ట్స్ స్టూడియో డిఎన్ఇజి , యశ్ మానస్టర్ మైండ్ క్రియేషన్స్ భాగస్వామ్యంతో నిర్మితమవుతున్న 'రామాయణ పార్ట్ 1' ప్రపంచవ్యాప్తంగా దీపావళి సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని అంతర్జాతీయంగా సోనీ పిక్చర్స్, ఉత్తర భారతదేశంలో ధర్మ ప్రొడక్షన్స్ విడుదల చేయనున్నాయి. 'నమిత్ మల్హోత్రా 'రామాయణ: పార్ట్ 1' ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. జూలై 30 తెల్లవారుజామున విడుదలైన ఈ ట్రైలర్ హిందీ, కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రపంచవ్యాప్తంగా అభిమానులను, సినీ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విజనరీ మేకర్ నమిత్ మల్హోత్రా నుంచి ప్రపంచంలోనే అత్యంత శాశ్వతమైన మహాకావ్యాల్లో ఒకటైన రామాయణం ఆధారంగా ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా తెరకెక్కించారు. శ్రీరాముడు గా రణ్బీర్ కపూర్, రావణుడు గా యశ్, సీత గా సాయి పల్లవి, లక్ష్మణుడు గా రవీ దూబే, ఈ చిత్రంలో శ్రీరాముడి తండ్రి దశరథ మహారాజుగా అరుణ్ గోవిల్, నటి శోభన కైకేయిగా , అజింక్య దేవ్ విశ్వామిత్ర మహర్షిగా, కునాల్ కపూర్ ఇంద్రుడిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖగా, నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలైన హాన్స్ జిమ్మర్, ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని అందిస్తున్నారు.

## నాంపల్లి కోర్టుకు హాజరైన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోవిడ్ నిబంధనలు ఉల్లంఘన కేసులో గురువారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం కోర్టు కు హాజరయ్యారు. తద్వారా తనకు న్యాయస్థానాలు, చట్టం పట్ల అపారమైన గౌరవం ఉందని ఆయన చాటుకున్నారు. నాటి కొత్తగూడెం బిఆర్ఎస్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుమారుడు వనమా రాఘవేంద్రరావు (రాఘవ) వేధింపుల కారణంగా నాగ రామకృష్ణ కుటుంబ ఆత్మహత్యాయత్నం ఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్నారి సాహితిని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శ సమయంలో కోవిడ్ నిబంధనలు ఉల్లంఘించారంటూ అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం భట్టి విక్రమార్కపై కేసు నమోదు చేసింది. ఈ కేసుకు సంబంధించి నాంపల్లి లోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టుకు (ఎక్సైజ్ కేసెస్) విచారణ నిమిత్తం స్వయంగా డిప్యూటీ సిఎం హాజరయ్యారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి హోదాలో ఉండి కూడా ఒక సాధారణ పౌరుడిలా ఆయన కోర్టు కు హాజరు కావడం అందరినీ ఆకర్షించింది.

## కరీంనగర్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు
### ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ నగర ప్రజలకు ఆధునిక, సౌకర్యవంతమైన ప్రజా రవాణా సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం సాయంత్రం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బస్ స్టేషన్‌లో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను ఘనంగా ప్రారంభించారు. అనంతరం కరీంనగర్ బస్ స్టేషన్ నుంచి వాగేశ్వరి కాలేజీ వరకు సిటీ బస్సులో ప్రయాణించి ప్రయాణికులతో మమేకమయ్యారు. మొదటి దశలో కరీంనగర్–వాగేశ్వరి కాలేజీ, కరీంనగర్–చింతకుంట, కరీంనగర్–కొత్తపల్లి హవేలీ రూట్లలో సిటీ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న సిటీ బస్సుల డిమాండ్‌ను నెరవేర్చామని తెలిపారు. పెరుగుతున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని, విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు ఈ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతిరోజూ ఉపాధి కోసం చింతకుంట, ఓద్యారం, కొత్తపల్లి ప్రాంతాల నుంచి కరీంనగర్‌కు వచ్చే కార్మికులు, ఉద్యోగులు, అలాగే వాగేశ్వరి, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులకు ఈ బస్సులు ఎంతో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. భవిష్యత్తులో చల్మెడ, ప్రతిమ మెడికల్ కాలేజీ, మానకొండూరు వరకు కూడా సిటీ బస్సు సేవలను విస్తరిస్తామని ప్రకటించారు. ప్రయాణికుల ఆదరణను బట్టి అవసరమైతే ఒకే రూట్‌లో అదనపు బస్సులు నడపడంతో పాటు, 24 గంటల సేవలు అందించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలోని అన్ని ప్రాంతాలకు దశలవారీగా సిటీ బస్సు సేవలను విస్తరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, మేయర్ కొలగాని శ్రీనివాస్ మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్, హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఐటీ, పి, ఏఎమ్ & లీగల్) కె. రాజశేఖర్ రీజినల్ మేనేజర్ బి రాజు, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్. భూపతిరెడ్డి, డిప్యూటీ రీజనల్ మేనేజర్ (మెకానికల్) పి. మల్లేశం, కరీంనగర్ జోన్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ అధికారి బావ్ రావు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, డిపో మేనేజర్లు ఐ. విజయమాధురి (కరీంనగర్–1), ఎం. శ్రీనివాస్ (కరీంనగర్–2), ఎ. ప్రకాశ్‌రావు (సిరిసిల్ల), బి. శ్రీనివాస్ (వేములవాడ), ఎన్. రమేశ్ (జగిత్యాల), డి. హరి (మెట్‌పల్లి)తో పాటు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోట్లు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

జూన్ 30న రెండో విడతగా రూ.2 వేల కోట్లు, గురువారం మూడో విడతగా మరో రూ.2 వేల కోట్లు విడుదల చేసి మొత్తం రూ.6 వేల కోట్ల బకాయిల చెల్లింపును ప్రభుత్వం పూర్తి చేసింది.ఈ నిధులతో పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. మిగిలిన ఇతర బకాయిలను కూడా దశలవారీగా విడుదల చేస్తామని స్పష్టం చేసింది. నిధుల విడుదల పట్ల ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని ఉద్యోగ సంఘాలు పేర్కొన్నాయి. ఇచ్చిన హామీని అమలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ఉద్యోగ జెఏసి నేతలు కృతజ్ఞతలు తెలిపారు.

## రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

నిరోధక సవరణ బిల్లుపై రాజ్యసభలో గురువారం జరిగిన చర్చలో సందోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దురదృష్ట వశాత్తు కేంద్రంలో హృదయం లేని ప్రభుత్వం ఉన్నదని, మోదీ ప్రభుత్వానికి లీకేజీ, లాఠీఛార్జి మాత్రమే తెలుసునని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థులపై దాష్టీకంపై కేంద్ర మంత్రి అమిత్ షా సభకు వచ్చి ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఢిల్లీలోనే కాకుండి వివిధ ప్రాంతాలలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నారని, సభలో చర్చలో పాల్గొన్న ప్రతి ఒక్క అధికార పార్టీ సభ్యుడు విద్యార్థులను అవమానిస్తూ, అవహేళన చేస్తూ మాట్లాడడాన్ని ఆయన తప్పుబట్టారు. ఒకవైపు విద్యార్థుల ఆందోళన న్యాయమైనదేనని ప్రధాన మంత్రి అంటున్నారని, వారితో కేంద్ర మంత్రి నడ్డా చర్చలు జరిపారని, మరోవైపు సభలో మాత్రం విద్యార్థులను అవమానించటమేమిటని ప్రశ్నించారు.

**విద్యార్థులను డబ్బు యంత్రాలు చేశారు**

నీట్‌ను నిర్వహించే ఎన్‌టిఎ సంస్థ సొసైటీ రిజిస్ట్రేషన్‌ల చట్టం కింద కేవలం రూ.50 చెల్లించి రిజిస్టర్ అయిందని, అది పార్లమెంటుకు ఎలా జవాబుదారీగా ఉంటుందని సందోష్‌కుమార్ విమర్శించారు. దేశంలో రాజకీయ పార్టీలకు, కోచింగ్ మాఫియా మధ్య అపవిత్ర బంధం ఉందన్నారు. తక్షణమే నీట్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష విద్యార్థులందరికీ సమానవకాశాలు కల్పించదని, రాష్ట్రా సిలబస్ చదివిన విద్యార్థులు.. సిబిఎస్ఇ చదివిన విద్యార్థులతో పోటీ పడలేరని చెప్పారు. కాబట్టి నీట్‌ను రద్దు చేయాలన్నారు. కోచింగ్ సెంటర్‌లపై నియంత్రణ లేకుండా పోయిందని, అవి విద్యార్థులను డబ్బు యంత్రాలుగా మార్చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర, కేంద్ర స్థాయిల్లో కోచింగ్ సెంటర్‌లపై నియంత్రణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## 'చందా చోర్, గద్దీ ఛోడ్'

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన ఆందోళనలో విద్యార్థి నిరసనకారులపై ప్రాణాంతక ఆయుధాలు ఉపయోగించమని భద్రతా సిబ్బందికి ఇచ్చిన ఆదేశాలను సూచిస్తున్నట్లు స్పష్టమవుతోంది. రామ మందిరంలో విరాళాల చోరీ ఆరోపణలు, గత వారం విద్యార్థుల నిరసనల సమయంలో వారి పట్ల అమానుషంగా ప్రవర్తించడం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెడతామని ఇండియా ఇండియా కూటమి స్పష్టం చేసింది.

**హాకీ జట్టు జెర్సీకి కాషాయ రంగు :** మండిపడ్డ విపక్ష ఎంపిలు భారత హాకీ జట్టు జెర్సీ రంగును కాషాయ రంగులోకి మార్చడంపై ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ప్రతిపక్ష నాయకులు మండిపడ్డారు. భారత సైన్యం యూనిఫాం కూడా మార్చివేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ప్రతిచోటా కాషాయ రంగును రుద్దడానికి ప్రయత్నిస్తున్నాయని వారు ఆరోపించారు. భారత పురుషుల, మహిళల హాకీ జట్లు తమ సాంప్రదాయ నీలి రంగు కిట్‌లకు బదులుగా కాషాయ రంగు జెర్సీలను స్వీకరించిన నేపథ్యంలో పార్లమెంట్ ప్రాంగణంలో ప్రతిపక్ష నాయకులు ఈ వ్యాఖ్యలు చేశారు. ఆర్ఎస్ఎస్ ప్రభావంతో కూడిన విద్యావిధానం ద్వారా ప్రభుత్వం యూనిఫాంలను, చరిత్రను కూడా మార్చవచ్చని, అయితే ఈ విషయాలపై యువత అభిప్రాయాలను అర్థం చేసుకోవడం చాలా అవసరమని కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా పేర్కొన్నారు. 'ఈ దేశ స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటం సత్యం, అహింస ఆధారంగా జరిగింది. అందులో ఆర్ఎస్ఎస్ ప్రమేయం ఎక్కడా లేదు' అని ఆమె అన్నారు. దేశం సత్యాన్ని గుర్తిస్తోందని, అలా గుర్తించని వారు బిజెపి–ఆర్ఎస్ఎస్‌ల అసలు ఉద్దేశాలను గ్రహించడం ప్రారంభిస్తున్నారని ఆమె అన్నారు. బిజెపి ప్రతీదాన్నీ కాషాయీకరించాలని చూస్తోందని, హాకీ జెర్సీని మార్చిన తర్వాత సైన్యం యూనిఫాంను కూడా మార్చవచ్చని కాంగ్రెస్ ఎంపి అమర్ సింగ్ ఆరోపించారు.ఈ చర్య చాలా దురదృష్టకరమన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ రాజకీయ పార్టీ కూడా అటువంటి చిహ్నాలను మార్చకూడదని సింగ్ నొక్కి చెప్పారు. ఈ వివాదం బిజెపి 'సంకుచిత భావజాలాన్ని' ప్రతిబింబిస్తోందని కాంగ్రెస్ నాయకుడు తారిఖ్ అన్వర్ కూడా ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. 'అది విద్యారంగమైనా లేదా ఇతర రంగాలైనా, ప్రతిచోటా ఒక నిర్దిష్ట భావజాలాన్ని రుద్దే ప్రయత్నం జరుగుతోంది. ఈ వివాదం ఆ సంకుచిత ఆలోచనా విధానానికి ప్రతీక' అని ఆయన అన్నారు. టిఎంసి నాయకుడు కీర్తి ఆజాద్ మాట్లాడుతూ, 'ఆరెంజ్ రంగు, గ్రీన్ రంగుల విషయానికొస్తే, అది అంత ముఖ్యం కాదు. మైదానంలో ప్రదర్శనకే ప్రాధాన్యత ఇవ్వాలి. క్రికెట్‌లో కూడా మేం తెల్లటి దుస్తుల్లోనే ఆడేవాళ్లం. విజయం రంగుల వల్ల రాదు; అది ప్రదర్శన వల్ల వస్తుంది. గుర్తుంచుకోండి, మీరు గుడికి, మసీదుకు, గురుద్వారాకు లేదా చర్చికి వెళ్లి, వంద రూపాయలు సమర్పించి, 'దేవా, రేపు నేను సెంచరీ చేసేలా సహాయం చేయి' అని ప్రార్థించవచ్చు. కానీ అది జరగదు. కాబట్టి, ఇది దుస్తుల రంగుకు సంబంధించిన విషయం కాదు; ఇది క్రీడలో మీ సామర్థ్యానికి సంబంధించినది' అని అన్నారు. అయిత సాంప్రదాయ నీలిరంగు జెర్సీని మార్చాల్సిన అవసరాన్ని ఆజాద్ ప్రశ్నించారు

## రూ.803 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

విష్ణువర్ధన్ రెడ్డిలు గురువారం సాయంత్రం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలోని బోధి సెంటర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయం మీడియా సెంటర్‌లో నిపుణుల కమిటీ చైర్మన్ డాక్టర్ జీ.చిన్నారెడ్డి మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం వల్ల రాష్ట్రంలో ఏర్పడే సవాళ్లను ముందుగానే అంచనా వేసి, వివిధ శాఖల సమన్వయంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. రైతులకు నష్టం తగ్గించేలా నీటి వినియోగంలో పొదుపు, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, నాణ్యమైన విత్తనాల అందుబాటు, పశుగ్రాస భద్రత, ఉద్యాన పంటల విస్తరణ, వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వంటి అంశాలకు నివేదికలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు.గత మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని ఆయన తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమను, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వం అమలు చేయదగిన ఆచరణాత్మక సూచనలను కమిటీ ప్రభుత్వానికి అందజేస్తుందని చెప్పారు. అనంతరం వివిధ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధనా సంస్థల ప్రతినిధులు సంయుక్తంగా రూపొందించిన నివేదికలోని ముఖ్యాంశాలను కమిటీ సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నివేదికలో తక్షణ, మధ్యకాల, దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళికలతో పాటు రైతుల జీవనోపాధి పరిరక్షణ, నీటి వనరుల సమర్థ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం, పశుగ్రాస భద్రత, గ్రామీణ ఉపాధి కల్పన వంటి అంశాలపై సమగ్ర సిఫార్సులు చేశారు.రాష్ట్రంలో సాధారణ నైరుతి రుతుపవనాల వర్షపాతం 740.60 మిల్లీమీటర్లు కాగా, జూలై 27 నాటికి 234.80 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదై, సాధారణంతో పోలిస్తే సుమారు 30 శాతం లోటు నమోదైనట్లు కమిటీ పేర్కొంది. రాష్ట్రంలోని అత్యధిక జిల్లాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడంతో పాటు భూగర్భ జలమట్టం కూడా గణనీయంగా పడిపోయినట్లు నివేదికలో వివరించింది. వరి సాగును నీటి లభ్యత ఆధారంగా పరిమితం చేయడంతో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తృతంగా ప్రోత్సహించాలని, బ్రాడ్ బెడ్ అండ్ ఫరో, రిడ్జ్ అండ ఫరో, మల్చింగ్, వర్షపు నీటి సంరక్షణ, ఫార్మ్ పాండ్లు, భూగర్భ జలాల రీఛార్జ్ వంటి నీటి సంరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని నివేదిక సూచించింది.ఉద్యాన పంటల సాగును విస్తరించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని కమిటీ అభిప్రాయపడింది. తక్కువ వ్యవధి కూరగాయల సాగు, ఆయిల్‌పామ్, పండ్ల తోటలు, పట్టుపరిశ్రమ ఆధారిత సాగును ప్రోత్సహించాలని, డ్రిప్ ఇరిగేషన్, శాశ్వత పందిళ్లు, షేడ్‌నెట్ హౌస్‌లు, వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలకు సబ్సిడీలు అందించాలని సూచించింది.పశుసంవర్ధక రంగంలో పశుగ్రాస కొరత తలెత్తకుండా జిల్లా వారీగా పశుగ్రాస బ్యాంకులు ఏర్పాటు చేయడం, మేత పంటల సాగును విస్తరించడం, సైలేజ్, హే తయారీ, అజోల్లా సాగు, పశుగ్రాస విత్తనాల పంపిణీ, అవసరమైతే పశు శిబిరాల నిర్వహణ, పశువులకు తాగునీటి వసతుల కల్పన వంటి చర్యలు చేపట్టాలని కమిటీ సిఫార్సు చేసింది.గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చెక్‌డ్యాంలు, ఫార్మ్‌పాండ్లు, చెరువుల పూడికతీత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల రీఛార్జ్ పనులను విస్తృతంగా చేపట్టి నీటి వనరులను బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించాలని సూచించింది.మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, జలాశయాల్లోని నీటిని సమర్థవంతంగా వినియోగిస్తూ తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత కల్పించాలని నివేదిక పేర్కొంది. ప్రత్యామ్నాయ పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అవసరమైతే మార్కెట్ జోక్యంతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో ప్రతిపాదించిన ఈ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను తక్షణమే అమలు చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పత్తి, రైతుల జీవనోపాధి, తాగునీటి భద్రత, పశుగ్రాస లభ్యత, గ్రామీణ ఉపాధి పరిరక్షణతో పాటు రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని మరింత స్థిరంగా నిలబెట్టవచ్చని కమిటీ పేర్కొంది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com